fb/prajasakti, www.prajasakti.com


సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 69 | విజయవాడ, ఆదివారం 11 మార్చి 2018 | 12+12 పేజీలు + స్నేహ వెల : 5.00



టిడిపిలో పెద్దల పేచీ



ఉత్తరాంధ్ర టిడిపి సీనియర్ నేత మూర్తికి రాజ్యసభ సీటు ఇవ్వాలని శనివారం విశాఖలోని ఆర్కేబీచ్‌లో జల దీక్ష చేస్తున్న ఆయన అనుచరులు

అభ్యర్థులను తేల్చని అధిష్టానం
ఆర్థికమే కీలకం ?
విశాఖలో ఎంవివిఎస్ మూర్తికి సీటు ఇవ్వాలని జలదీక్ష
మూడో అభ్యర్థిపై సందిగ్ధం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ముదురుపాకాన పడింది. ఎవరినీ తేల్చకపోవడం, కుల సమీకరణలు, రాజకీయ అనుభవాలు, జాతీయస్థాయిలో రాజకీయం నడపగలిగే సమర్థత అంటూ పెట్టుకున్న ప్రాధాన్యతలతో ఎంపిక ప్రక్రియ నానుతోంది. రెండురోజుల గా దీనిపైనే చర్చ జరుగుతున్నా ఇంకా తేల్చలేదు మూడో అభ్యర్థిని బరిలోకి దింపే విషయంలోనూ సందిగ్ధత కొనసాగుతోంది. ఆనవాయితీ ప్రకారం నామినేషన్ ముందు రోజు రాత్రి మాత్రమే అభ్యర్థుల వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. దీంతో గ్రూపు తగాదాలు తెరపైకి వచ్చాయి. విశాఖలో ఎంవివిఎస్ మూర్తికి రాజ్యసభ అభ్యర్థిత్వం ఇవ్వాలని కోరుతూ ఆర్‌కె బీచ్‌లో టిడిపి నాయకులు జలదీక్ష చేశారు. మిగిలిన నేతల అనుచరులు కూడా ఇదేవిధమైన డిమాండ్లు చేస్తున్నారు. ఎస్‌సి, బిసి నుండి చెరొకరికి రాజ్యసభ సీట్లను కేటాయిస్తామని టిడిపి అధినేత కొంత కాలంగా చెబుతున్నట్లు సమాచారం. అయితే, తాజాగా సిఎం రమేష్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు టిక్కెట్ ఇవ్వాలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు సమాచారం. ఇటీవల రాయలసీమ రాజకీయాల్లో టిడిపి అభ్యర్థుల గెలుపులోనూ రమేష్ ముఖ్యపాత్ర పోషించారని కూడా భావిస్తున్నట్లు సమాచారం. దీంతో బిసి, ఎస్సీలలో ఎవరో ఒకరికి టిక్కెట్ ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే టిడిపి శ్రేణుల్లో అసంతృప్తికి దారి తీసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం టిడిపికి కీలకంగా ఉన్న బిసిలకు సీటు ఖరారు చేసే అవకాశం ఉంది. సీనియర్ నేతగా

ఉన్న దేవేందర్‌గౌడ్ తనకు మరో అవకాశమివ్వాలని అధిష్టానానికి లేఖ రాశారు. మరో సీనియర్ నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు కూడా తనకు రాజ్యసభ సీటు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో సుదీర్ఘకాలం పనిచేశానని, జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలనే ఆలోచన ఉందని గతంలో అనేకసార్లు తన అభిప్రాయం

మిగతా 9లో

బీద, సిఎం రమేష్ లకే ?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

అసెంబ్లీలో ఎమ్మెల్యేల బలాబలాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీకి లభించే రెండు రాజ్యసభ స్థానాలకు అధిష్టానం పేర్లు ఖరారు చేసింది. ఎన్నికల ఏడాది, రాజకీయ సమీకరణలు వీటన్నింటినీ బేరీజు వేసుకున్నాక బీసీ సామాజిక తరగతికి చెందిన పారిశ్రామికవేత్త బీద మస్తాన్‌రావు, అగ్రవర్ణాలకు చెందిన మరో పారిశ్రామికవేత్త సిఎం రమేష్ పేర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు దాదాపు ఖరారు చేశారు. ఆదివారం పొలిట్‌బ్యూరో అనుమతి అనంతరం అధికారికంగా ప్రకటించనున్నారు. అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటే తప్ప బీద, సిఎం రమేష్ లు అభ్యర్థులుగా నిలవడం ఖాయమని టిడిపి నాయకులు చెబుతున్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ (జెపి)కు అవకాశం ఇవ్వాలనుకున్నప్పటికీ, ఆయన పేరును జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రతిపాదించినప్పటికీ, చంద్రబాబు వెనక అడుగు వేసినట్లు టిడిపి వర్గాలు వెల్లడించాయి. బీసీల నుంచే పంచుమర్తి అనురాధ, ఎస్సీల నుంచి వర్ల రామయ్య తమను రాజ్యసభకు పంపాలని కోరగా సిఎం సున్నితంగా తిరస్కరించారు. పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరినట్లు సమాచారం. తెలంగాణా నాయకులకు ఇవ్వలేమని స్పష్టం చేసినట్లు తెలిసింది. సిఎం రమేష్ ఢిల్లీలో తన ఇండస్ట్రియల్ లాబీ, కొంత మంది బిజెపి నేతలతో చంద్రబాబుకు చెప్పించినట్లు సమాచారం.

'రాజ్యసభ' కోసం భారీ నజరానాలు..!

మూడో అభ్యర్థిని పెట్టకుండా ప్రయత్నాలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

రాజ్యసభ స్థానం కోసం ఓ బడా పారిశ్రామికవేత్త తన సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తన చిరకాల కోరిక తీర్చుకోడానికి రూ.కోట్లు ఖర్చుచేయ డానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన అంతర్జాతీయ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసిపి రాజ్యసభ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. వైఎస్ జగన్ 2014 ఎన్నికల్లో రాజ్యసభ టికెట్ ఇస్తామని చెప్పడంతో ఆ పార్టీ అభ్యర్థుల కోసం భారీగా డబ్బు కుమ్మరించారు. రాజ్యసభ స్థానం కోసం తొలుత వైసిపితో ఉన్న ఆయన మళ్లీ టిడిపిలోకి చేరారు. అక్కడ ఏలాంటి ప్రయోజనం లేకపోవడంతో ప్రస్తుతం వైసిపిలో చేరారు. దాంతో ఆయనకు ఆ పార్టీ రాజ్యసభ సీటు ప్రకటించింది. టిడిపి మూడో అభ్యర్థిని పెట్టకుండా ఢిల్లీ స్థాయిలో రాజకీయాలు నడుపుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగా నెల్లూరు జిల్లాకు చెందిన ఓ ప్రముఖ జాతీయ నేతకు చెందిన సేవా సంస్థకు ఏకంగా రూ.25 కోట్లు ఇవ్వడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఎన్నికలు జరిగితే స్వపక్షంలోని ఎమ్మెల్యేల ఓట్ల కోసం భారీగా ఖర్చుపెట్టడానికి సముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అంతర్జాతీయ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా అనేక సామాజిక, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2014 ఎన్నికల సమయంలో తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. జగన్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తనకు రాజ్యసభ టికెట్ ఇస్తామని చెప్పారని, అప్పట్లో ప్రచారం చేసుకున్నారు. ఆ ఎన్నికల్లో జిల్లాలో వైసిపి అభ్యర్థుల విజయం కోసం భారీగా ఖర్చుపెట్టినట్లు సమాచారం. ఎన్నికల అనంతరం ఆ పార్టీ ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వలేదు. దాంతో కొద్ది రోజులు మౌనంగా ఉన్నారు. అనంతరం టిడిపితో చెట్టాపట్టాల్ వేసుకుంటూ తిరిగారు. ఆ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేశారు. గతంలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో టిడిపి తన నాలుగో అభ్యర్థిగా వేమిరెడ్డి పేరును పరిశీలించిన విషయం తెలిసిందే. కాని సీటు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో మూడు రాజ్యసభ సీట్లు ఖాళీ అయ్యాయి. వైసిపి అధినేత జగన్ నుంచి

మిగతా 9లో

వేసవి ప్రణాళిక ఏదీ..?

ఈ ఏడాదీ ఎండలూ అధికమే
తాగునీటికి కటకటలే..



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేసవి సమీపించినా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు తగిన కార్యాచరణప దృష్టి సారించలేదు. ఈ వేసవిలో రిజర్వాయర్లలో ఇప్పటికే నీటి కొరత ఉందని కృష్ణాబోర్డు ప్రకటించింది. ఈసారి నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు ఈ వేసవిలో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని ప్రకృతి విపత్తుల విభాగం ప్రకటించింది. అయినా ఇంతవరకు ముందస్తు, ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించలేదు. ఇందుకు తాజా బడ్జెట్లోనూ కేటాయింపులు పెద్దగా లేవు. సమస్య ఉత్పన్నమైన తరువాత హడావుడి ఖర్చులతో, తాత్కాలిక ఉపశమన చర్యలతో పార్టీ నాయకుల జేబులు నింపే పనులు చేపడుతుంటారనే ఆరోపణలు లేకపోలేదు. చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా అవి ప్రచారానికి మాత్రమే తప్ప క్షేత్రస్థాయిలో వాటి ప్రభావం కనిపించడం లేదు. వాస్తవంగా ఇప్పటికే దీనిపై ఒక యాక్షన్ ప్లాను రూపొందించుకుని మార్చి మధ్య నుండి దీన్ని అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈసారి మంచినీటి సమస్య తీవ్రమయ్యే అవకాశాలున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. విజయవాడ నగరానికి ఈ సారి సమస్య ఉత్పన్నం కావొచ్చని చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో మంచినీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లు కావాల్సి ఉంది. విజయవాడ, గుంటూరు వంటి నగరాల్లో ఇంతవరకు

మిగతా 9లో

నీరవ్ మోడీతో వ్యాపారికి సంబంధాలు

- గుంటూరులో సిబిఐ విచారణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీతో గుంటూరులోని కొంతమంది పారిశ్రామికవేత్తలకు సంబంధాలపై సిబిఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. గుంటూరుకు చెందిన ఒక పారిశ్రామికవేత్త గతంలో హైదరాబాద్‌లో గీతాంజలి జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు నిర్వహించారు. ఆ తర్వాత కొద్దికాలానికి ఈ పార్కును ఈ వ్యాపారి నుంచి నీరవ్‌మోదీ కొనుగోలు చేశారు. ఈ లావాదేవీల

మిగతా 9లో

ప్రజారోగ్యంతో పాలకుల చెలగాటం

హక్కుల కోసమే కాదు..
సామాజిక అంశాలపైనా ఉద్యమించండి
ఎపిఎంఎస్‌ఆర్‌యు స్వర్ణోత్సవ వేడుకల్లో ఎకె.పద్మనాభన్



ఎపిఎంఎస్‌ఆర్‌యు స్వర్ణోత్సవాల సందర్భంగా కర్నూలులో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న మెడికల్ రెప్స్ , అగ్రభాగాన నాయకులు

ప్రజాశక్తి కర్నూలు ప్రతినిధి

కీలకమైన ప్రజారోగ్య రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులు పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎకె.పద్మనాభన్ పేర్కొన్నారు. మందుల తయారీలో బహుళజాతి కంపెనీల దోపిడీకి పాలకులు తలుపులు తెరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఎస్‌ఆర్‌యు) స్వర్ణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలు నగరంలో మెడికల్ రెప్రజెంటేటివ్‌లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బహిరంగ సభ జరిగింది. ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర అధ్యక్షులు పిఎస్.శేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఎకె.పద్మనాభన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాల అండతో మెడికల్ రంగంలోని బహుళజాతి కంపెనీలు దేశాన్ని లూఠీ చేస్తున్నాయని విమర్శించారు. ఫార్మా రంగంలో పనిచేసే ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోడీ 'శ్రమయే విజయతే' అని ఆర్భాటంగా చెబుతున్నారని, ఆచరణలో దోపిడీ చేసే వారికి అండగా ఉంటున్నారని చెప్పారు. ఉత్తర భారతదేశంలో లక్షలాది మంది అంగన్‌వాడీల్లాంటి స్కీం వర్కర్లు రోడ్ల మీదికొచ్చి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం కనీసంగా స్పందించలేదన్నారు. 2014 నుంచి దేశంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రల్లో లక్షలాది మంది రైతులు

మిగతా 9లో

గుంటూరులో అతిసారకు మరో ఇద్దరు బలి



అబ్దుల్ వదూద్ మృతదేహం

2

అంతా నగదు రహితమే

క్షేత్ర స్థాయి కష్టాల ఊసెత్తని కేంద్రం
15 సూత్రాలు సిద్ధంచేసిన అధికారులు
రాష్ట్రాల్లో అధ్యయనానికి నిర్ణయం
వివిధ అంశాలపై నమూనాలు సిద్ధం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేశాన్ని నగదు రహితంగా మార్చాలన్న కేంద్రం ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. అయితే క్షేత్ర స్థాయిలో కరెన్సీపై తలెత్తుతున్న సమస్యలను పట్టించుకోకుండా కేంద్రం ముందుకు వెళ్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా నగదు రహితం అమలు చేసేందుకు 15 సూత్రాలను కూడా కేంద్రం ప్రకటించింది. దీనికోసం సిద్ధం చేసిన ప్రత్యేక నమూనా ద్వారానే ఇకపై తమకు వివరాలు పంపించాలని అన్ని రాష్ట్రాలకు లేఖలు పంపించింది. దీనిని కచ్చితంగా పాటించాలని నిర్దేశించింది. 15 సూత్రాల్లో ఉన్న అంశాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలంటే గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా అనేక ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు

మిగతా 9లో

ఆ ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేస్తా : రాహుల్

న్యూఢిల్లీ: నోట్ల రద్దు నిర్ణయం పై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఒక వేళ నేనే ప్రధానినై ఉంటే పెద్ద నోట్ల రద్దు ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసేవాడినని మోడీ ప్రభుత్వ నిర్ణయం పై ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. ఐదు రోజుల ఆగ్నేయాసియా పర్యటనలో భాగంగా శనివారం మలేషియాలో ఆయన పర్యటించారు. కౌలాలంపూర్‌లో అక్కడి ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో నోట్లరద్దుకు సంబంధించిన ప్రశ్నకు బదులిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఒక వేళ ఎవరైనా నోట్లరద్దు పేరుతో ఉన్న ఫైలును నా వద్దకు తీసుకువస్తే దానిని డోర్ బయట ఉండే చెత్త బుట్టలో విసిరేస్తాను. ఎందుకంటే నోట్లరద్దు నిర్ణయం ఎవరికీ మంచిది కాదు' అని ఆయన బదులిచ్చారు.



విన్నపాలు

ప్రజా సంకల్పయాత్రలో రైతుల నుంచి వినతి పత్రాలను తీసుకుంటున్న వైఎస్ జగన్

జాబూ లేదు.. రుణమాఫీ లేదు.. : జగన్

ప్రజాశక్తి-చీరాల (ప్రకాశం)

బాబు వస్తే జాబు వస్తుందని, బాబు వస్తే వ్యవసాయ, డ్వాక్రా, చేనేత రుణాలు మాఫీ అవుతాయని మాయమాటలు చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని.. రుణమాఫీ ఏమో కాని బ్యాంకుల నుంచి నోటీసులు మాత్రం వచ్చాయని వైసిపి నేత జగన్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రకాశం జిల్లాలోని చీరాల చేరుకున్న సందర్భంగా గడియార స్తంభం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి, మోసం పునాదులపై చంద్రబాబు నాలుగేళ్ల పాలన సాగిందని ఆరోపించారు. చీరాల ప్రాంతంలో వరద ముంపు నుంచి కాపాడేందుకు వైఎస్సార్ కాలంలో రూ.135 కోట్లుతో కాలువల ఆధునీకరణ పనులు 50 శాతం పూర్తి చేసిన తర్వాత బాబు అధికారానికి వచ్చారన్నారు. ఆయన వచ్చాక ఒక్క అంగుళం కూడా పనులు జరగలేదన్నారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో విద్యుత్ బిల్లులు మూడు సార్లు, ఆర్‌టిసి ఛార్జీలు మూడు సార్లు పెంచారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.2 వేలు ఇస్తానని వాగ్దానం చేసి పైసా కూడా ఇవ్వలేదన్నారు. అవినీతితో సంపాదించిన సొమ్ము ఏమి చేసుకోవాలో తెలియక ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి సొంత పార్టీ గుర్తుపై గెలిపించుకునే దమ్ము లేని చంద్రబాబు వారికే మంత్రి పదవులు కట్టబెట్టుకున్నారన్నారు. అనంతరం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి యడం బాలాజీ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన ప్రేమ, అభిమానంతో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అరాచకాలను అడ్డుకుని ఓడిస్తానని చెప్పారు. సభలో వైసిపి జిల్లా అధ్యక్షులు బాలినేని శ్రీనివాసరెడ్డి, బాపట్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నందిగం సురేష్, పాదయాత్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మారెడ్డి, బాపట్ల పార్లమెంట్ నాయకులు వరికూటి అమృతపాణి పాల్గొన్నారు.



రాష్ట్రంలో పొడి వాతావరణమే

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక-దక్షిణ తమిళనాడు తీరానికి ఆనుకుని అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది. 48 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశాలున్నట్లు పేర్కొంది. మరోవైపు అరేబియాలోని లక్షద్వీప్ నుంచి పశ్చిమ తీరంలోని కొంకన్ తీరం వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నట్లు తెలిపింది. ఇవి రాష్ట్రంపై ఎలాంటి ప్రభావమూ చూపబోవని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. కోస్తా, రాయలసీమల్లో నాలుగురోజుల పాటు పొడి వాతావరణమే కొనసాగుతుందని తెలిపింది. శనివారం మధ్యాహ్నం పాక్షిక మేఘావృతం ఉన్నా వేడి, ఉక్కపోత తీవ్రంగానే కొనసాగాయి.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. త్రిపుర నూతన ముఖ్యమంత్రి ఎవరు?
2. పౌర విమాన శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఎవరు?
3. అంతర్జాతీయ దిగ్గజ ట్యాక్సీ సేవల సంస్థ 'ఉబెర్'కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైనది ఎవరు?
4. ట్విట్టర్ చీఫ్ టెక్నాలజీ ఆఫసర్‌గా బాధ్యతలు చేపట్టిన వ్యక్తి?
5. మెక్సికోలో జరుగుతున్న ప్రపంచ కప్ షూటింగ్ టోర్నమెంట్‌లో రజత పతకం గెలుచుకున్న భారత షూటర్ ఎవరు? ఈ పోటీల్లో భారత్‌కు ఇదే తొలి రజతం.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సాగు పతనం

- వ్యవసాయం కిందికే
- పంటల విస్తీర్ణం తగ్గుదల
- ఇరిగేషన్‌లో తరుగు
- ఆహారధాన్యాల సేద్యం, దిగుబడులదీ అదే దారి
- సర్కారీ రెండంకెల వృద్ధి డొల్లే
- ఆర్థిక సర్వే స్పష్టీకరణ



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రాథమికరంగాల్లో అతి ముఖ్యమైన వ్యవసాయం ఇబ్బడిముబ్బడిగా అభివృద్ధి చెందిందని, రెండంకెల వృద్ధి రేటు సాధించిందని చంద్రబాబు సర్కారు ఆకాశమే హద్దుగా ప్రచారం చేస్తుండగా అందులో ఆవగింజంతైనా నిజం లేదని సామాజిక, ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. వార్షిక బడ్జెట్‌ను పురస్కరించుకొని అసెంబ్లీలో 2017-18 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పేర్కొన్న వివరాల ప్రకారం వ్యవసాయరంగం నానాటికీ తీసికట్టులా తయారైంది. సాగు విస్తీర్ణం, నీటిపారుదల సదుపాయాలు, ఆహారధాన్యాల సాగు, దిగుబడులు అంతకంతకూ దిగజారుతున్నాయి. రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో నికర పంటల సాగు భారీగా తగ్గుతోంది. ఈ ధోరణి ఆహార భద్రతకు అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విభజన తర్వాత ఖమ్మం జిల్లాలోని ఆరు మండలాలు ఏపీకి బదలాయించిన దరిమిలా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 160.20 లక్షల హెక్టార్ల నుంచి 162.97 లక్షల హెక్టార్లకు పెరిగినా నికర సాగు గణాంకాలు ఎంతమాత్రం పెరగ లేదు సరికదా తగ్గుతున్నాయి. నికర సాగు విస్తీర్ణం 2009-10లో 67.26 లక్షల హెక్టార్లు కాగా 2016-17లో 60.77 లక్షల హెక్టార్లు. నవ్యాంధ్రలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నికర సాగు విస్తీర్ణంలో కొద్దిపాటి హెచ్చుతగ్గులున్నాయి. భౌగోళిక విస్తీర్ణం సుమారు రెండున్నర లక్షల హెక్టార్లు పెరిగినప్పటికీ 2014-15 నుంచి అంతా తరుగుదలే. ఆ ఏడాది నికర సాగు విస్తీర్ణం 65.62 లక్షల హెక్టార్లు కాగా 2016-17లో 60.77 లక్షల హెక్టార్లు. మూడేళ్లలో ఏకంగా ఐదు లక్షల హెక్టార్లలో సాగు తగ్గింది.

ఇరిగేషన్ వెనుకపట్టు

పట్టిసీమ, పురుషోత్తపట్నం, ముచ్చుమర్రి, గండికోట, ఇలా ఎన్నో కొత్త సాగునీటి ప్రాజెక్టులను ఈ కాలంలో సర్కారు ప్రారంభించినప్పటికీ, మరెన్నో పథకాలను ప్రాధాన్యతాక్రమం కింద చేపట్టినప్పటికీ, నీరు-చెట్టు, ఎన్టీయార్ జలసిరి అంటున్నప్పటికీ సాగునీటిపారుదల విస్తీర్ణం పెరగకపోగా తగ్గింది. సాగునీటి సదుపాయాలను కాల్వలు, చెరువులు, బావులు, ఇతర వనరులు అనే నాలుగు కేటగిరీల కింద లెక్కిస్తారు. ఈ నాలుగింటినీ కలిపినా రాష్ట్రంలో నికర ఇరిగేషన్ ఏడాదేడాదీ తగ్గుతోందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఏపీలో 2010-11లో నికర ఇరిగేషన్ 30.30 లక్షల హెక్టార్లు కాగా 2016-17లో 27.19 లక్షల హెక్టార్లు. తెలుగుదేశం అధికారంలోకొచ్చేనాటికి నికర ఇరిగేషన్ 30.14 లక్షల హెక్టార్లు. అప్పటి నుంచి తగ్గడమే తప్ప పెరగలేదు.

ఆహార పంటలూ అంతే

ఆహారధాన్యాల దిగుబడులు తగ్గడమో లేక బొటాబొటిగా నమోదు కావడమో జరుగుతోంది. ఆహారపంటల సాగు విస్తీర్ణం 2010-11లో 45.85 లక్షల హెక్టార్లు కాగా 2016-17లో 39.70 లక్షల హెక్టార్లు. పట్టిసీమను ఘనంగా పేర్కొంటున్నప్పటికీ 2017-18లో ఆహారపంటల విస్తీర్ణం 40.72 లక్షల హెక్టార్లు మాత్రమే. పెరిగింది కేవలం లక్ష హెక్టార్లు. ఖరీఫ్‌లో వరి తగ్గింది. ఆహారధాన్యాల దిగుబడులు 2010-11లో 149.96 లక్షల టన్నులు కాగా 2016-17లో 149.16 లక్షల టన్నులు. ఇక 2017-18లో 157.59 లక్షల టన్నులొస్తాయని బడ్జెట్‌లో సర్కారు అంచనా వేసింది. నిరుడు బడ్జెట్‌లో 156.85 లక్షల టన్నులొస్తాయని అంచనా వేయగా తుదిలెక్కల్లో 149.16 లక్షల టన్నులకు తగ్గాయి.

తగ్గిన సాగు

సంవత్సరం	నికర సాగు లక్షల హెక్టార్లు	నికర ఇరిగేషన్ లక్షల హెక్టార్లు	ఆహారధాన్యాలు: సాగు విస్తీర్ణం లక్షల హెక్టార్లు	ఆహారధాన్యాలు: దిగుబడి లక్షల టన్నులు
2010-11	67.96	30.30	45.85	149.96
2011-12	65.62	31.05	41.80	147.73
2012-13	64.62	28.01	41.54	139.27
2013-14	65.61	30.14	42.81	156.94
2014-15	62.35	29.27	39.63	160.02
2015-16	62.08	27.43	41.36	143.78
2016-17	60.77	27.19	39.70	149.16

గుంటూరులో అతిసారకు మరో ఇద్దరు బలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ప్రబలిన అతిసార ఇంకా అదుపులోకి రాలేదు. గత వారంలో తూర్పు నియోజకవర్గానికి పరిమితమైన వ్యాధి రెండ్రోజులుగా నగరంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ఈ క్రమంలో శనివారం మరో ఇద్దరు మృతి చెందారు. పాత గుంటూరుకు చెందిన అబ్దుల్ వదూద్(70), కొత్తపేటకు చెందిన సవరం రాము (60) నాలుగు రోజులుగా అతిసారతో బాధపడుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. తాగునీటి సరఫరాలో మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంతో నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి శనివారం 46 మంది చికిత్సల కోసం వచ్చారు. వీరు కాక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకూ బాధితులు వస్తూనే ఉన్నారు. ప్రయివేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపిల వద్ద దాదాపు 200 మంది వరకూ చికిత్సలు పొందుతున్నారు. వారం రోజుల్లో దాదాపు రెండు వేల మంది అతిసార బారిన పడ్డారు. జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు గుంటూరు వచ్చి అతిసార బారిన పడుతున్నట్టు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాల ఆధారంగా తెలుస్తోంది. మాచర్ల, అమరావతి, తాడికొండ తదితర ప్రాంతాల చెందిన వారు గుంటూరులోని బంధువుల ఇళ్లకు వచ్చి ఈ వ్యాధి బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. తొలుత మురుగు కాల్వల్లో పైపు లైన్లు ఉండటం వల్ల నీరు కలుషితమైనట్లు ప్రచారమైంది. ఇతర ప్రాంతాలకూ విస్తరించాక నగరంలో సమగ్ర రక్షితనీటి పథకం నిర్మాణంలో భాగంగా పైపు లైన్లు మార్పు వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని అధికారులు తెలిపారు. అతిసార బాధితులున్న ప్రాంతాలను ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా శనివారం సందర్శించారు. రిజర్వాయర్లపై శ్లాబు సరిగా లేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వేలాది మంది అతిసార బారిన పడ్డారని, ఇంకా నివారణ చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

అవిశ్వాస తీర్మానం పేరిట వైసిపి డ్రామా

మంత్రులు యనమల, కళా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవిశ్వాస తీర్మానం పేరుతో వైసిపి డ్రామాలాడుతోందని, కలిసి వచ్చే పార్టీలతో సంప్రదించకుండానే మద్దతు ఎలా కూడగడతారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సచివాలయం మొదటి బ్లాక్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులు పెట్టే అవిశ్వాస తీర్మానానికి ఎలా మద్దతునిస్తామని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డికి అవినీతి కేసుల నుండి ఎలా బయట పడాలా అనే ఆలోచనే తప్ప, రాష్ట్ర ప్రయోజనాలు కాదన్నారు. ప్రత్యేక హోదా బిజెపితోనే సాధ్యమని విజయసాయిరెడ్డి అంటున్నారని, వైసిపి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బుకు చట్టబద్ధత కల్పించుకునేందుకు వైసిపి పార్టీని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. మిత్రపక్షమైనప్పటికీ తమ ఎంపిలు మంత్రి పదవులను వదులుకుని విభజన హామీలు, బిల్లులోని అంశాలను అమలు చేయాలని పోరాటం చేస్తున్నారని యనమల తెలిపారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని, జాతీయ రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నామని, పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అరుణ్ జైట్లీ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు ఐదు కోట్ల ఆంధ్రులను బాధించాయని, అందుకోసమే కేంద్రంలో తమ మంత్రులు బయటకు వచ్చారని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకటరావు మాట్లాడుతూ వైసిపికి రాజకీయ సిద్ధాంతం, పాలసీ అంటూ ఏదీ లేదన్నారు. ప్రధాని చుట్టూ, ఆర్థిక మంత్రి చుట్టూ వైసిపి నేతలు ప్రదక్షిణాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సీజ్ చేసిన రూ.34 కోట్ల విలువైన ఆస్తులను విడుదల చేయించుకున్నారన్నారు. వైసిపి వల్ల రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనమూ లేదన్నారు. అక్రమాస్తులకు చట్టబద్ధత కల్పించుకోవడమే వైసిపి ప్రయత్నం తప్ప రాష్ట్ర ప్రయోజనాల మీద శ్రద్ధ లేదన్నారు. విలేకరుల సమావేశంలో ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు కుటుంబరావు కూడా పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా ట్యాంక్‌బండ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పోలీసులు 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర'ను భగ్నం చేశారు. జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఆందోళనకారులు రానీయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకారులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు.

తెలంగాణ ఉద్యమంలో కీలకమైన 'మిలియన్ మార్చ్' 2011 మార్చి 10న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై జరిగింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత కూడా ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని, ఉపాధి, ఉద్యోగాలు రావడం లేదని, హక్కులు అణిచివేస్తున్నారని ఆరోపించిన టిజెఎసి, ముఖ్యమంత్రి కెసిఆర్ నిరంకుశ పాలనకు నిరసనగా ట్యాంక్‌బండ్‌పై 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర'కు పిలుపునిచ్చింది. యాత్రలో భాగంగా శనివారం సభ నిర్వహించడానికి విశ్వ ప్రయత్నాలు చేసింది. అయితే పోలీసులు ఈ యాత్రను భగ్నం చేశారు. యాత్రకు అనుమతి కోరినా ఇవ్వని పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల ముందునుంచే అరెస్టులు ప్రారంభించారు. ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. అయినా స్ఫూర్తియాత్రను నిర్వహిస్తామని టిజెఎసి ప్రకటించడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేక బలగాలు సహా వేలాది మంది పోలీసులు అడుగడుగునా మోహరించారు. వజ్ర వాహనంతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు మోహరించాయి. జిల్లాల నుంచి ఎవరినీ రానీయకుండా...నగర శివార్లతో కలిపి 350 ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలకు తనిఖీ చేసి, అనుమానాస్పదంగా కన్పించిన వారిని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద మరింత కఠినంగా ఆంక్షలను అమలు చేశారు. ట్యాంక్‌బండ్‌కు రెండువైపులా 'బారికేడ్'లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకోవడానికి విడతల వారిగా వచ్చిన విద్యార్థులు, యువకులను అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో హైదరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జెఎసి, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. స్ఫూర్తియాత్ర నిర్వహణకు ట్యాంక్‌బండ్ వద్దకు వెళ్లడానికి తార్నాకలోని తన ఇంటి నుంచి బయటకు వచ్చిన జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సిపిఐ రాష్ట్ర



కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, న్యూ డెమోక్రసీ నేత కె గోవర్దన్ సహ పలువురిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మఖ్దూంభవన్ వద్దకు వచ్చిన సిపిఐ ఏపి కార్యదర్శి కె రామకృష్ణను అరెస్ట్ చేయడానికి పోలీసులు ప్రయత్నించడంతో ఆయన వారితో వాగ్వాగానికి దిగారు. దీంతో వారు తన ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్రను అడ్డుకోవడం, ఉద్యమకారులను అరెస్ట్ చేయడాన్ని సిపిఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు.

చరిత్రను మరిపించాలని చూస్తున్నారు: కోదండరామ్

తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమ చరిత్రను ప్రజలు మరిచిపోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ భావిస్తున్నారని టిజెఎసి చైర్మన్ కోదండరామ్ ఆరోపించారు. అందుకే మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్రకు అనుమతి ఇవ్వకుండా.. అరెస్టులు చేయించారని విమర్శించారు.

సవాళ్లు విసురుతున్న సైబర్ నేరాలు

మారుతున్న చట్టాలపై అవగాహన అవసరం

పిపిల వర్క్‌షాప్‌లో హోంశాఖ కార్యదర్శి అనురాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సమాజంలో సైబర్ నేరాలు పెను సవాలుగా మారుతున్నాయని రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి ఎఆర్ అనురాధ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాసిక్యూషన్స్ డైరక్టరేట్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ లీగల్ ట్రెండ్స్ అనే అంశం గురించి విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం ఏర్పాటైన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలాలనుగుణంగా మారుతున్న చట్టాలపై అంతా అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయవ్యవస్థ, చట్టాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో వస్తున్న తీర్పులను పరిశీలించి వాటిని తగిన విధంగా అన్వయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయని తెలిపారు. కొన్ని సైబర్ కేసుల వివరాలను పరిశీలిస్తే అవి ప్రజలకు ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయో అర్థమవుతుందన్నారు. సమాజానికి సవాలు విసురుతున్న సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంచి సమాజ నిర్మాణానికి విచారణాధికారులు, పోలీసులు కలిసి పని చేయాల్సిన ఆవశ్యత ఉందని చెప్పారు. నేరాలు తగ్గాలంటే నేరగాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు కనిపెడుతుండాలని వివరించారు. మార్పు చెంది సాధారణ జీవితం గడపాలనుకునే వారికి అంతా సహకరించాలన్నారు.

మందుల్లోనూ కల్తీనే..

విజిలెన్స్ కేసులను పరిశీలిస్తే.. వాటిలో వివిధ రకాల కల్తీలపై నమోదైనవే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నాయని, చివరికి మందులు కూడా కల్తీ అవుతుండటం ఆందోళనకరమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ నెయ్యితో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో కల్తీ టీ పొడి తయారీ ఎక్కువగా ఉంటోందని చెప్పారు. నిందితులను పట్టుకోవడానికి ఆధునాతన పద్ధతులను అమలు చేయడంతో పాటు వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటేనే విచారణాధికారుల ప్రాధాన్యత పెరుగుతుందని పేర్కొన్నారు. విచారణాధికారులకు 41ఎ సిఆర్‌పిసి యాక్ట్‌పై అవగాహన ఉంటే తగిన విధంగా చట్టాలను నమోదు చేయడానికి అవకాశం ఉంటుందని విజయవాడ పోలీస్ జాయింట్ కమిషనర్ కాంతి రాణా టాటా తెలిపారు. పోలీస్ సర్వీసెస్‌లోకి రాకముందు తానూ న్యాయవాదిగా ప్రాక్టిస్ చేశానని చెప్పారు. చట్టాలపై అవగాహన ఉంటే నిజమైన దోషులకు సకాలంలో శిక్ష పడేలా చేయవచ్చన్నారు. ప్రాసిక్యూషన్స్ అదనపు డైరెక్టర్ బి రామకోటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్ వి రఘురామ్‌తో పాటు 13 జిల్లాల నుంచి సుమారు 175 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

ప్రత్యేకం

మెడికల్ పిజి సీట్ల భర్తీలో ఇన్ సర్వీస్ కోటాకు అయోమయం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిజి మెడికల్ సీట్ల భర్తీలో ఇన్ సర్వీస్ (ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న) వైద్యుల పరిస్థితి అయోమయంగా మారింది. వారికి పిజి సీట్ల కేటాయింపులో రిజర్వేషనా లేకుంటే వెయిటేజీనా అనేది గందరగోళంగా మారింది. తాజాగా పిజి నీట్ ఫలితాలు విడుదలైన విషయం విదితమే. పిజి చదువులకు అన్ని విభాగాలకు కలిపి ఏపి నుంచి మొత్తం 6078 మంది అర్హత పొందారు. వీరిలో ఇన్ సర్వీస్ వైద్యులు దాదాపు 200 మంది ఉంటారు. గతేడాది వరకు మొత్తం రాష్ట్రంలోని పిజి సీట్లలో 30 శాతం ఇన్ సర్వీస్ వైద్యులకు రిజర్వేషన్ అమలయ్యేది. ఈ ఏడాది నుంచి తెలుగు రాష్ట్రాలు నేషనల్ పూల్‌లోకి వెళ్లడంతో మొత్తం పిజి సీట్లలో యాభై శాతం సీట్లు నేషనల్ పూల్‌కే కేటాయిస్తారు. మిగిలిన యాభై శాతం రాష్ట్రానికి కేటాయించి, స్థానికులకు ప్రాధాన్యత ఇస్తారు. రాష్ట్రానికి కేటాయించే సీట్లలో గతంలో ఇచ్చినట్లే ఇన్‌సర్వీస్ వైద్యులకు 30 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు వారు ఇప్పటికే మంత్రికి, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. పిజి మెడికల్ కౌన్సెలింగ్‌కు సమయం దగ్గర పడుతున్నందున తమకు గతంలో ఇచ్చినట్లే 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారా లేకుంటే వెయిటేజీ ఇస్తారా అనేది ఈనెల 24 లోగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ వైద్యులు కోరుతున్నారు.

కేటాయింపులేకుండా వెయిటేజీ మాత్రమే ఇస్తే తీవ్రంగా నష్టపోతామని వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం అన్ని విభాగాల్లో 738 పిజి వైద్య సీట్లున్నాయి. వాటిలో 369 నేషనల్ పూల్‌లోకి వెళితే, మిగిలిన సీట్లు స్థానికులకు కేటాయించాలి. ప్రభుత్వం ఇన్ సర్వీస్ వైద్యులకు వెయిటేజీ ఇస్తే మొత్తం మార్కుల్లో 30 శాతం మార్కులు అదనంగా కలుస్తాయి. అలా చేస్తే వారికి నీట్‌లో వచ్చిన ర్యాంకుతో పోల్చితే చాలా వ్యత్యాసం ఉంటుందంటున్నారు. అలా కాకుండా నేషనల్ పూల్‌లో కేటాయించగా మిగిలిన సీట్లలో 30 శాతం ఇన్ సర్వీస్ వారికి రిజర్వేషన్ అమలు చేస్తే రాష్ట్రానికి కేటాయించే సీట్లలో 30 శాతం అంటే దాదాపు 110 సీట్లు రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఒరిశా, కేరళ, కర్నాటక, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు నేషనల్ పూల్‌లో ఉన్నా ఇన్ సర్వీస్‌కు 30 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయంటున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్‌సిఐ నిబంధనల ప్రకారమే సీట్ల భర్తీనా?

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకుంటామని వైద్యాధి కారులు ప్రజాశక్తికి తెలిపారు. మూడేళ్లపైగా గ్రామీణ, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులకు పిజి సీట్ల కేటాయింపులో 30 శాతం మార్కుల వెయిటేజీ ఇవ్వాలని ఎమ్‌సిఐ నిబంధనలున్నట్లు చెబుతున్నారు. ఇందుకు విరుద్ధంగా రిజర్వేషన్లు అమలు చేసినందుకు తెలం గాణలో కోర్టు కేసు నడుస్తోందన్నారు. అయితే ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన తీరు కూడా పరిగణలోకి తీసుకుని సోమవారంలోగా నిర్ణయం తీసుకునే అవకాశముందని అధికారులు స్పష్టం చేశారు.

30 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

నేషనల్ పూల్‌లోకి వెళ్ళినప్పటికీ పిజి సీట్లలో 30 శాతం ఇన్ సర్వీస్ వైద్యులకు కేటాయించాలి. ఈ విషయం పై ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా ఎలాంటి స్పందన రాలేదు. రిజర్వేషన్ కాకుండా మార్కుల వెయిటేజీ ఇస్తే మాత్రం తప్పక ఆందోళన చేస్తాం. ఈ నెల 24 లోగా ఈ విషయం పై ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాలి.

- జయధీర్, ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధి

సంక్షిప్తం

కారెం శివాజీకి జెనీవా ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీకి జెనీవాలోని గ్లోబల్ హోప్ నెట్‌వర్క్ ఇంటర్‌నేషనల్ (జిహెచ్‌ఎన్‌ఐ) నుంచి ఆహ్వానం అందింది. జిహెచ్‌ఎన్‌ఐ తొమ్మిదో వార్షికోత్సవ సందర్భంగా మే 29న జనీవాలో జరిగే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో శివాజీ ప్రసంగించనున్నారు

మంత్రుల రాజీనామా ఓ డ్రామా : పార్థసారథి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో మంత్రుల రాజీనామా ఒక డ్రామా అని వైసిపి అధికార ప్రతినిధి కె పార్థసారథి వ్యాఖ్యానించారు. ఒకవైపు రాజీనామా అంటూనే, ఎన్డీయేలో కొనసాగుతామని ప్రకటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ముఖ్యమంత్రి రెండు మాట్లాడుతున్న తీరులో కనీసం పశ్చాత్తాపంగానీ, బాధగానీ కనిపించడం లేదన్నారు. నాలుగు సంవత్సరాల్లో చేసిన తప్పులు, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అన్నట్లుగా ముఖ్యమంత్రి వ్యవహారశైలి ఉందని విమర్శించారు.

రేపటి నుంచి రెడ్‌బుల్ క్యాంపస్ క్రికెట్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

మార్చి 12 నుండి రెడ్‌బుల్ క్యాంపస్ క్రికెట్(2018) సిటీ క్వాలిఫైయింగ్ పోటీలు ఇండోర్, డెహ్రాడూన్, కోచిలలో ఏకకాలంలో ప్రారంభమవ్వనున్నాయి. ఈ నేషనల్ ఛాంపియన్‌షిప్ కోసం 28 నగరాల నుండి 250 కాలేజీలు పోటీ పడతున్నాయి. విశాఖలోనూ ఈ క్రికెట్ పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ముంబయి, బరోడా, అహ్మదాబాద్, పూణె, నాగపురంద్, గోవాలలో, ఉత్తరాన జలందర్, ఢిల్లీ, జైపూర్, జమ్మూ, చండీగడ్, లక్నో, చెన్నై, బెంగుళూరు, కోయంబత్తూరు, హైదరాబాద్, మైసూర్, కోల్‌కత్తా, రాయ్‌పూర్, గౌహతి, రాంచీ, భువనేశ్వర్, పాట్నా, జంషెడ్‌పూర్‌లలో జరగనున్నాయి. ప్రతి నగరం నుండి విజేత అయిన కళాశాల ఆ తరువాత ఏప్రిల్‌లో జరిగే జోనల్, రీజనల్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి.

ఎయిడెడ్ అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)
సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ అధ్యాపకులు ఖాళీ కంచాలపై గరిటలతో కొడుతూ నిరసన తెలిపారు. ధర్నా చౌక్ వద్ద పార్ట్ టైమ్ అధ్యాపకులు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాడు ఆరో రోజుకు చేరాయి. ధర్నాలో ఏపీ ఎయిడెడ్ కాలేజీస్ పార్ట్ టైమ్/ టెంపరరీ అన్ ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం.నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు అన్ని అర్హతలూ కలిగిన వారికి కనీస వేతనాలివ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా యని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

నిరసన
విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్షల్లో ఖాళీ కంచాలపై గరిటలతో కొడుతూ నిరసన తెలుపుతున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు



33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నాం

షీ టీమ్స్ ప్రారంభ సభలో ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి-కాకినాడ
పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జెఎన్‌టియు అల్యూమ్ని ఆడిటోరియంలో శనివారం షీ టీమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ మహిళా ఎస్ఐలు, కానిస్టేబుళ్లు శిక్షణ పొందుతున్నారన్నారు. మహిళాభ్యున్నతికి తమ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఎస్‌పి విశాల్‌గున్నీ మాట్లాడుతూ ఆకతాయిల ఆగడాలను, ఈవ్ టీజింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకే షీ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమస్య వస్తే వాట్సాప్ హెల్ప్‌లైన్ 9494933233లో గాని, డయల్ 100, ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా తెలియజేయొచ్చన్నారు. సమస్యను 24 గంటల్లోగా పరిష్కరించే విధంగా మహిళా ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం ఎంఎల్ఎలు పిల్లి అనంతలక్ష్మి, వనమాడి కొండబాబు, ఐడియల్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పి.చిరంజీవిని కుమారి, రంపచోడవరం ఎఎస్‌పి వేజెండ్ల అజిత తదితరులు మాట్లాడారు. మహిళా పిఎస్ డిఎస్‌పి విజయారావు సభకు అధ్యక్షత వహించారు. అంతకుముందుస్థానిక భానుగుడి సెంటర్ నుంచి జెఎన్‌టియుకె వరకు 2కె రన్ నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థినులు ఎస్‌పి విశాల్‌గున్నీతో సెల్ఫీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి సతీమణి నేహగున్నీ, డిఎఫ్ఒ నందిని సలారియా, ఆర్ఎంసి ప్రిన్సిపల్ ఆర్.మహాలక్ష్మి, అడిషనల్ ఎస్‌పి ఎఆర్ దామోదర్, ఎస్‌పి, డిఎస్‌లు పాల్గొన్నారు.

'సూట్'కేసులు నింపుతున్నారు

- దిగుబడిలో రెండొంతులు దళారులకే
- ముఖ్యమంత్రి హెచ్చరించినా ఫలితం శూన్యం



అనంతపురం మార్కెట్‌యార్డు



అనంతపురం మార్కెట్‌లో యార్డు 'సూట్' వసూలు చేస్తే చర్యలని తెలిపే డిజిటల్ డిస్‌ప్లే



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
'ఎవరైనా పంటల నుంచి పంటను కొనుగోలు చేస్తున్న సమయంలో 'సూట్' వసూలు చేస్తే జైలుకు పంపిస్తా.' అని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు 2016లో అనంతపురం జిల్లా పర్యటనలో దళారులను హెచ్చరించారు. ఈ హెచ్చరికలను వ్యాపారులు పట్టించు కుంటున్న దాఖలాల్లేవు. 'సూట్' పేరుతో రెండొంతుల దిగుబడిని వ్యాపారికి ఉచితంగా ఇస్తేనే పంటను కొనుగోలు చేస్తున్నారు. పైగా కొనుగోలు చేసిన దానిపై కమీషన్‌గా మరో 10 శాతం చెల్లించాలి. అనంతపురం జిల్లా ఉద్యానవన పంటలకు పెట్టింది పేరు. అందులో బత్తాయి పంట సాగు అత్యధికం. 1.20 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. దీని నుంచి సగటున 9 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. ఈ పంట దిగుబడి వేసవిలో ఎక్కువభాగం వస్తుంది. జ్యూస్‌లు ఇతర వాటికి డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ పంటను రైతులు అనంతపురం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తారు. లేదా వ్యాపారులే నేరుగా తోటల వద్దకెళ్లి కొనుగోలు చేస్తారు. మార్కెట్‌కు తెస్తే క్వింటాళు దిగుబడిపై 12 కిలోలు అదనంగా రైతు ఉచితంగా వ్యాపారికి ఇవ్వాలి. అదే వ్యాపారి తోట వద్దకు వెళితే క్వింటాపై 20 కిలోలు ఇవ్వా లి. దీన్నే 'సూట్' అంటారు. అంటే ఒక రైతుకు ఒక పంట కాలంలో ఐదు టన్నుల దిగుబడి వస్తే అదనంగా మరో టన్ను బత్తాయి కాయలను ఉచితంగా వ్యాపారికి ఇవ్వాలి. అంతేకాకుండా మార్కెట్‌లో అమ్ముడుపోయిన ధరలో మరో పది శాతం కమీషన్ రైతు వ్యాపారికి ఇవ్వాలి. మొత్తంగా చూస్తే ప్రస్తుతమున్న మార్కెట్ ధరల ప్రకారం టన్ను రూ.30 వేల వరకు ధర ఉంది. ఐదు టన్నుల దిగు బడి ఒక రైతుకు వస్తే ఒక టన్ను ఉచితంగా ఇవ్వడం ద్వారా వ్యాపారికి రూ.30 వేల వరకు లాభం చేకూరనుంది. ఐదు టన్నుల అమ్మకంపై మరో పది శాతం కమీషన్ అంటే మరో రూ.15 వేలు రైతు వ్యాపారికి ఇవ్వాలి. ఏడాది మొత్తం రైతు కష్టపడి పండించిన పంటలో రెండొంతులు దళారీకే దక్కుతోంది.

రెండొంతులు వారికే పోతుంది



పండించిన పంటలో రెండొంతులు 'సూట్'కేపోతుంది. ఐదు టన్నులకు ఒక టన్ను ఇవ్వాలి. మరో పది శాతం కమీషన్ ఇవ్వాలి. ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్ప ఏమీ చేయడం లేదు. రైతుకు పంట అమ్ముకోవడానికి మరో మార్గం లేదు. వ్యాపారులు చెప్పినట్టు నడుచుకోవాల్సిందే. ఈ సారి ధరలు బాగున్నాయని అనుకుంటే అందులో కొంత వారికివ్వాల్సిందే. బయటకు వెళ్లే అమ్ముకునే అవకాశాల్లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం 'సూట్' వంటివి లేకుండా చేస్తే రైతుకు కొంత ప్రయోజనం చేకూరుతుంది.

గోపాల్‌నాయుడు , రామాపురం గ్రామం నార్పల మండలం

ఒక అయ్య చేతిలో పెట్టినట్టుంటుంది



చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేశాక.. ఒక అయ్య చేతిలో పెట్టినట్టుగా ఉంటోంది రైతు పరిస్థితి కూడా. ఆరుగాలం కష్టపడి పంట పండించి మార్కెట్‌కు తీసు కొస్తాం. వారు చెప్పినట్టు ఇక్కడ వినాల్సిందే. లేకపోతే కొనే వారు ఉండరు. వచ్చిన వరకు మన ప్రాప్తమనుకుని వెళ్లాలి. ఇప్పుడు నాకు ఆరు క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. వారు చెప్పినట్టు క్వింటాకు 12 కిలోల చొప్పున సూట్ ఇవ్వాలి. పైగా పది శాతం కమీషన్ ఇవ్వాలి. ఏమి చేయలేం. మరో మార్గం లేదు.

నారాయణరెడ్డి రైతు , చిక్కేపల్లి పెద్దపప్పురు మండలం

హెచ్చరికలు బోర్డులకే పరిమితం
రైతుల నుంచి 'సూట్' వసూలు చేస్తే ఆరు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా అంటూ అనంత పురం వ్యవసాయ మార్కెట్ లోని డిజిటల్ బోర్డులో ఒకవైపు డిస్‌ప్లే అవుతూనే ఉంటుంది. మరోవైపు వ్యాపా రులు వీటిని ఏ మాత్రమూ పట్టించు కోవడం లేదు. నాలుగు శాతం మాత్రమే కమీషన్ తీసుకోవాల్సి ఉండగా పది శాతం వసూలు చేస్తున్నారు. ఇవన్నీ అధికారుల కళ్లెదు టే జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రైతుకు మరోమార్గం లేక దళారులు చెప్పిన ధరే అమ్ముకుని పోవాల్సి పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ-నామ్ వద్దంటే వద్దు..!

- సాధ్యం కాదని వ్యాపారుల స్పష్టీకరణ
- బలవంతం చేస్తే కొనుగోలు నిలిపివేత
- అయోమయంలో అధికారులు



సరుకుతో గుంటూరు మిర్చియర్డు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు మిర్చి యార్డులో ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) పద్ధతి అమలుకు వ్యాపారులు ససేమిరా అంటున్నారు. ఈ పద్ధతి ద్వారా గుంటూరులో కొనుగోలు సాధ్యం కాదని తేల్చి చెప్పారు. దీంతో అధికారులకు ఎటూ పాలుపోవడం లేదు. మిర్చి కొనుగోలు సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతోంది. కొనుగోలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ దశలో అధికారులు ఈ-నామ్‌పై వత్తిడి తెస్తే రైతుల నుంచి వ్యతిరేకత వస్తోంది. ప్రస్తుతం రోజుకు లక్ష నుంచి లక్షన్నర బస్తాలు వస్తున్నాయి. గత సీజన్‌తో పోల్చితే ధరలు కూడా కొంత ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది బాడిగ, తేజ రకం మిర్చి క్వింటా రూ.13 వేల వరకూ పలుకుతోంది. మిగిలిన రకాలు సగటున రూ.10 వేల వరకూ లభిస్తున్నాయి. కాగా, ఈ-నామ్ అమలు అనగానే వ్యాపారులు కొనుగోలు నిలిపివేస్తున్నారు. క్యాష్ అండ్ క్యారీ (ఏ రోజుకు ఆ రోజు చెల్లింపులు) అంటే ఎక్కువ సరుకు కొనుగోలు చేయలేమని, ఎక్కువ ధర ఇవ్వలేమని స్పష్టం చేస్తున్నారు. కావాలంటే ఒక ఫ్లాట్‌ఫారం ఏర్పాటు చేసి పరిమితంగా ఈ-నామ్ అమలు చేయాలని వ్యాపారులు సూచించారు. దీంతో అధికారులు కొంత గందరగోళంలో పడ్డారు. ఈ-నామ్ అమలుకు ఇంకా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు కాలేదు. గత అక్టోబరు 2న ఈ ట్రేడింగ్ పేరుతో తొలుత ఈ పద్ధతికి శ్రీకారం చుట్టారు. యార్డులో ఈ ట్రేడింగ్ ప్రారంభించేందుకు కంప్యూటర్లు, సిసి కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తామని ప్రకటించినా ఇంకా పూర్తి స్థాయి సౌకర్యాలు ఏర్పడలేదు. మిర్చి నాణ్యత నిర్ధారించే పరీక్షా కేంద్రం, రీసైక్లింగ్ యూనిట్ ఇంకా ఏర్పాటు కాలేదు. నాణ్యత నిర్ధారణ పరీక్షల నిర్వహణ కూడా పిపిపి పద్ధతిలో ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణ యించింది. ఈ నేపథ్యంలో జనవరి నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రకటించినా ఇంత వరకూ అమలు చేయలేకపోయారు. కేవలం మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందనే ఏకైక కారణంతోనే ప్రభుత్వం అంగీకరించినట్లు ఉంది కానీ నిజంగా రైతులకు ప్రయోజనం కల్పించేందుకు ఎటువంటి ముందస్తు కార్యచరణ రూపొందించలేదు. జిల్లాలో ఇతర మార్కెట్ యార్డుల్లో మిర్చి కొనుగోలుకు అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. దుర్గిలో మిర్చి కొనుగోలు చేస్తామని మూడేళ్లుగా చెబుతున్నా ఈ ఏడాది ఆ ఊసే లేదు.



'అడుగడుగునా' నాటికలో సన్నివేశం

నంది నాటకోత్సవం విజయవంతం

గుంటూరు జిల్లాలో ముగిసిన నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)
గుంటూరు జిల్లా తెనాలిలో 37 రోజులుగా ప్రదర్శినమవుతున్న నంది నాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తొలిగా బాలల నాటికలు, అనంతరం పౌరాణిక పద్య, నాటిక, నాటక ప్రదర్శనలు, సాంఘిక నాటిక, నాటకాలు కలిసి 176 ప్రదర్శనలిచ్చారు. ఇంత పెద్దఎత్తున ప్రదర్శనలు ఎన్నడూ లేవని, కళల కాణాచి తెనాలి వైభవాన్ని ఈ ప్రదర్శనలు మరోసారి చాటాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇలా ఉండగా ఇన్ని రోజులపాటు ఒకే వేదిక నుండి వరుస ప్రదర్శనలు నిర్వహించడంపై ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌కూ దరఖాస్తు చేయాలని గతంలోనే కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యులు దిలీప్‌రాజా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన విషయం తెలిసిందే. చివరిరోజు ఒక మహాపతనం, రాజీ, అడుగడు గునా, శ్రీకారం, మధుపర్కాలు నాటికలను ప్రదర్శించారు. అనంతరం సీనియర్ కళాకారులను సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రదర్శనలు విజయవంతంగా ముగిశాయిని, ఇదే స్ఫూర్తితో ఇతర ప్రాంతాల్లోనూ నిర్వహించాలని చెప్పారు.

మెరుగైన పోలీస్ సేవలే లక్ష్యం

డిజిపి మాల కొండయ్య

ప్రజాశక్తి-కైకలూరు (కృష్ణా)
ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతోనే మోడల్ పోలీస్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు డిజిపి మాలకొండయ్య స్పష్టం చేశారు. శనివారం కృష్ణాజిల్లా కైకలూరులో రూ. 1.40 కోట్లతో నిర్మించనున్న మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఏలూరు ఎంపి మాగంటి వెంకటేశ్వరరావుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలీసు స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా అవనిగడ్డ, కైకలూరు, మైలవరం, చిలకలపూడిల్లో అధునాతన మోడల్ పోలీసు స్టేషన్లను నిర్మిస్తున్నామని, వీటి నిర్మాణాలు పూర్తి కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టాయని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి సర్వశ్రేష్ట త్రిపాఠి, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, స్వచ్ఛంధ్రా మిషన్ వైస్ చైర్మన్ వెంకట్రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న డిజిపి మాలకొండయ్య, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు

జూన్ నాటికి 20 రెసిడెన్షియల్ పాఠశాలలు : మంత్రి నక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఆ శాఖా మాత్యులు నక్కా ఆనందబాబు చెప్పారు. గుంటూరులోని అడవి తక్కెళ్ల పాడు, కోడిగుడ్డు సత్రం వద్ద నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలను ఆయన శనివారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న 20 రెసిడెన్షియల్ పాఠశాలలను జూన్ 12 నాటికి ప్రారంభిస్తామని చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బోధన అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉందని చెప్పారు.

హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్
జీవన్ జ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం సాయంత్రం నగర మేయర్ కోనేరు శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తి కళాకారులను ఆదుకునేందుకు క్రాఫ్ట్ మేళా పేరుతో ప్రదర్శన ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి ప్రదర్శనలు తరచుగా జరగడం వల్ల చేతివృత్తి కళాకారులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. ప్రదర్శన నిర్వాహకులు అతిన్ కుమార్ జైస్వాల్ మాట్లాడుతూ దేశంలో గర్వించదగ్గ హస్తకళా, చేనేత, వస్త్ర కళారూపాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. మంగళగిరి డ్రస్ మెటీరియల్, కళంకారి, బెంగాల్ కాటన్ శారీస్, లకోఉన చికెన్ వర్క్‌శారీస్, వరంగల్ శారీస్, రాజస్తాన్ శారీస్, కాశ్మీర్ శిల్క్ శారీస్, వెంకటగిరి, పట్టు వస్త్రాలు, హైదరాబాద్ మంచి ముత్యాలు, బ్లాక్ మెటల్, హైదరాబాద్ జ్యూయలరీ, రోజ్‌వుడ్ ఐటెమ్స్, సారంగపూర్ ఐటెమ్స్ ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 15 వరకూ ఉంటుందని, మొత్తం 300కుపైగా స్టాల్స్ ఉన్నాయనీ వివరించారు.

వర్మను అరెస్టు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-ఒంగోలు టౌన్
సినీ దర్శకులు రామ్‌గోపాల్ వర్మను తక్షణమే అరెస్టు చేయించాలని ఐద్వా నేతలు శనివారం ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ వర్మ స్త్రీ స్వేచ్ఛ పేరిట స్త్రీల శరీరాన్ని సరుకుగా చేసి ఇంటర్ నెట్, మీడియా ద్వారా సెక్స్ ట్రాఫికింగ్‌ని విస్తృతం చేస్తున్నారన్నారు. స్త్రీలను ప్రతికూలంగా చూపడం, కించపరచడం వల్ల చులకనగా చూసే భావన పెరుగుతుందన్నారు. సామాజిక మాద్యమాల పర్యవేక్షణకు చట్టం నిర్దేశించినట్లు రాష్ట్ర, జిల్లా స్థాయిలో మీడియా మానిటరింగ్ కమిటిని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిస్తూ ముఖ్యమంత్రితో ఈ విషయంపై మాట్లాడతానన్నారు.

చలో విజయవాడ

26న చలో విజయవాడ

- జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్
- ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు



ఎపిడబ్ల్యుజెఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు డి.పరమేశ్వరరావు

ప్రజాశక్తి - కాకినాడ
జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 26న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల సమావేశ మందిరంలో రాష్ట్ర అధ్యక్షులు డి.పరమేశ్వరరావు అధ్యక్షతన శనివారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులందరికీ గృహ వసతి కల్పిస్తామని సిఎం హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదన్నారు. హామీల అమలు కోసం ఈ నెల 26న చలో విజయవాడ నిర్వహించాలని ఫెడరేషన్ కార్యవర్గం నిర్ణ యించిందన్నారు. అదేరోజు నిర్వహించే ఫెడరేషన్ పదేళ్ల పండుగ ప్రారంభోత్సవానికి సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులుతో పాటు పలువురు మంత్రులు, పలు రాజకీయ పక్షాల ప్రముఖులు హాజరవుతారన్నారు. ఉత్సవం విజయవంతం కోసం రాష్ట్ర కార్యదర్శి శ్రీనుబాబు రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారని, వివిధ జిల్లాల శాఖలు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయన్నారు. అక్రిడిడేషన్‌లకు సంబంధించి కొత్త జిఒ జారీ కానప్పటికీ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుని అర్హులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోని జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా జర్నలిస్టులకు పింఛను ఇవ్వడానికి వీలుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని కోరారు. అంతకుముందు ఇటీవల కాలంలో మృతి చెందిన న్యూస్‌టుడే ఎమ్‌డి జి.రమేష్‌బాబు, విశాఖపట్నం ప్రజాశక్తి విలేకరి షేక్‌వలీ, గన్నవరానికి చెందిన ముక్తేవి శ్రీనివాసదీక్షితులు, పెద్దాపురం వార్త విలేకరి బందిల సతీష్‌బాబు, ఏలూరు జెమిని టివి కెమెరామెన్ హనక్‌లకు సమావేశం సంతాపం తెలిపింది.

సంక్షిప్తం

పోలీసుల అదుపులో మిలీషియా సభ్యులు

ప్రజాశక్తి-జిల్లాపరిషత్
విశాఖ ఏజెన్సీ పాడేరు మండలంలో పెదబయలు ఏరియా కమిటీకి చెందిన నలుగురు మావోయిస్టు మిలీషియా సభ్యులను పట్టుకున్నట్లు పాడేరు ఎఎస్‌పి అమిత్‌బర్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలకు సహకరిస్తూ తిరుగుతుండగా పోలీసులకు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిలో పెదబయలు మండలానికి చెందిన చిక్కుడు రాంబాబు, కిల్లో చిన్నారావు, వంతల వెంకట్రావు, వంతల మల్లేశ్వరరావు ఉన్నట్లు తెలిపారు. 2014 నుంచి మావోయిస్టులు చేసే కార్యకలాపాల్లో పాల్గొన్నారని, హత్యలు, ప్రొక్లెయిన్లు తగులబెట్టడం తదితర 10 సంఘటనల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు తెలిపారు. మావోయిస్టులకు భయపడి మిలీషియా సభ్యులుగా కొనసాగుతున్నవారు స్వచ్ఛందంగా లొంగిపోవాలని, వారిపై ఎలాంటి కేసులూ ఉండవని తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించి, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు.

నిధుల పెంపు కోసం 12న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్
ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని జిల్లా ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ నేపథ్యంలో 12న చలో కలెక్టరేట్ చేపడతామని సిపిఎం నేతలు తెలిపారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం రెండోరోజూ కొనసాగాయి. ఈ దీక్షలను రిటైర్డ్ అడిషనల్ జాయింట్ కలెక్టర్ షంషేర్ అహ్మద్ ప్రారంభించి మాట్లాడారు. రాష్టాభివృద్ధికి కేంద్రం హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుంటే, ప్రకాశం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లా అభివృద్ధిపై టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించాలని సిపిఎం తూర్పు ప్రకాశం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు డిమాండ్ చేశారు.



విశాఖ జిల్లా చీడికాడలో పోలీసులు పట్టుకున్న గంజాయి

860 కిలోల గంజాయి స్వాధీనం

ఎనిమిది మంది నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- విశాఖపట్నం
విశాఖ ఏజెన్సీ నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను శనివారం ఎక్సైజ్, స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 860 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మాడుగులలో రెండు చోట్ల 240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్ట్ చేయగా, చీడికాడలో రవాణాకు సిద్ధంగా ఉన్న 620 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు. మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద ఎస్ఐ ధనంజయ్ ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో పెదబయలుకు చెందిన బి.కృష్ణ అనే వ్యక్తి 220 కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇదే మండలంలో గరికిబంద చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడుల్లో మహారాష్ట్ర, జల్గాం జిల్లాకు చెందిన రాహుల్‌శేఖర్, సాగర్‌ప్రకాష్ 20 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. చీడికాడ మండలంలో ఖండివరం గ్రామ సమీపంలో కల్లాల వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న 31 బస్తాల్లోని, 620 కిలోల గంజాయిని ఎస్ఐ శిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా రెండు బైకులు, రూ.1.05 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంపాదకీయం

నాయకత్వం

సమాజంలో ప్రతి తరమూ తనకు కావాల్సిన నాయకుడిని తానే సృష్టించుకొంటుంది. సమకాలీన సామాజిక వాతావరణంలో రాజీపడలేని ఏ విప్లవ హృదయమో విజృంభించి, తిరగబడి సంఘంలో పరిణామాలు తేవడానికి తోడ్పడుతుంది. కొత్త మార్గాలు చూపుతుంది. సమాజంలోని కుళ్లును తుడిచివేయడానికి, అక్రమాలను ఎదుర్కోడానికి– ఆ సమాజం నుండే నాయకులు పడుతుంటారు. ఒక కారల్ మార్క్స్, ఒక లెనిన్, మహాత్మాగాంధీ, రాజారామమోహనరాయ్, వీరేశలింగం పంతులు, భగత్‌సింగ్, అల్లూరి సీతరామరాజు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి వారు ఈ కోవలోకే వస్తారు. 'విజేతలు మనకన్నా వేరే విభిన్నమైన పనులు చేయరు... మనం చేసే పనులనే విభిన్నంగా చేస్తారు' అని వ్యక్తిత్వ వికాస పుస్తక రచయిత శివ్ ఖెరా తన సుప్రసిద్ధ గ్రంథం 'యు కెన్ విన్'లో చెబుతారు. వీరంతా తమ తమ వ్యక్తిత్వాలతో ఆయా కాలాలలో స్ఫూర్తిని నింపినవారే. 'వివేకాన్ని ప్రపంచ శీర్షంపై ఉంచగలిగితే, ప్రపంచం విజయవంతంగా తన యుద్ధం సాగిస్తుంది. అదే ఉత్తమ ప్రపంచంగా నిలిచి ఉంటుంది' అంటాడు కార్లైల్. నిర్మలమైన ప్రేమకు, పవిత్రమైన ఆశలకు, విజ్ఞానానికి తల్లి వంటిది వివేకం. తేజస్సు, సౌందర్యం నిండి ఉన్న వివేకం ఏనాటికీ వాడిపోదు. దానికి వృద్ధాప్యం రాదు. లేదంటే... 'ఆర్తీ ఆవేశాలెండిపోయినా/ అనుభూతుల్ని కొయ్యమొహాల కంటించుకుంటాయి/ రంగంపై జీవితాన్ని నటించి నటించి/ రంగు వెలిసిన మొహాలతో నిష్క్రమిస్తాయి' అని ప్రముఖ కవి పాపినేని శివశంకర్ చెప్పినట్టుగా ఆశయాలెండిపోయిన వారు జీవిత రంగస్థలం నుంచి రంగు వెలిసిన ముఖాలతో నిష్క్రమిస్తారు. 'నెత్తురు మండే, శక్తులు నిండే, సైనికులారా! రా రండీ!' అని శ్రీశ్రీ యిచ్చిన పిలుపును అందుకున్న యువతరం కొత్త ప్రపంచం కోసం జరిగే పోరాటానికి నాయకత్వం వహిస్తారు.

ఆ యువశక్తే నేడు దేశాభ్యుదయానికి పూనుకోవాలి. దేశం కోసం తమ జీవితాలను అర్పించిన మహనీయుల జాడలను అందుకోవాలి. స్వాతంత్య్రం కోసం వారి నెత్తుటి ధారలను గుండెలకు హత్తుకోవాలి. వారు మన దేశం గురించి ఎన్నో కలలు కన్నారు. కేవలం రాజకీయ స్వాతంత్య్రం గురించి మాత్రమే కాదు, కోట్లాది భారతీయుల ఆర్థిక సంక్షేమం గురించి కూడా కలలు కన్నారు. కుల మతాల వివక్ష కూడదన్నారు. అన్నదాత పస్తులు ఉండకూడదన్నారు. అవినీతీ దోపిడీ అరిష్టాలన్నారు. సామాజిక న్యాయం స్వాతంత్య్రానికి పుట్టిన మొదటి బిడ్డ కావాలన్నారు. అంటరానితనం, అసమానతలు, ఆకలి, కన్నీరు లేని దేశాన్ని కలగన్నారు. ఆ కలలను నిజం చేయడం కోసం అసమాన త్యాగాలు చేసారు. చివరకు తమ ప్రాణాలను సైతం బలిదానం చేసి స్వాతంత్య్రాన్ని మనకందించారు. ఈ స్వాతంత్య్ర ఫలాలు సామాన్యులకు అందుతున్నాయా...? ఎన్ని బడ్జెట్‌లు వచ్చినా అంకెల గారడీ తప్ప ఒరిగేదేమీ వుండదు. చేస్తున్న కేటాయింపులకు, పెరుగుతున్న దారిద్ర్యానికీ ఎక్కడా పొంతన లేదు. అసమానతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. మరి దేశ ఆర్థికాభివృద్ధిలో రావాల్సిన సత్ఫలితాలు ఏమవుతున్నాయి..? ఇప్పుడు యువతరం ఛేదించాల్సిన సమస్య ఇదే..! విలువల వలువలను గాలికొదిలి.. పదవుల కోసం పార్టీలు ఫిరాయిస్తున్న నేతలను, కోటాను కోట్ల రూపాయలను బ్యాంకులకు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయే బడా వ్యాపారులను, హింసాయుత రాజకీయాలను చూసి అసహ్యించుకుంటూ వాటికి దూరంగా ఉంటున్నది యువత.

ఇలాంటి వ్యవస్థపై అసహ్యం కలుగడం సహజమే. కానీ అసహ్యించుకుని దూరంగా ఉండటం ఈ దేశానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. మనకెందుకులే... అని వదిలేస్తే అది బాధ్యతా రాహిత్యమే. చదువుకున్న చదువులు, కట్టుబాట్లు, సాంఘిక నియమాలు, చుట్టూ ఉన్న సామాజిక వాతావరణం ఇవన్నీ ఈ వ్యవస్థను యథాతథంగా ఉంచడానికి అవసరమైన భావజాలంతో నిండినవే. పెట్టుబడికి ఊడిగం చేసే వత్తి నైపుణ్యాలనే తప్ప పిడికెడు సామాజిక చైతన్యాన్నివ్వలేని ఈ చదువుల బండారాన్ని, ఈ చదువుల వెనుక ప్రభువులు చేసే కుట్రలూ కుతంత్రాల్నీ పసిగట్టాలి. చదువు అంటే ప్రజలనీ, ప్రజలంటే పీడితులనే సత్యాన్ని గుర్తించాలి. అప్పుడే ఈ సమాజాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలం. అప్పుడే దేశంలో ప్రజలెదుర్కొంటున్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సామాజిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. సాటి మనిషి కష్టాలకు స్పందించగలుగుతాం. ఇవన్నీ యువతను మహోజ్వలం గావిస్తాయి. ఇప్పుడు దేశానికి అటువంటి యువ నాయకత్వం కావాలి. 'కొంత మంది యువకులు ముందు యుగం దూతలు, పావన నవ జీవన బృందావన నిర్మాతలు. వారికి నా ఆహ్వానం..' అంటాడు శ్రీశ్రీ. రండీ...! మహాకవి ఆహ్వానాన్ని అందుకుందాం. విజేతలుగా నిలుద్దాం.

ఇదీ విషయం




హోదా ఒక వేదికగా
రాజకీయ చదరంగం...
ఓట్ల కొరకు సీట్ల కొరకు
సాగుతున్న వీరంగం!

నాలుగు గోడల మధ్య
నినాదాలే ఎక్కువ...
ప్రజలను కదిలించే
ప్రయత్నం తక్కువ

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

'ప్రత్యేక' రాజకీయంలో పార్టీల పిల్లిమొగ్గలు



తెలకపల్లి రవి

విభజిత రాష్ట్రానికి విదిలింపులే ప్రసాదం అంటూ అంటకాగిన తెలుగుదేశం ఆలస్యంగా బయిటకు రావడంలోనూ రాజకీయాలు వున్నాయి. గతంలో వారు అంగీకరించి ఆకాశానికెత్తిన ప్రత్యేక ప్యాకేజీ గురించి మాట్లాడేందుకు సిద్ధమై కేంద్రం చివరి నిముషంలో ఆహ్వానించినా ససేమిరా కాదనడంలోనే ఆ రాజకీయం వుంది. ఈ దశలో పత్యేక హోదా అనకపోతే ప్రజలు సహించే ప్రసక్తి లేదని తెలిశాకే అడ్డం తిరిగారు తప్ప విధానపరమైన వ్యత్యాసాలతో కాదు. తమ మంత్రి పదవులకు రాజీనామా చేసిన వారు అమరావతిలోనూ ఢిల్లీలోనూ మాట్లాడింది చూస్తే పరస్పరం ఎంతగా పెనవేసుకుపోయారో అర్థమవుతుంది.



తమ అవసరాలకు, తక్షణ ప్రయోజనాలకు అనుగుణంగా పాలక పార్టీలు ఎన్ని పిల్లిమొగ్గలు వేస్తాయో, ఎలాంటి రాజకీయ విన్యాసాలు చేస్తాయో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాపై నడుస్తున్న నాటకాలు నిరూపిస్తాయి. విభజిత రాష్ట్రావిర్భావం ముందు నుంచి వున్న అంశంపై నాలుగేళ్ల గడవనిచ్చి ఇప్పుడు హఠాత్తుగా జ్ఞానోదయమైనట్టు హడావుడి చేస్తుంటే విస్తుపోవడం ప్రజల వంతవుతున్నది. విభజన తతంగానికి ఆధ్వర్యం వహించిన కాంగ్రెస్ వారి నుంచి ప్రత్యేక హోదా సాధించామని చెప్పుకున్న బిజెపి తానే అధికారంలో వుండి దానికి పూర్తిగా మంగళం పాడేసింది. అదంతా జరుగుతున్నా అభివృద్ధి కోసమే బిజెపితో జట్టు కట్టానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ఏడాదిలో ఎక్కడ లేని ఆవేదన ప్రదర్శిస్తూనే ఎన్‌డిఎలో కొనసాగుతున్నారు. ఆయన అనుచరులు అవే మాటలను ప్రతిధ్వనిస్తూ రాజకీయాలు రసవత్తరం చేస్తున్నారు. వారి మాటలను ఖండించే పేరిట బిజెపి పెద్దలు వున్నవీ లేనివీ కలిపి వూదరకొడుతున్నారు. వీరిద్దరి మధ్య–తానే ప్రత్యేక హోదా ఉద్యమాన్ని బతికించానంటున్న ప్రతిపక్ష వైసీపీ నేత జగన్ అవిశ్వాస తీర్మానమే బ్రహ్మాస్త్రమైనట్టు భ్రమ పెడుతున్నారు. ఇక జెఎఫ్‌సి పేరిట బోలెడు లెక్కల కసరత్తు చేసి పాత విషయాలే పాక్షికంగా పున:ప్రకటించిన జనసేన పవన్ కళ్యాణ్ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడానికి ఆపసోపాలు పడుతున్నారు. ఈ సమస్యను నిజంగా సజీవంగా వుంచి వీరందరినీ దారికి తెచ్చిన వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధన సమితి, ఇతర ప్రజా సంఘాలు ఢిల్లీ నుంచి విజయవాడ వరకూ ప్రతి చోటా నిరసన హోరెత్తిస్తున్నాయి. ముగిసిపోయిందన్న ప్రత్యేక హోదా అధ్యాయం పున: ప్రారంభానికి మూల కారణం నిజానికి ఈ ప్రజా ఉద్యమాలే. మీడియా సంస్థలు ఎక్కడికక్కడ ఈ సమస్యపై చర్చలు ఏర్పాటు చేయడం కూడా ఊపు పెంచింది.

తెలుగుదేశం ఆఖరి పాచిక

అరుణ్‌జైట్లీ ఆది నుంచీ అదనంగా పైసా లేదు పొమ్మంటుంటే, ముఖ్యమంత్రి అందని కేంద్రం సహాయాన్ని కీర్తిస్తూ సన్మానాలూ తీర్మానాలు చేశారు. ప్రతిపక్షాలూ పరిశీలకులూ చాలాసార్లు విమర్శిస్తుంటే, చర్చల్లో చెబుతుంటే నెగిటివ్ మైండ్ అన్నారు. ఇప్పటిదాకా అడుక్కున్నాం ఇక ఒత్తిడి చేస్తామని గొప్పగా చెప్పినా ఇంకా వేడుకోలు రాగాలే ఆలపిస్తున్నారు. ఆఖరి ఘట్టంలో అనివార్యంగా మోడీ ప్రభుత్వం నుంచి నిష్క్రమించినా ఎన్‌డిఎను అంటిపెట్టుకునే వున్నారు. తమకు నేరుగా ఆర్థిక రాజకీయ లాభం రాని చోటకు వనరులు తరలించడం బిజెపి విధానమే కాదు. మిత్రపక్షాలను మింగడం బిజెపి వారికి వెన్నతో పెట్టిన విద్య అని మహారాష్ట్ర, హర్యానా, అస్సాం, తాజాగా నాగా–మిజో అనుభవాలు చెబుతున్నాయి. అయినా విభజిత రాష్ట్రానికి విదిలింపులే ప్రసాదం అంటూ అంటకాగిన తెలుగుదేశం ఆలస్యంగా బయిటకు రావడంలోనూ రాజకీయాలు వున్నాయి. గతంలో వారు అంగీకరించి ఆకాశానికెత్తిన ప్రత్యేక ప్యాకేజీ గురించి మాట్లాడేందుకు సిద్ధమై కేంద్రం చివరి నిముషంలో ఆహ్వానించినా ససేమిరా కాదనడంలోనే ఆ రాజకీయం వుంది. ఈ దశలో పత్యేక హోదా అనకపోతే ప్రజలు సహించే ప్రసక్తి లేదని తెలిశాకే అడ్డం తిరిగారు తప్ప విధానపరమైన వ్యత్యాసాలతో కాదు. తమ మంత్రి పదవులకు రాజీనామా చేసిన వారు అమరావతిలోనూ ఢిల్లీలోనూ మాట్లాడింది చూస్తే పరస్పరం ఎంతగా పెనవేసుకుపోయారో అర్థమవుతుంది.

వైసీపీ మల్లగుల్లాలు

ఇక జగన్ ఎన్‌డిఎ నుంచి తెలుగుదేశం నిష్క్రమిస్తే పరోక్షంగా తాను బిజెపి మైత్రిలో ప్రవేశిద్దామని ఆలోచిస్తున్నారు. అంతకు మించి అడుగేయడానికి సిద్ధంగా లేరు. ప్రత్యేక హోదా కోసం పోరాడేది మేమేననడం తప్ప ప్రధాన ప్రతిపక్షంగా తన పాదయాత్రలో దాన్ని వినిపించిన సందర్భం లేదు. పైగా హోదానూ నిధులనూ కూడా నిరాకరించే కేంద్రాన్ని నేరుగా అనకుండా చంద్రబాబుపై విమర్శలకే ప్రాధాన్యతనిస్తున్నారు. తెలుగుదేశం తన తప్పులు కేంద్రం ఖాతాలో వేస్తున్నదనీ, చాలా డబ్బులు వచ్చినా లెక్కలు చెప్పలేదని బిజెపి వాదనలే వినిపిస్తున్నారు. జగన్ టీవీ ఛానళ్లలో మాట్లాడిన నిడివి గాని, సాక్షిలో వచ్చిన నివేదికలు గాని పరిశీలిస్తే మోడీపై లేక మంత్రి జైట్లీపై నేరుగా విమర్శలు కనిపించవు. టిడిపిని మాత్రం చీల్చిచెండాడుతుంటారు.అందుకు అభ్యంతరం లేదు గాని ఆ పేరిట కేంద్రాన్ని వదిలేయడం ఎలా సాధ్యం? ఏం న్యాయం? అవిశ్వాస మంత్రం కూడా పవన్ కళ్యాణ్ సవాలు తర్వాతే జగన్ చేపట్టారు. టిడిపి కూడా కలసి రావాలని అడుగుతున్నారు. ఉభయులూ కలసి 25 అయినా అవసరమైన దానిలో సగమే వుంటారు. ఇప్పటికీ కేంద్రంలో భాగస్వామిగా వున్న టిడిపి అవిశ్వాసం పెడుతుందని ఎలా అనుకోవడం? అవిశ్వాసం నోటీసు ఇచ్చినా ఫలితం వుండదనేది ఒకటైతే అసలు ఆ నోటీసు ఆమోదించేందుకే బలం లేనప్పుడు ఇంకా దాన్ని గొప్పగా చెప్పుకోవడం ఏం లాభం? రాజీనామాల విషయంలోనూ వైసీపీ ప్రతిపాదనను మంత్రుల రాజీనామాల రూపంలో టిడిపి ముందే అమలు చేసేసింది. ఇంతకాలం కేంద్రంలో వున్న తెలుగుదేశం ఇప్పుడు విడగొట్టుకోవడంలోనూ ముందుండే వ్యూహం అమలు చేస్తే రకరకాల వాదనలతో ప్రతిపక్షం వెనకబడి పోవడం విచిత్రం.

విశ్వసనీయతకు పరీక్ష

ప్రభుత్వ ప్రధాన ప్రతిపక్ష నేతలు కేంద్రం విషయంలో ఇంతగా తటపటాయించడానికి కారణం వారిపై వున్న రకరకాల కేసులూ తిరకాసులేనన్న అభిప్రాయం వుంది. కక్ష సాధింపునకు మారుపేరైన బిజెపి కేంద్రం ఆ విధంగా వారిని లోబర్చుకుంది. మనుగడ కోసం మాట్లాడుతూనే మోడీకి కోపం రాకుండా ఉభయ పక్షాలూ జాగ్రత్త పడుతుంటాయి. రెండు పార్టీలూ ఎందుకో కేంద్రానికి భయపడుతున్నాయని పవన్ కళ్యాణ్ కూడా అననే అన్నారు. పైగా తనను కూడా లొంగదీసుకోవడానికి ఐటి కత్తిని చూపించి భయపెట్టినట్టు మొదటిసారి వెల్లడించారు. ప్యాకేజీని పాచిపోయిన లడ్డూలంటూ అవహేళన చేసిన పవన్ వాటిపై జెఎఫ్‌సి వేసి మరీ అధ్యయనం చేయించారు! అయితే ఈ క్రమంలో అచ్చంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన లెక్కలపైనే ఆధారపడ్డారన్నది కూడా నిజం. ఇంత చేసినా పవన్ వ్యూహంపై ఎవరికీ స్పష్టత లేదు–ఆయనతో సహా! ఈ అస్పష్టతను కొనసాగించడం కూడా ఒక వ్యూహమే. అన్ని అవకాశాలూ అట్టిపెట్టుకోవచ్చు. ఎందుకంటే ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో సహా రకరకాల రాజకీయ వేదికల గురించి మాట్లాడుతున్నారు.

కొత్త కదలికలు

ఈ పూర్వరంగంలో కాంగ్రెస్ తను చొరవ తీసుకున్నట్టు చెబుతున్నది. కొంత ఆందోళన చేస్తున్నది. లోక్‌సభలో రాజ్యసభలో వారు పూర్తిగా పాల్గొంటే ఈ సమస్య రాష్ట్ర సమస్య గాక జాతీయ సమస్య అవుతుంది. గతంలో వీరప్ప మొయిలీ ప్రత్యేక హోదాకు అభ్యంతరం చెప్పారు గనక తాము దాన్ని ఏ మాత్రం ఆమోదించినా కర్ణాటకలో బెడిసికొడుతుందని బిజెపి, కాంగ్రెస్ రెండూ భావిస్తున్నాయి. హోదాపై రాహుల్ గాంధీ మొదటి సంతకం రాజకీయ ప్రకటన తప్ప తక్షణ వ్యవహారం కాదు. అయినా ఆ ప్రకటనను చంద్రబాబు, జగన్, పవన్ ముగ్గురూ ప్రస్తావించారు. బిజెపితో పూర్తిగా తెగతెంపులైతే కాంగ్రెస్‌కు దగ్గరగా వ్యవహరించేందుకు టిడిపికి అభ్యంతరం వుండదని వారికి సన్నిహితంగా వుండే ప్రముఖులొకరు నాతో అన్నారు. ఎపిలో వైసీపీ ప్రధాన ప్రతిపక్షం గనక కాంగ్రెస్ తమకు ఉపయోగపడొచ్చనే వాదన ఒకటి టిడిపిలో వుంది. ప్రత్యేక హోదా ఎవరు ఇస్తే వారికి మద్దతు ఇస్తామని చెప్పడం కాంగ్రెస్‌కూ వర్తిస్తుందని వైసీపీ వారి వివరణ. ఇలా రాష్ట్ర రాజకీయం కప్పల తక్కెడగా మారిపోయిందంటే అందుకు కారణం అన్ని రకాల అవకాశవాదాలే. ఈ అవకాశ వాదంలో ఎవరి లొసుగులు వారు దాచుకుని అవతలివారిపై విరుచుకుపడుతున్నారు. ఇంతకాలం కలసి వుండి ఇప్పుడు పరస్పరం తిట్టుకున్నంత మాత్రాన బిజెపి టిడిపిల ఉమ్మడి బాధ్యత ఎక్కడికీ పోదు. పార్టీలుగా వాటి సంబంధాలు సంఘర్షణలూ ఎలా వున్నా కేంద్ర రాష్ట్రాల మధ్య రాజ్యాంగ సంబంధమైన బాధ్యతలు దాటేసే పరిస్థితి అనుమతించలేం. ప్రతి చోటా బిజెపి నేతకూ రాష్ట్రం లెక్కలు ఇవ్వాలనే వాదన సరి కాదు. కేంద్రం కావాలంటే తన మార్గాల్లో తను తెప్పించుకోవచ్చు. పోలవరం నిర్మాణం కేంద్రం నుంచి వెంటబడి మరీ తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మొత్తం వారి అజమాయిషీలో జరుగుతుందని అంగీకరించి వుంది గనక ఇప్పుడైనా లోబడే చేయవలసి వుంటుంది. ఈ ఉభయులూ కలసి కూడా సహాయ పునరావాస సమస్యలు దాటేస్తున్నారన్నది ఆందోళన కలిగించే అంశం. రెవెన్యూ లోటు ఇప్పటికీ తేల్చలేకపోయినట్టు కేంద్ర రాష్ట్రాలు రెండూ ఒప్పుకోవడం దివాళాకోరుతనం. ఇక మరో పాతికేళ్ల తర్వాత ఇచ్చే పద్దులు కూడా కలిపి లక్షన్నర కోట్ల మేరకు నిధులు తరలించినట్టు బిజెపి వల్లించే జాబితాలు హాస్యాస్పదమైనవి. రాష్ట్రం నుంచి కూడా పన్ను వసూలు వాటాలు వెళ్తుండగా అంతా తామే దాతృత్వంతో గుమ్మరించినట్టు చెప్పడం అవమానకరం. విభజన తప్పిదాలలో కాంగ్రెస్ బిజెపిలకూ ఒక మేరకు టిడిపికి కూడా వాటా వుంది. వైసీపీ అప్పుడూ ఇప్పుడూ గోడ మీద పిల్లి వాటమే. ఇలాంటి ధోరణుల వల్ల ఇప్పటికే కావలసినంత నష్టపోయిన ఎపిని ఇంకా తమ రాజకీయ క్రీడకు రంగస్థలంగా వాడుకోవడం దారుణం. ప్రజలు ఆమోదించని విషయం.

చర్చ

రైతుల ఆదాయం ఒక బూటకం



ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పడం వట్టి బూటకం. రైతుల ఆదాయం పెరగటానికి మార్గాలు చూపకుండా, బడ్జెట్‌లో సముచిత నిధులు కేటాయించకుండా అది అసాధ్యమని మంత్రివర్యులకు తెలియనిది కాదు. గత సంవత్సరం వ్యవసాయ బడ్జెట్ రూ.18,214 కోట్లు. ఈ సంవత్సరం రూ.19,070 కోట్లు. అంటే అదనంగా పెరిగింది. రూ.856 కోట్లు. ఇందులో రైతాంగానికి నేరుగా ఉపయోగపడేది నామమాత్రమే.

రాష్ట్రంలో మూడు వంతులకు పైగా పంటలు పండిస్తున్నది కౌలు రైతులే. రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతున్న కౌలు రైతులకు మాత్రం ఈ బడ్జెట్‌లో దక్కింది శూన్యమే. ప్రభుత్వ హామీ మేరకు కౌలు రైతులకు జరగాల్సిన రుణ మాఫీ రూ.574 కోట్లు. అయితే ఇందులో ఇప్పటికి చేశామని చెపుతున్న మాఫీ రూ.144 కోట్లు మాత్రమే. దీంతో పూర్తి రుణ మాఫీ జరగక, కొత్త రుణాలు అందక, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండవ అంశాన్ని పరిశీలిస్తే ఈ సంవత్సరం వడ్డీ లేని పంట రుణాల కింద బడ్జెట్‌లో రూ.173 కోట్లు కేటాయించారు. ఈ విలువ నాలుగేళ్ల నుండి అదనంగా ఒక్క రూపాయి కూడా పెరగటం లేదు. గతేడాది పంట రుణాల కింద మొత్తం రైతాంగానికి ఇచ్చిన రుణాలు రూ.63 వేల కోట్లు. ఇందులో కౌలు రైతులకు ఇచ్చామని చెపుతుంది రూ.2,346 కోట్లు. అంటే మొత్తం రుణాలలో కౌలు రైతులకు ఇచ్చింది రూ.3.7 శాతం మాత్రమే.

మూడవ అంశం మారిన వ్యవసాయ పరిస్థితులలో కౌలు వ్యవసాయమే ప్రాధాన్యత సంతరించుకుంది. భూమి కలిగిన 80 శాతం మంది సాగు చేయడం లేదు. కానీ పంట రుణాలన్నీ వీరికే దక్కుతున్నాయి. అంటే రుణ మాఫీ సాగు చెయ్యని ధనిక వర్గానికే ఉపయోగపడింది. దీంతో ప్రభుత్వం కేటాయించిన రూ.485 కోట్లు కూడా పంటలు పండించని వారికే దక్కుతుందన్నమాట!

ఈ సంవత్సరం పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర కాదు కదా కనీసం మద్దతు ధర కూడా దక్కలేదు. వ్యాపారులందరూ సిండికేటు అయి రైతులను దోచుకుంటుంటే ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తోంది. పైగా మార్కెట్ శాఖకు రూ.11 కోట్లు కేటాయించి రైతులను ఆదుకుంటామని చెప్పడం ఆశ్చర్యం.

మరో వైపు వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి తగ్గింది. దీనికి తోడు కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు, ఎరువుల వల్ల రైతాంగం నష్టపోతోంది. దీనికి తోడు ఏటేటా పెరిగే కౌలు రేట్లు, ఉత్పత్తి ఖర్చులు వల్ల మోయలేని భారాన్ని మోస్తున్నారు. టిడిపి నాలుగేళ్ల పాలనలో 1,598 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే విషయంలో కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు.

ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవ సాగు దారులను గుర్తించాలి. వారికే నిధులు కేటాయించాలి. కేరళ తరహా రుణ మాఫీ చట్టం తీసుకొచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలి. డా॥ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి. వడ్డీలేని పంట రుణాలు, పావలా వడ్డీ రుణాలు కౌలు రైతులకు, చిన్న, సన్నకారు రైతులకు అందించాలి. ఈ రుణాలు పొందిన వారికి 'ఫసల్ బీమా యోజన' పథకం వర్తింప చేయాలి. ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలి. వ్యవసాయ బడ్జెట్‌లో కేటాయించే నిధులను దామాషా పద్ధతిలో కౌలు రైతులకు ఖర్చుపెట్టాలి. వారి ఆదాయాలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. వారి సంక్షేమం కోసం కృషి చేయాలంటే నిధులు కేటాయించడంతో పాటు వారి అభివృద్ధికి దోహదపడే రాజకీయ సంకల్పం కూడా ఉండాలి. అప్పుడే అది ఆచరణ సాధ్యమౌతుంది.

పి జమలయ్య,
ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

జన వాక్యం


కాపాడేది గురువులే!

రాష్ట్రంలో పాఠశాల విద్యా విధానం గందరగోళంగా తయారైంది. ఇటీవల జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షలే ఇందుకు ఉదాహరణ. పరీక్షల నిర్వహణ, లీకులు, ఫలితాల ఆలస్యంలో విద్యాశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. ప్రస్తుతం అమలు చేస్తున్న విద్యావిధానం ఎవరికీ అర్థం కావడం లేదు. రోజుకో ఉత్తర్వు, పూటకొక విధానం అమలు చేస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను అయోమయానికి గురిచేయడం విద్యా శాఖకు అలవాటుగా మారింది. మూడేళ్లలో విద్యాశాఖ చేసిన వింత ప్రయోగాలు, నిర్ణయాలు అభ్యసనా వాతావరణానికి తీవ్ర విఘాతం కలిగించాయి. ప్రస్తుతం అమలు చేస్తున్న విద్యా విధానం పట్ల విద్యాశాఖ అధికారులకు కూడా కనీస అవగాహన లేదనే చెప్పొచ్చు. ఎస్‌సిఇఆర్‌టి, ఆర్‌విఎం, ఆర్‌ఎంఎస్‌ఎ వంటి విద్యాసంస్థల మధ్య సమన్వయం లేదు. ఇవే కాక పాఠ్యపుస్తకాలు సకాలంలో అందజేయక పోవడం, చాలీచాలని ఏకరూప దుస్తులు పంపిణీ, ఎండిఎంలో నాణ్యతా లోపం, రేషనలైజేషన్, పాఠశాలల మూసివేత, మధ్యలో బదిలీలు, ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ పనుల ఒత్తిడి, విద్యయేతర కార్యక్రమా లతో ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నారు. బయోమెట్రిక్ మీద ఉన్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలో లేదు. ఇకనైనా విద్యారంగాన్ని కాపాడుకోవాలి. అందుకు ఉపాధ్యాయులంతా సంఘటితమై ఉద్యమం నడపాలి. ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి.

బి ఎస్ కుమార్, శ్రీకాకుళం.

చర్చ

లెనిన్ సిద్ధాంతం కూల్చేస్తే కూలిపోదు



ఎం కృష్ణమూర్తి



కష్టజీవులు, పీడిత ప్రజలు కమ్యూనిస్టు పార్టీని నిర్మించుకుని రాజకీయ అధికారం సాధించినప్పుడే దోపిడి, వేతన బానిసత్వం అంతమవుతుందని మార్క్సిజం-లెనినిజం చెప్పింది. ఆ సిద్ధాంతమంటేనే దోపిడి వర్గాలకు కంటగింపు. దోపిడి వర్గాల బంట్లు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, మతతత్వవాదులకూ కడుపు మంటే. అదే త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేత వెనుక పని చేస్తున్న సిద్ధాంతం.

త్రిపుర ఎన్నికల ఫలితాలు వామపక్షాలకు, అభ్యుదయ వాదులకు విచారం కలిగించాయి. దేశవిదేశీ దోపిడీ శక్తులకు, హిందూ మతోన్మాద మూకలకు, విచ్ఛిన్నకర శక్తులకు సంతోషం కలిగించాయి. హిందూ మతోన్మాద మూకలు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశాయి. విదేశీ నాయకుల విగ్రహాలు ఇక్కడెందుకని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆ పని తమదేనని చెప్పకనే చెప్పారు. కులతత్వాన్ని, అగ్ర కుల దురహంకారాన్ని ప్రశ్నించిన పెరియార్‌కి కూడా ఇదే గతి పడుతుందని బిజెపి సుబ్రమణ్యస్వామి ప్రకటించారు. పెరియార్, అంబేద్కర్ విగ్రహాలపై కూడా దాడి జరిగింది.

త్రిపుర 37 లక్షల జనాభా గల చిన్న రాష్ట్రం. పరిశ్రమలు, నదులు, ఖనిజ సంపద వంటి వనరులు లేని పేద రాష్ట్రం. వామపక్ష ప్రభుత్వం 35 ఏళ్ళపాటు అవినీతి మచ్చ లేని పాలననిచ్చింది. నేటి అవినీతి రాజకీయాలకి ప్రత్యామ్నాయంగా నిలిచింది. విచ్ఛిన్న శక్తుల్ని, ఉగ్రవాదుల్ని అదుపు చేసి ప్రశాంత నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దింది. ఆకలి చావులు, ఆత్మహత్యలు, అడుక్కునే వాళ్ళు లేని రాష్ట్రంగా అభివృద్ధి చేసింది. ఏ వనరులు లేని ఇంత చిన్న రాష్ట్రంలో ఇంత ప్రగతి ఎలా సాధ్యమని దేశమంతా చర్చించడాన్ని దోపిడి వర్గాలు భరించలేకపోయాయి. విచ్ఛిన్నకర శక్తులతో జత కలిశాయి. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అబద్ధాల ఫ్యాక్టరీని త్రిపురలో పెట్టేశాయి. భ్రమలు, కుట్రలతో వామపక్షా లను ఓడించి అరాచకానికి తెర లేపాయి.

జార్ చక్రవర్తి రాచరిక, నిరంకుశ పాలనలో మగ్గుతున్న రష్యా ప్రజలను చైతన్యపరిచి, సమీకరించి, విప్లవీకరించి తిరుగుబాటు బావుటా ఎగురవేసి విముక్తి చేసింది లెనిన్ అసమాన నాయకత్వమే. అదేగాక మార్క్సు కార్మికవర్గ సిద్ధాంతాన్ని రష్యా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి అమలు జరిపి దోపిడివర్గ పాలనను అంతమొందించింది. రష్యాలో సామ్రాజ్యవాదాన్ని దెబ్బతీసి ప్రపంచాన్ని చుట్టేసిన సామ్రాజ్యవాద గొలుసులో లింకును బద్దలుగొట్టింది. దాంతో జాతీయ పోరాటాలు ప్రజ్వరిల్లి స్వతంత్ర దేశాలు ఏర్పడడానికి లెనిన్ అసమాన ప్రతిభే కారణం.

కార్మిక వర్గానికి రోజుకు 8 గంటల పని దినం, పురుషులతో సమానంగా స్త్రీలకు అన్ని హక్కులు, ప్రపంచంలోనే మొట్టమొదట పెన్షన్, అందరికీ నిర్బంధ ఉచిత విద్య– వైద్యం అమలు చేసింది, అందరికీ ఉచిత గృహ సౌకర్యం కల్పించింది, 18 ఏళ్ళు నిండిన యువతీ యువకులందరికీ ఉద్యోగం గ్యారెంటీ చేసింది లెనిన్ నాయకత్వంలో సోవియట్ యూనియన్. అటువంటి సౌకర్యాలు తమకూ కావాలని ప్రపంచ కార్మిక వర్గం, పీడిత ప్రజానీకం ఉద్యమాలు చేసింది. వీరు ఎర్రజెండాను చేతపట్టి తిరుగుబాటు చేస్తారేమోనన్న భయంతో దోపిడి వర్గ పాలకులు అన్ని దేశాల్లో సంక్షేమ పథకాలు అమలు చేయక తప్పలేదు.

మార్క్సిజం–లెనినిజం సకల దేశ కార్మికులను ఐక్యం చేసే సిద్ధాంతం. ఏ దేశం, జాతి, కులం, మతం, ప్రాంతం వారైనా దోపిడీ చేయబడే కార్మికులు, కష్టజీవులంతా ఐక్యమైతేనే దోపిడి నుండి విముక్తి సాధ్యమని పీడిత వర్గానికి ప్రభోదిస్తుంది. కష్టజీవులు, పీడిత ప్రజలు సంఘాల్లో ఐక్యం కావాలని, కమ్యూనిస్టు పార్టీని నిర్మించుకుని రాజకీయ అధికారం సాధించినప్పుడే దోపిడి, వేతన బానిసత్వం అంతమవుతుందని చెప్పింది. ఆ సిద్ధాంతమంటేనే దోపిడి వర్గాలకు కంటగింపు. దోపిడి వర్గాల బంట్లు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, మతతత్వవాదులకూ కడుపు మంటే. అదే త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేత వెనుక పని చేస్తున్న సిద్ధాంతం.

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దోపిడి వర్గ రక్షణకు పుట్టిన సంస్థలు. మనువాదం, అగ్ర కుల దురహంకారం, హిందూ మతోన్మాదం, సామ్రాజ్యవాద సానుకూలత వాటి సిద్ధాంతం. కష్టజీవులను, ప్రజలను, సంఘాలను, సంస్థలను చీల్చి బలహీనపర్చడం వాటి లక్ష్యం. అందుకు కులతత్వం, మతతత్వం, ప్రాంతీయ తత్వాలను పురికొల్పడం వాటి పని. దోపిడి వర్గాలకు అవసరం వచ్చినప్పుడల్లా ఈ దుష్ట శక్తులను వాడుకుంటాయి. 1930ల్లో వచ్చిన ఆర్థిక సంక్షోభ సమయంలో జర్మనీ, జపాన్, ఇటలీలలో ఇలాంటి శక్తుల్నే ప్రేరేపించాయి. హిట్లర్ ఫాసిజం అలా ప్రేరేపించబడి తలెత్తిందే. జర్మన్ జాతీయ దురహంకారం, హిట్లర్ ఫాసిస్టు సిద్ధాంతం ప్రేరణతో ఆర్‌ఎస్‌ఎస్ పుట్టింది. సిపియంను దెబ్బ తీయకుండా భారతదేశంలో తమ కిరాతకం సాగదని ఆర్‌ఎస్‌ఎస్‌కు తెలుసు. 1990 నుండి సరళీకరణ ఆర్థిక విధానాలను ప్రతిఘటిస్తున్నది సిపియం, వామపక్షా లేనని దేశ విదేశీ దోపిడీ వర్గాలకూ తెలుసు. సిపియంను అంతం చేస్తే భారతదేశంలో తమకు ఎదురుండదని ఈ దుష్టశక్తుల దురాలోచన. అన్ని ప్రజాస్వామిక విలువలను వదిలేసి, అన్ని రకాల కుట్రలతో త్రిపురలో సిపియం ప్రభుత్వాన్ని కూల్చాయి. మోడీ చెప్పినట్లు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంపై ఆధారపడ్డ బిజెపి కచ్చితంగా సిపియంకు, వామపక్షాలకు సైద్ధాంతిక శత్రువే. కానీ త్రిపురలో వారిది సైద్ధాంతిక విజయం కాదు. కాంగ్రెస్‌ను వందల కోట్లు రూపాయలు పెట్టి కొన్నది. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య కొట్లాటలు సృష్టించింది. విభజన శక్తులతో చేతులు కలిపింది. అన్ని రకాల కుట్రలు చేసి గెలిచింది తప్ప రుజుమార్గంలో కాదు. సిపియం మాత్రం కచ్చితంగా సైద్ధాంతికంగానే ఎదుర్కొంటుంది.

బిజెపిది విచ్ఛిన్నకర సిద్ధాంతం. ప్రజలు శాంతియుతంగా, సమైక్యంగా, సహజీవనం చేయడం దానికి సుతరామూ ఇష్టముండదు. అసహనం దాని సహజ లక్షణం. మత ఘర్షణలు, కుల కొట్లాటలు, ప్రాంతీయ ఘర్షణలంటే దానికి చాలా ఇష్టం. బిజెపి మన రాష్ట్రాన్ని ఒక ఓటు–రెండు రాష్ట్రాల సిద్ధాంతంతో రెండు ముక్కలు చేయాలని కాకినాడలో తీర్మానం చేసింది. రాష్ట్రాన్ని విభజించేందుకు కాంగ్రెస్‌కు సంపూర్ణంగా సహకరించింది. తాజాగా రాయలసీమ డిక్లరేషన్ పేరుతో మరో చీలికకు ఆజ్యం పోస్తున్నది. బిజెపిది విచ్ఛిన్న సిద్ధాంతమనడానికి ఇంతకంటే ఏం రుజువులు కావాలి?

సిపియంది మార్క్సిజం, లెనినిజం కమ్యూనిస్టు సిద్ధాంతం. ఆర్‌ఎస్‌ఎస్‌కు నూటికి నూరు శాతం భిన్నమైంది. అది మత సామరస్యాన్ని కోరుతుంది. కులాధిపత్యాన్ని వ్యతిరేకిస్తుంది. పురుషా ధిక్యతను తిరస్కరిస్తుంది. సామ్రాజ్యవాదం అంతానికి పోరాడుతుంది. సమైక్య ప్రజా జీవనానికి అభ్యుదయ, ప్రజాస్వామ్య, లౌకిక భావనలు అవసరమంటుంది. వాటికి అంకితమౌతుంది. మారు వేషాల్లో, అబద్ధాలతో, అక్రమ మార్గాల్లో విచ్ఛిన్నకారులు కొంత కాలం మోసం చేయగలరు. వేధింపులు, హింస, అబద్ధాలు, మోసాలు, ద్రోహాలు, దోపిడీలు, విచ్ఛిన్నాల వలన బాధితులకు జ్ఞానోదయం అవుతుంది. అంతిమంగా సమైక్యంగా ఎదుర్కొంటారు. సిపియం అందుకే వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఐక్యం కావాలని పిలుపు నిస్తున్నది. ఆ శక్తులన్నింటిని కూడగట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నది. అంతిమ విజయం ప్రజల పక్షాన వామపక్షాలదే.

(రచయిత సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు)

ఆడపిల్లకు ఏదైనా సమస్య వస్తే.. కన్నీరు తుడిచే వాళ్లుండాలి. ఆమె సమస్యను ఓపిగ్గా వినే మనసుండాలి. విని, ఆ సమస్యను పరిష్కరించే ధైర్యమూ ఉండాలి. అలా ఉండాలి అంటే.. సాటి స్త్రీల పట్ల అంతే ప్రేమ ఉండాలి. నిజానికి నేటి సమాజంలో ఆపదలో ఉన్న స్త్రీలకు నేనున్నానని అండగా నిలబడటమంటేనే పెద్ద సాహసం. కానీ, ఆమెకు ఆ సాహసం చిన్నప్పటి నుంచే ఒంటబట్టింది. అయినా, ఎప్పుడూ.. నవ్వుతూ, తుళ్ళుతూ.. అరవైఏళ్లు దాటిన వయసులోనూ ఆరేళ్ళ పాపాయి పసితనమే ఆమెది. వృత్తి, ప్రవృత్తిపరంగా ఆమె సాగించిన జీవన ప్రయాణంలో.. దగాపడ్డ మహిళల కోసం ఆమె పోషించిన భూమికలెన్నో. నలుగురికి స్ఫూర్తిని పంచుతూ, మరో నలుగురు స్త్రీల గుండెల్లో ధైర్యాన్ని నింపుతూ.. అదే జీవనశైలిగా మార్చుకున్న **కొండవీటి సత్యవతి** సుదీర్ఘ'జీవన' యానంలో స్ఫూర్తివంతమైన విషయాలెన్నో.. ఆమె మాటల్లోనే విందాం పదండి..



ఆమె.. కొండంత భూమిక

నాకు ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని కలలు కన్న మా నాన్న 77లో చనిపోయాడు. నేను తీవ్ర నిరాశలో కూరుకుపోయాను. మా నాన్నతో నాకు చాలా అనుబంధం. ఆయనే నాకు కట్టెలు కొట్టడం, చేపలు పట్టడం, పాలు పిండడం, మొక్కలకు నీళ్ళు పట్టడం లాంటి 'మగపనులు' చేసే అవకాశం కల్పించాడు. నువ్వు ఆడపిల్లవి, అణకువగా ఇంటిపట్టున ఉండాలి అనే మాటలు, ఆంక్షలు ఎప్పుడూ నేను వినలేదు. నేను మా ఊరి తోటల్లో స్వేచ్ఛగా, హాయిగా తిరుగుతుండేదాన్ని. నన్ను చెట్లమీద పిట్టలా, నీళ్ళల్లో చేపలా ఎదగనిచ్చిన మా నాన్న మరణం నన్ను చాలా కుంగదీసింది. ఆయన్ని కడసారి కూడా చూడలేకపోయాను. నేను మా ఊరు తిరిగి వెళ్ళిపోయాను. ఎందుకు వెళ్ళానో తెలుసుకోవాలి అంటే.. నేను అసలు హైదారాబాద్ ఎందుకు రావాల్సి వచ్చిందో మీకు తెలియాలి.

ఉద్యోగం.. నాన్న కల

బహుశా.. అది 1975వ సంవత్సరం అనుకుంటా. నాన్న ఆవుపాలు పితుకుతుంటే నేను లేగదూడను పట్టుకుని నిలబడ్డాను. రేడియోలో ఢిల్లీ నుంచి ఏడుగంటల వార్తలు వస్తున్నాయి. ఆ సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందని వార్తల్లో చెబుతూ స్త్రీల కోసం ఎన్నో సరికొత్త కార్యక్రమాలు చేపట్టబోతున్నారని చెప్పారు న్యూస్‌రీడర్. నాన్న పాలు పితకడం అయిపోయింది. నేను దూడను వదిలేశాను. అది చెంగుమంటూ ఎగిరి తల్లి పొదుగులో దూరిపోయింది. ఆ రోజు ఉదయం రేడియోలో చెప్పిన మహిళా సంవత్సరం వార్త మా నాన్న బుర్రలో చేరిపోయింది. అప్పటికి నేను డిగ్రీ పూర్తిచేసి, ఇంట్లో ఉన్నాను. 'పద హైదరాబాద్ పోదాం. నీకు ఉద్యోగం వచ్చేస్తుంది' అన్నాడు. హైదరాబాదా? నేను అప్పటికి పక్కజిల్లాకి కూడా పోలేదు. సరే అన్నాను. నాకున్న రెండో, మూడో చీరలు సంచిలో పెట్టుకుని, మా నాన్నతో కలిసి హుస్సేన్‌సాగర్ పక్కన పాటిగడ్డ కాలనీలో ఉన్న మా చిన్నాన్న ఇంటికి వచ్చేశాం.

అప్పటికే ఆ ఇంట్లో నాలాంటివాళ్ళు నలుగురు ఉన్నారు. మా చిన్నమ్మ, చిన్నాన్నల హృదయాలు విశాలమైనా, క్వార్టర్ మాత్రం మహా ఇరుకు. అందరం అందులోనే సర్దుకున్నాం. నన్ను దింపేసి.. మా నాన్న వెళ్ళిపోయాడు. నాకు మంచి ఉద్యోగం వచ్చేస్తుందని మా ఊళ్ళో ఉంటూ గొప్ప కలలు కంటూండేవాడు. 1975 మహిళా సంవత్సరమే కాదు మహా అంధకార సంవత్సరమని నాకు అప్పటికి తెలియదు. 76లో గ్రూప్ ఏ కోసం సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. అప్పటికి పదేళ్లుగా రిక్రూట్‌మెంట్ లేదు. లక్షలాది మందిలో నేనూ పోటీపడ్డాను. పరీక్ష బాగా రాశాను. కానీ ఆ ఉద్యోగం రావడానికి మూడేళ్ల పట్టింది. ఈలోగా రూ.165 జీతానికి అమీర్‌పేటలో రెడ్‌రోజెస్ కాన్వెంట్‌లో చేరాను. ఆ తర్వాత ఇక్రిశాట్‌లో పనిచేశాను. ఇలా చిన్నా చితకా ఉద్యోగాలు చాలానే చేశాను.

ఆదుకున్న స్నేహహస్తం

నేను పాటిగడ్డలో ఉండే రోజుల్లో జయ, విజయ అని ఇద్దరు ఫ్రెండ్స్ ఉండేవాళ్ళు. నేను ఈ రోజు ఈ స్థితిలో నిలబడి ఉండడానికి కారకురాలు జయ. తన స్నేహం, నన్ను మా ఊరి నుంచి లాగి.. మళ్ళీ హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. నేను సంఘర్షిస్తూనే ఎదగడానికి, నా కాళ్ళ మీద నేను నిలబడడానికి తను అందించిన సపోర్ట్‌ను మాటల్లో చెప్పలేను. నిజానికి నా జీవితం పొడవునా, నేను నడిచి వచ్చిన దారికి ఇరువైపులా దివిటీలు పట్టి, దారి చూపించిన వాళ్ళు స్నేహితులు, హితులే. నేను చదువుకున్న స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ కన్యాకుమారి గురించి ఎంత చెప్పినా తక్కువే. నా చదువు కొనసాగడానికి ఆవిడ చేసిన కృషి అపారం. రోజూ ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్ళి, చదువుకున్న రోజుల్లో ఆమె నన్ను తనింట్లో పెట్టుకుని చదివించారు.

మా ఊరు అందాల సెలయేరు

మా ఊరు తూర్పుగోదావరి జిల్లా.. సీతారామపురం. నాకు అందమైన, అద్భుతమైన బాల్యాన్నిచ్చిన చిన్న గ్రామం. మామిడి, జీడి, సపోటా, సీతాఫలం, సరుగుడు తోటలతో పచ్చగా, ప్రాణంగా ఉండే మా ఊరు. ఒకవైపు గోదావరి, మరోవైపు సముద్రం. మా ఇల్లు పెద్ద సత్రం. మా అమ్మలు రోజూ ఏభై, అరవై మందికి వండి పెట్టేవారు. ఏడుగురు చిన్నాన్నలు, పెద్దనాన్నలు వాళ్ళ పిల్లలు అంతా పెద్ద ఉమ్మడి కుటుంబం. మాతాత ఈ కుటుంబానికి రాజు. ఇంతమందికి వండి వడ్డించాక అమ్మలకి ఆఖరున తిండి ఉండేది కాదు. పిల్లలం ఏదో పెట్టింది తిని, ఊరిమీద పడేవాళ్ళం. తోటల వెంబడి తిరుగుతూ ఎక్కువ టైమ్



బయటే ఉండేవాళ్లం. చాలామందికి దొరకని అరుదైన బాల్యం నాది. ఇప్పటికీ ఆ పచ్చటి జ్ఞాపకాలు నాలో మెదులుతాయి.

అడుగడుగునా ఆటంకాలే

ఆడపిల్లల్ని చదివించకూడదన్న మూర్ఖత్వం మా కుటుంబంలో లేదుగానీ.. ఆర్థికంగా స్థోమత లేదు. అందుకే నా చదువు ప్రతి సంవత్సరం ఆగిపోయేది. టీచర్లు ఉత్తరాలు రాసేవారు. చాలా కష్టంగా బి.ఏ. వరకూ లాగాను. మా నాన్నకి తెలియక నన్ను ఓరియంటల్ స్కూల్‌లో చేర్చాడు. అక్కడంతా సంస్కృత మయం. నేను పదో తరగతి వరకూ సంస్కృతం తప్ప వేరే సబ్జెక్టులు చదవలేదు. నా బాల్యం లాగానే నా చదువూ భిన్నంగా సాగింది. చదువుకునే రోజుల్లో తెగ పూజలు చేసేదాన్ని. భక్తిరసం నరనరాన పారేది. అయితే ఇంటర్‌లోకి వచ్చేసరికి ఎన్నో పుస్తకాలు చదివిన ప్రభావం వల్ల నూటికి నూరు శాతం నాస్తికురాలిగా మారిపోయాను. సి.వి. రాసిన 'సత్యకామ జాబాలి', రాహుల్ సాంకృత్యాయన్ రాసిన 'ఓల్గా నుండి గంగాతీరం' అప్పటికే చదివాను. ఇవన్నీ నాలో భక్తిని చావగొట్టి, నాస్తికత్వం వైపు నడిపించాయి.

ఉద్యోగంలో చేరాక

ఏపీపీఎస్‌సీ ద్వారా 1979లో ఉద్యోగం వచ్చింది. ఇరవై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత 2000లో దాన్ని వదిలేశాను. ఆ మధ్యలో 1996లో డిప్యూటీ తహశీల్దారుగా సెలెక్ట్ అయ్యి.. మా ఊరిలో ఉండి ఆ ఉద్యోగం చేశాను. యలమంచిలి ఎమ్మార్వోగా సూపర్‌సైక్లోన్‌ను అతి సమీపంగా చూశాను. హైదరాబాద్‌లో ట్రైనింగు సమయంలో వచ్చిన వరద సహాయ కార్యక్రమాల్లో భాగంగా భయంకరమైన మురికివాడల్లో పనిచేశాను. రెవెన్యూశాఖలోని అధికారుల అభిజాత్యం, అవినీతిపై చిరాకుతో ఎమ్మార్వో ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి.. మళ్ళీ సర్వీస్‌కమిషన్‌కి వెళ్ళిపోయాను. అయితే 'భూమిక'లో పూర్తికాలం పనిచెయ్యాలనే ఆలోచనతో ప్రభుత్వ ఉద్యోగానికి శాశ్వతంగా గుడ్‌బై చెప్పేశాను.

120 రోజుల మెటర్నిటీలీవ్ తెచ్చాం

సర్వీస్ కమిషన్‌లో పనిచేసే రోజుల్లోనే రత్నమాల, సంధ్య వాళ్ళంతా పరిచయమయ్యారు. మేము ఎన్నో కార్యక్రమాల్లో భాగమవ్వడంతో పాటు మంచి మిత్రులం అయ్యాం. నేను సర్వీస్ కమిషన్ ఉద్యోగుల సంఘంలో చాలా క్రియాశీలంగా పనిచేసేదాన్ని. 'నవ్యసాహితీ సమితి' పేరుతో ఒక సాహిత్య సంస్థనూ స్థాపించాం. సినారె, దివాకర్ల వెంకటావధాని, నగ్నముని, ఎన్.గోపిలాంటి వారు ఎందరినో ఆఫీసుకు పిలిచి, ఉపన్యాసాలు ఇప్పించేవాళ్ళం. అప్పటికే నేనూ కథలు, వ్యాసాలు, కవిత్వం రాస్తున్నాను. క్రమంగా నేను ఉద్యోగినుల సంఘంవైపు మళ్ళాను. ఉమెన్స్‌వింగ్ కన్వీనర్‌గా ఎన్నికయ్యాను. ఉద్యోగినుల సమస్యలపై అధ్యయనం చేసి, ఓ పెద్ద మీటింగు పెట్టాం. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల నుండి రెండువేల మంది ఉద్యోగినులు హాజరయ్యారు. 90 రోజుల నుండి 120 రోజులకు పెంచిన మెటర్నిటీ లీవ్ జీవో ఆ సమావేశ ఫలితమే!

అన్వేషితో అనుబంధం

రెగ్యులర్‌గా డౌరీ డెత్ కమిటీ మీటింగులకి హాజరయ్యే నాకు అన్వేషి గురించి తెలిసింది. సజయ, అంబిక, లలిత ఇంకా ఎంతోమంది పరిచయమయ్యారు. ఒకమ్మాయి ఆ మీటింగుకి వస్తుండేది. ఆమె అక్కని వాళ్ళ బావ కిరోసిన్ పోసి చంపేశాడు. చాలా ఏడ్చేది, కోపంగా అరిచేది. ఆమె కన్నీళ్ళు ఇంకా నాకు గుర్తే. నాకు కళ్ళల్లో నీళ్ళూరిపోయేవి ఆ పిల్లని చూస్తే. కోపంతో, ఉద్వేగంతో రగిలిపోయేదాన్ని. స్త్రీలపై జరిగే హింసల గురించి వారం వారం వింటుంటే.. గుండె రగిలిపోయేది. ఏదో చెయ్యాలి? అనే ఆరాటం కలిగేది. స్త్రీల అంశాలు.. సమస్యలు నా ఆలోచనల్లో ప్రథమస్థానంలోకి వచ్చాయి. 'అన్వేషి'తో అనుబంధం నన్ను జాతీయస్థాయి స్త్రీల సమావేశాలకు నడిపించింది. జయప్రభతో పరిచయం 'లోహిత' ఆవిర్భావానికి నాంది అయ్యింది. తెలుగులో మొట్టమొదటి స్త్రీవాద కరపత్రిక అది. లలిత ఆధ్వర్యంలో 'అన్వేషి' నిత్యచైతన్యంలా ఉండేది. వీణ, రమా, సూజి, వసంత, భారతి వీళ్ళందరితో మాట్లాడటం ఎంతో బావుండేది. అక్కడి లైబ్రరీ, మీటింగులు, చర్చలు మనసు వికసించడానికి, ఫెమినిజం అంటే ఏమిటో అర్థం చేసుకున్నది 'అన్వేషి'లోనే. "ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్"లో మాట్లాడగలిగే స్థాయికి నేను ఎదిగింది ఇక్కడే. ఇందులోనే ఓల్గా పరిచయమైంది. అస్మిత పరిచయం, వసంత్‌తో పరిచయం కూడా ఇక్కడే. 'మూడుతరాలు' పుస్తకాల చర్చలు ఓల్గా, రంగనాయకమ్మల వివాదం మీద వచ్చిన పుస్తకాలు.. ఇవన్నీ నాలో రకరకాల ముద్రల్ని వేశాయి. అప్పట్లో 'అన్వేషి'లో ఒక పత్రిక తీసుకురావాలనే చర్చ జరుగుతుండేది. 'అన్వేషి' టీమ్‌తో కలిసి సారా ఉద్యమ అధ్యయనం కోసం నెల్లూరు వెళ్లాం. అక్కడ దూబగుంట రోశమ్మను కూడా కలిశాం.

భూమిక పుట్టిందిలా!

చర్చోపచర్చల తర్వాత 1993 జనవరిలో 'భూమిక' మొదటి సంచిక బయటకు వచ్చింది. నేను ఎడిటర్‌గా 'భూమిక' మొదలైంది. ఒక సామూహిక ప్రయత్నంగా మొదలైనా క్రమంగా, వివిధ కారణాలవల్ల వ్యవస్థాపక సభ్యులంతా వెళ్ళిపోయినా 'భూమిక' పట్ల నాకున్న ప్రేమ, నిబద్ధతలో ఏమార్పూ రాలేదు. నేను ఇప్పటికీ అదే ఉద్దేశంతో నడిపిస్తున్నాను. 'భూమిక హెల్ప్‌లైన్' 2006 మార్చిలో ప్రారంభించాను. ఎక్కడికక్కడ కౌన్సెలర్లు, వాలంటీర్ల సహకారంతో ఇప్పటివరకూ 50 వేల మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. వేలాది కేసులు పరిష్కరించాం.

విజయవాడ నాస్తిక కేంద్రం (గోరా గారిది) ఆధ్వర్యంలో మహిమలకు వ్యతిరేకంగా నిప్పుల మీద నడిచే కార్యక్రమం పెట్టారు. నేను కణకణ మండే నిప్పుల గుండం మీద నడిచి తూలిపోబోతున్నపుడు ఓ చేయి నన్ను పడిపోకుండా ఆపింది. నాస్తికత్వం పునాదిగా ఆ చేతిలో చెయ్యేసి అతడినే నా జీవన సహచరుడిగా చేసుకున్నాను. నాస్తికత్వం నేటికీ నా జీవన విధానమే.

సంభాషణ : బెందాళం క్రిష్ణారావు




ఇంకా ఎంతో చేయాలి

నేను నడిచివచ్చిన మార్గాన్ని తిరిగి చూసుకున్నపుడు నాకు సంతృప్తిగానే ఉంది. వ్యక్తిగతంగా ఎంచుకున్న దారిలోనే నేను వెళ్తున్నాననే అనిపిస్తుంది. అయితే ఈనాటి మహిళ ఎదుర్కొంటున్న హింస మాత్రం తీవ్రంగా నన్ను ఉద్విగ్నపరుస్తుంది. ఇంకా ఎంతో చెయ్యాలనే కర్తవ్యాన్ని బోధిస్తుంది. ప్రపంచీకరణ మాయాజాలంలో మునిగి తేలుతున్న మహిళలు.. చైతన్యంతో ఉద్యమించాల్సిన అవసరం ఎంతో ఉంది. అది వారి మీద జరుగుతున్న నేరాల చిట్టానే తేల్చి చెబుతోంది.

- కొండవీటి సత్యవతి ,
భూమిక హెల్ప్‌లైన్ (1800 425 2908)

వేసవిలో.. ఫేస్‌ప్యాక్





వేసవికాలం వస్తే ఇంటి నుంచి బయటకు వెళ్ళడానికే భయమేస్తుంది. ముందు చూపులేకుండా ఎండలో తిరిగితే చెట్ల ఆకుల్లా మన చర్మమూ వాడిపోతుంది. ఈ కాలంలో చర్మ సంరక్షణ కోసం మార్కెట్లో దొరికే అనేక రసాయిన ప్రొడక్ట్స్‌పై ఆధారపడకుండా కొన్ని చిట్కాలు పాటించవచ్చు. ఎండాకాలం మరింత ఆరోగ్యంగా ఉండటానికి పండ్లు తింటారు. అవి ఆరోగ్యానికి మంచిదైతే వాటి తొక్కలు చర్మాన్ని సంరక్షిస్తాయి. వివిధ పండ్ల తొక్కలతో ఫేస్‌ప్యాక్ తయారు చేసుకోవచ్చు. రోజువారీ ఒత్తిడి, చర్మం పొడిగా మారడం, ఏసీల వల్ల చర్మం నిర్జీవంగా మారడం ఎండాకాలంలో సహజమే. ఇలాంటప్పుడు చర్మానికి నూతనోత్తేజాన్ని అందించే మాస్క్ అప్లై చేసుకోవాలి. పండ్లల్లో మంచి పోషకాలతో పాటు అందాన్నీ పెంపొందించే గుణం ఉంటుంది.

- అరటి తొక్క అనేక చర్మ సమస్యలను నివారిస్తుంది. ఇందులో విటమిన్లు, పోషకాలు, ఎక్కువగా ఉండటం వల్ల చర్మం రంగును మెరుగుపరుస్తుంది. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి కనుక ఎండ వేడిమి, చెమట వలన వచ్చే మొటిమలకు చెక్ పెట్టడానికి బాగా ఉపయోగపడుతుంది. కాబట్టి, ముఖానికి అరటితొక్క ప్యాక్‌గా వాడితే మంచి ప్రయోజనం ఉంటుంది.
- బరువు తగ్గడానికి నారింజ ఎంత ఉపయోగపడుతుందో దాని తొక్క సహజమైన స్క్రబ్‌లా, బ్లీచింగ్‌లా చర్మంపై పనిచేస్తుంది. దానిమ్మ తొక్క మొటిమలు, పొక్కులు రాకుండా సంరక్షిస్తుంది. నిమ్మ తొక్క చర్మంపై న్యాచురల్ మాయిశ్చరైజర్‌లా, క్లెన్సర్‌లా పనిచేస్తుంది.
- బొప్పాయి తొక్కలను అలసిపోయిన చర్మానికి ప్యాక్‌గా వాడటం వల్ల చర్మం నూతన అందాన్ని సంతరించుకుంటుంది. చర్మంలో మలినాలు తొలగి, మంచి కాంతి వస్తుంది. చర్మాన్ని ఫెయిర్‌గా మార్చుతుంది.
- పుచ్చకాయ తొక్కలో ఉండే తెల్లటి భాగంలో అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని చర్మంపై ప్యాక్ వేయడం వల్ల పేరుకున్న మురికి తొలగిపోతుంది. అలాగే చర్మం పగిలిపోకుండా అరికడుతుంది.
- బేరిపండ్ల ఫేస్‌ప్యాక్ అందాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుంది. బేరిపండ్ల తొక్కతో ప్యాక్ వేసుకోవడం, తొక్కను వేడినీటిలో ఉడికించి ఆ నీళ్ల చల్లగా మారిన తర్వాత వాటితో ఫేస్‌వాష్ చేసుకోవడం వల్ల చర్మం తెల్లగా మారుతుంది. ★

ము కోసం

తేనెలో కొద్దిగా పాలు, ఓట్స్ వేసి మెత్తగా తయారుచేసిన పేస్ట్‌ను కళ్ళజోడు వల్ల ముఖంపై ఏర్పడే మచ్చలపై రాస్తే.. తగ్గుతాయి.



జీవన సౌరభం

ఇవాళ్టిని ఒడిసి పట్టుకోవాలి.
అనుకున్నది
ఇప్పుడే ప్రారంభించాలి.
ప్రతిదినమూ
కొత్తగా జీవించాలి.



జీవన చిత్రం
ఫొటో : టి.వి. రమణ

ఏప్రిల్ నుంచి ఇ-వే బిల్లు అమలు

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ని ఎగవేతను నిరోధించేందుకు ఉద్దేశించిన ఎలక్ట్రానిక్-వే (ఇ-వే) బిల్లును ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తేవాలని శనివారం జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయించింది. దశల వారీగా రాష్ట్రాల మధ్య జరిగే సరకు రవాణాకు ఇ-వే బిల్లు ఉంటుంది. జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా ఇ-వే బిల్లు అమల్లోకి రానుంది. రెండు రాష్ట్రాల మధ్య రూ.50వేలకు మించి విలువ గల సరకులు రవాణా చేయాలంటే ఇ-వే బిల్లు తప్పనిసరి. దీని ఆధారంగా సరకు ఎక్కడి నుంచి ఎక్కడికి రవాణా అవుతుందో ప్రభుత్వం ట్రాక్ చేయనుంది. పన్నుల ఎగవేతను అరికట్టడానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.



ఎయిరిండియా సాట్స్‌కు రెండు అవార్డులు

ఎయిరిండియా సాట్స్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్‌కు 'బెస్ట్ గ్రౌండ్ హాండ్లింగ్ సర్వీస్ ప్రొవైడర్' 'బెస్ట్ ఎయిర్ కార్గో సర్వీస్ ప్రొవైడర్' అవార్డులను దక్కించుకుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2018 ప్రదర్శనలో ఈ అవార్డులను ఆ సంస్థల ప్రతినిధులు నరసింహన్, బొబ్బన్ జోసే అందుకున్నారు.



సిల్క్ ఫాబ్ ప్రదర్శన..

చేతి వృత్తులు, టెక్‌టైల్ మంత్రిత్వశాఖ చొరవతో శనివారం హైదరాబాద్‌లో సిల్క్‌ఫాబ్ వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించింది. ఇక్కడి కమ్మసంఘంలో మార్చి 10-23 వరకు జరుగనున్న ఈ ప్రదర్శనను తెలంగాణ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ డైరెక్టర్ శైలజ రమయ్యర్ లాంచనంగా ప్రారంభించారు. 10 రాష్ట్రాల నుంచి 65 ఎజెన్సీలు ఇందులో పాల్గొన్నాయి.

మరో 20 రూట్లలో ట్రూజెట్ సర్వీసులు

- ద్వితీయ శ్రేణీ నగరాలకు విస్తరణ
- ప్రయాణికుల్లో నాలుగు రెట్ల వృద్ధి లక్ష్యం
- రెండున్నరేళ్లలోనే 10 లక్షల మందికి సేవలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



ప్రాంతీయ విమానయాన సంస్థగా సేవలు ప్రారంభించిన ట్రూజెట్ త్వరలో దేశ వ్యాప్తంగా మరిన్ని సర్వీసులను అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించింది. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) గ్రూప్ కంపెనీలో భాగమైన టర్బో మేఘా ఎయిర్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ 'ట్రూజెట్' త్వరలోనే పశ్చిమ, తూర్పు తీరం, ఈశాన్య ప్రాంతాలకు కూడా విమాన సేవలను విస్తరించనున్నట్లు పేర్కొంది. ఉడాన్ పథకం రెండో దశలో భాగంగా త్వరలోనే మరో 20 రూట్లలో తన సేవలను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్, అస్సాం రాజధాని గౌహతి నుంచి ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాలకు విమానాలు నడపనున్నామని ట్రూజెట్ వాణిజ్య వ్యవహారాల పర్యవేక్షణ అధికారి సెంథిల్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే హైదరా బాద్ కేంద్రంగా 12 ప్రాంతాలకు రోజూ కనీసం 2వేల మందిని వివిధ ప్రాంతాలకు తీసుకువెళుతున్నామన్నారు. త్వరలో ప్రయాణికుల సంఖ్యను నాలుగింతలకు పెంచుకోవాలనే లక్ష్యంతో కార్యక లాపాలను విస్తరిస్తోన్నామని తెలిపారు.

పెద్ద విమాన కంపెనీలు కూడా ఈశాన్య ప్రాంతాలకు సేవలు అందించడంలో వెనకాడుతున్న ప్రస్తుత సమయంలో తాము ఒక ముందడుగు వేశామన్నారు. తాము కొత్తగా అనుమతి పొందిన రూట్లలో అహ్మదాబాద్ నుంచి గుజరాత్‌లోని పోరుబందర్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, మహారాష్ట్రలోని నాసిక్, జలగావ్లతో పాటు గౌహతి నుంచి ఈశాన్య రాష్ట్రాల్లోని కుచ్చిబెహర్, బురన్పూర్, తేజు, తేజ్‌పూర్ తదితర మార్గాలు ఉన్నాయన్నారు. సంస్థని స్థాపించిన రెండున్నర సంవత్సరాల్లోనే పది లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యానికి చేర్చామన్నారు. 2015 జూలై 12న రెండు విమానాలతో ప్రారంభమైన ప్రస్తుతం ఐదు విమానాలకు పెంచుకున్నామన్నారు. త్వరలో మరో కొత్త ఏడు విమానాలను జోడించనున్నామన్నారు. ప్రతి రోజు 13 ప్రాంతాలకు 32 సర్వీసెస్‌లను ట్రూజెట్ నడుపుతోన్నామన్నారు. ఉడాన్ పథకం తొలి దశలో 18 రూట్లను పొందిన ట్రూజెట్ ఆయా ప్రాంతాలకు ఇప్పటికే విమాన సర్వీసెస్‌లను ప్రారంభించిందన్నారు. తమ విమానాల్లో టికెట్ ప్రారంభ ధర రూ.599గా ఉందన్నారు.

సరైన సమయం కాదు

- పిఎస్‌బిల ప్రయివేటీకరణపై ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్
- ప్రస్తుత సామాజిక-ఆర్థిక పరిస్థితుల్లో కుదరదు
- 20 ఏళ్ళ తర్వాత ఆలోచించాలి
- రెండేళ్లలో బ్యాంకులు పటిష్టం • ఎస్‌బిఐ చీఫ్ రజ్నీష్ కుమార్


ఎస్ ఎస్ ముద్రా

న్యూఢిల్లీ : ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణ యోచన సరైంది కాదని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ ఎస్ ఎస్ ముద్రా అన్నారు. భారత్‌లో ప్రస్తుతం నెలకొని ఉన్న సామాజిక- ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎంతో అవసరమన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ మెజారిటీ హోల్డింగ్ వాటాను కొనసాగించడమే మంచిదన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ప్రోత్సాహంతో ఇక్కడ ఏర్పాటు చేసిన 'మింట్ ఆసియా గ్లోబల్ బ్యాంకింగ్ కాన్‌క్లేవ్'లో ఆయన మాట్లాడారు. ఈ ప్యానెల్ డిస్కషన్‌లో భారత వ్యాపారస్తులు 200 మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రా మాట్లా డుతూ పిఎస్‌బిల్లో ప్రభుత్వ మెజారిటీ వాటా కొనుగోలు చేయాలన్నారు. కాగా బ్యాంకుల ప్రయివేటీకరణకు 15-20 సంవత్సరాల రోడ్ మ్యాప్ అవసరమన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణపై పారిశ్రామిక వర్గాలు చేసిన వ్యాఖ్యలపై ఎస్‌బిఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ముద్రా సమర్థించారు. పిఎస్‌బిలు సర్వరోగాంతకములో ఏమీ లేవన్నారు. ప్రస్తుత భారత ఆర్థిక-సామాజిక పరిస్థితుల్లో బ్యాంకుల ప్రయివేటీకరణ నిర్ణయం సరైంది కాదని ఎస్‌బిఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్ ప్యానెల్ డిస్కషన్‌లో పునరుద్ఘాటించారు. 20 ఏళ్ల తర్వాత దీనిపై ఆలోచించాలన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం మొత్తం బ్యాంకింగ్ పరిశ్రమను దెబ్బతీసిందని ఆయనతో పాటు బ్యాంకర్లు పేర్కొన్నారు.

బ్యాంకుల్లో నెలకొన్న సంక్షోభ నివారణకు చర్యలు తీసుకుంటున్నారని కుమార్ పేర్కొన్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో బ్యాంకులు పటిష్టం అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో పరిపాలన విధానం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కుమార్ పేర్కొన్నారు. బ్యాంకుల బోర్డులు, ఎగ్జిక్యూటీవ్‌ల్లో నాణ్యత పెరగాలని సూచించారు. ప్రస్తుత సమయంలో బ్యాంకుల ఏకీకరణ కూడా సరైంది కాదన్నారు. బ్యాంకులు తిరిగి విశ్వాసం పుంజుకున్న తర్వాత దీనిపై ఆలోచన చేస్తే బాగుంటుందని కుమార్ పేర్కొన్నారు. 21 పిఎస్‌బిలను ఏడు లేదా 8 బ్యాంకులుగా ఏకీకరణ చేస్తే బాగుంటుందని ముద్రా అభిప్రాయపడ్డారు. దీంతో దేశ మౌలిక వసతుల అభివృద్ధికి అధికంగా నిధులు సమకూర్చడానికి వీలవుతుందన్నారు.

కాగా ఎప్పటికైనా బ్యాంకుల ఏకీకరణ చోటు చేసుకోనుందని, అయితే అన్నింటినీ కలిపివేయకూడదని కుమార్ సూచించారు. కార్పొరేట్, రిస్కు గవర్నెన్స్ సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా నిర్వహణ రిస్కు సవాళ్లను ఎదురుకోవచ్చని ఇది వరకు ఓ సమావేశంలో ఆయన అన్నారు. బ్యాంకులకు అప్పులు ఎగ్గొడుతున్న వారే సమావేశాల్లో ముందు వరుసలో కూర్చొని తమకు నీతి సుత్రాలు చెబుతున్నారని ఇది వరకు ఆయన పారిశ్రామికవేత్తలకు చురకలు అంటించారు.


రజ్నీష్ కుమార్

స్మార్ట్‌ఫోన్లపై ఐడియా క్యాష్ బ్యాక్ ఆఫర్లు

ముంబయి : ప్రముఖ టెలికం కంపెనీ ఐడియా సెల్యూలర్ అన్ని నూతన 4జి స్మార్ట్‌ఫోన్లపై క్యాష్ బ్యాక్ ఆఫర్లను అందిసున్నట్లు ప్రకటించింది. 4జి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ వినియోగదారులకు ఈ ఆఫర్ వర్తిస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది. ఏ బ్రాండ్ ఫోన్‌పై అయినా రూ.2000 క్యాష్ బ్యాక్ పొందవచ్చని ఐడియా సెల్యూలర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శశి శంకర్ పేర్కొన్నారు. ఇందుకోసం ఐడియా వినియోగదారులు ప్రతీ నెల కనీసం రూ.199 రీచార్జీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. 18 నెలల పాటు రూ.3000 రీఛార్జ్ చేయించుకోవడం ద్వారా రూ.750, మరో 18 నెలల్లో మరో రూ.3వేలు రీఛార్జీ చేసుకోవడం ద్వారా మరో రూ.1250 క్యాష్ బ్యాక్ లభించనుందన్నారు.

భారత రొయ్యలపై అమెరికా కయ్యం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంపు ఎన్నికైన తర్వాత మితృత్వం అంటూనే మరో విధంగా భారత్‌పై ఆంక్షలు పెంచుతున్నారు. గతంలోనే వీసాల జారీపై కఠినతర నిబంధనలు సృష్టించిన ట్రంపు మొన్న ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై పన్నుల మోత మోగించాలని నిర్ణయించారు. తాజాగా భారత్ నుంచి ఎగుమతయ్యే రొయ్యలపై ఉన్న పన్ను లను మూడురెట్లు పెంచారు. ప్రస్తుతం రొయ్య లపై 0.84శాతం పన్ను చెల్లిస్తుండగా దానిని 2.34శాతానికి చేర్చుతూ ఆ దేశ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ (డిఒసి) నిర్ణయించింది. భారత్ నుంచి వచ్చే రొయ్యలను అమెరికాలో సాధారణ ధర కన్నా తక్కువకు విక్రయిస్తున్నట్లు గుర్తించి నట్లు డిఒసి తెలిపింది.

TELUGU PAPER-I

S.S.C. MODEL PAPER

ప్రథమ భాష

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

విద్యార్థులకు సూచనలు:

1. పార్టు - 'ఎ' ప్రశ్నలకు సమాధాన పత్రంలో జవాబులు రాయాలి.
2. పార్టు - 'బి' ప్రశ్నలకు ప్రశ్నాపత్రములోనే జవాబులు రాసి, సమాధాన పత్రానికి జతచేయాలి.
3. మొదటి 15 నిమిషాలు ప్రశ్నాపత్రం చదువుకోవడానికి వినియోగించాలి.
4. ప్రతి ప్రశ్నకు కోరిన విధంగా జవాబులు రాయాలి. అంతర్గత ఎంపిక వ్యాసరూప ప్రశ్నలకు మాత్రమే అని గమనించాలి.

పార్ట్ -ఎ

I. అవగాహన - ప్రతిస్పందన : (12 మార్కులు)

అ). 1. ఈ కింది వాక్యాలను సంఘటన క్రమంలో రాయండి. 4X1=4

అ). సీతజాడ కోసం దక్షిణ దిక్కుకు అంగదుని నాయకత్వంతో హనుమంతుడు, జాంబవంతుడు వెళ్లారు.
ఆ). శ్రీరాముడు, సుగ్రీవుడు అగ్నిసాక్షిగా మంచి మిత్రులయ్యారు.
ఇ). కిష్కింధకు రాజుగా సుగ్రీవుడు యువరాజుగా అంగదుడు పట్టాభిషిక్తులయ్యారు.
ఈ). శ్రీరాముడు వదిలిన బాణం దెబ్బకు వాలి చనిపోయాడు.

ఆ). ఈ క్రింది పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 4X1=4

వర్థిలు నిశి శశివలనన్
వర్థిలును దినంబు సూర్య భగవానునిచే
వర్థిలు ధర్మమును జగము
వర్థిలు సుకుమారు వలన వంశము వత్సా!

ప్రశ్నలు:
2). రాత్రి దేని వల్ల వర్థిలుతుంది ?
3). ధర్మము వల్ల వర్థిల్లేది ఏమిటి ?
4). వంశము ఎవరి వల్ల వర్థిలుతుంది ?
5). ఈ పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి ?

ఇ). కింది పరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 4X1/2=2

వీరేశలింగం, చిలకమర్తుల ఆశీర్వాదం పొందిన జాషువా తన సాహితీ తపస్సుని అణగారిన వర్గాల శ్రేయస్సుకై ఉపయోగించారు. వారు కోల్పోయిన విలువైన జీవితాన్ని తిరిగి పొందేలా కృషి చేశారు. మనిషిని మనిషినుంచి విడదీసే సాధనాలను గర్హించిన 'గబ్బిలము' నరుడిని కష్టపెట్టి నారాయణుని కొల్చే అధర్మాన్ని ఖండించింది. కాళిదాసు మేఘసందేశాన్ని దృష్టిలో ఉంచుకొని వీరి రచన సాగింది. గాంధీ విధానాన్ని పూర్తిగా విశ్వసించిన ఈ విశ్వకవిసామ్రాట్ గుఱ్ఱం జాషువా గబ్బిలము ద్వారా 'తుకతుక ఉడికే అశ్రు సందేశాన్ని' పంపించారు.

ప్రశ్నలు :
6). జాషువా తన సాహితీ తపస్సుని దేనికొరకు ఉపయోగించారు?
7). గాంధీ విధానాన్ని పూర్తిగా విశ్వసించినది ఎవరు ?
8). మేఘసందేశం కావ్యాన్ని ఎవరు రచించారు ?
9). ఈ పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి ?

ఈ). కింది బయోడేటాను చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 4X1/2=2

స్వీడన్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ బెర్నార్డ్ నోబెల్ స్టాక్‌హోమ్ పట్టణంలో 1833 అక్టోబర్ 21వ జన్మించాడు. తల్లి అండ్రియెట్ నోబెల్, తండ్రి ఇమ్మాన్యుయేల్ నోబెల్. నోబెల్ ఇంజనీరు అయినప్పటికీ వ్యాపారవేత్తగా, పరిశోధకుడిగానూ రాణించాడు. ప్రపంచవ్యాప్తంగా ఆయన దాదాపు 355 పేటెంట్లు పొందాడు. వ్యాపారవేత్తగానూ వివిధ దేశాల్లో 87 సంస్థల్ని నిర్వహించాడు. తన తండ్రి చేసే నిర్మాణరంగ వ్యాపారానికి అనువుగా రాళ్ళను బద్దలుకొట్టేందుకు ఉపయోగపడేలా 'డైనమైట్' కనుగొన్నాడు. ఇలా అనేక రంగాల్లో ప్రతిభ కనబర్చిన నోబెల్ డిసెంబర్ 10,1896లో కన్నుమూశాడు.

ప్రశ్నలు:
10). నోబెల్ ఏ పట్టణంలో జన్మించాడు ?
11). ఎన్ని అంశాలపై నోబెల్ పేటెంట్లు పొందాడు ?
12). నోబెల్ తండ్రి ఏ రంగంలో వ్యాపారం చేసేవాడు ?
13). పై బయోడేటాను చదివి ఒక ప్రశ్న తయారుచేయండి.

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (18మార్కులు)

ఉ). ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 2X2=4

14. "దశరథుడు" పాత్ర స్వభావాన్ని వివరించండి.
15. "ఇచ్చినమాట తప్పటం మీ ఇంటా వంటా లేదు. నీవందుకు సిద్ధపడితే రిక్తహస్తాలతో తిరిగివెళతాను. మీరు సుఖంగా ఉండండి." అని విశ్వామిత్రుడు దశరథునితో పలికిన మాటలను బట్టి మీరేమి గ్రహించారు.

ఊ). ఈ క్రింది ప్రశ్నలకు పది లేక పన్నెండు వాక్యాల్లో సమాధానాలు రాయండి. 1X4=4

16. సీతాపహరణ జరిగిన క్రమాన్ని సొంతమాటల్లో రాయండి.

(లేదా)

లంకాదహన వృత్తాంతాన్ని వివరించండి.

ఋ). ఈ క్రింది రెండు ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి. 2X5=10

17. 'దోమల నివారణ - అందరి బాధ్యత' అని తెలుపుతూ కరపత్రం తయారుచేయండి.

(లేదా)

మీ గ్రామ సమస్యలను తెల్పుతూ కలెక్టరుగారికి లేఖ రాయండి.

18. మీ పాఠశాలకు ముఖ్యఅతిథిగా వచ్చిన శతక కవిని ఇంటర్వ్యూ చేయుటకు పది ప్రశ్నలు తయారుచేయండి.

(లేదా)

'స్వచ్ఛభారత్' గురించి వ్యాసం రాయండి.

పార్ట్ -బి

విద్యార్థులకు సూచనలు:
1) ఇచ్చిన ప్రశ్నలకు తగిన జవాబులను బ్రాకెట్లలో గుర్తించండి.
2) పార్టు-'బి' కి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్నాపత్రంలోనే రాసి, పార్టు-ఎ సమాధానపత్రానికి జతచేసి ఇవ్వవలెను.

III. భాషాంశాలు: (పదజాలం - వ్యాకరణం)

క్రింది ఇవ్వబడిన ప్రశ్నలకు సరియైన సమాధానాలను గుర్తించి వాటికెదురుగానున్న బ్రాకెట్లలో ఆ సమాధానపు అంకెను వేయండి.

1.'ఒక రాణివాసమును పుణ్యావాసమున్ తెచ్చినావా'-ఈ వాక్యానికి ఆధునిక వచనాన్ని గుర్తించండి. ( )
ఎ). ఒక రాణివాసాన్ని పుణ్యావాసాన్ని తెచ్చావా!
బి). 'ఒక రాణివాసంబును పుణ్యావాసంబున్ తెచ్చినావా'
సి). 'ఒక రాణివాసపు స్త్రీని పుణ్యావాసమ్మును తెచ్చినావా'
డి). 'ఒక రాణివాసమ్మును పుణ్యావాసమ్మును ఎందుకు తెచ్చావు.

2. 'ఆహా! ధనలోభము సర్వాపదలకు మూలము గదా!'- ఈ వాక్యానికి ఆధునిక వచనాన్ని గుర్తించండి ( )
ఎ). ఆహా! ధనలోభమ్ము సర్వాపదలకు మూలం.
బి). ఆహా! ధనలోభం సర్వాపదలకు మూలం కదా!
సి). ఆహా! ధనలోభంబు సర్వాపదలకు మూలంబు గదా!
డి). ఆహా! ధనలోభమ్ము సర్వాపదలకు మూలమ్ము.

3. శివాజీ యవన స్త్రీని సత్కరించెను - దీనికి కర్మణి వాక్యం గుర్తించండి. ( )
ఎ). యవన స్త్రీలను శివాజీ సత్కరిస్తుంటాడు
బి). శివాజీ యవనస్త్రీని తల్లిగా చూశాడు.
సి). యవన స్త్రీ శివాజీచే సత్కరించబడెను.
డి). శివాజీ స్త్రీలను సత్కరిస్తాడు.

4. వైకుంఠపురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించబడెను - దీనికి కర్తరి వాక్యం గుర్తించండి. ( )
ఎ). వైకుంఠపురంలో చాలా ఆలయాలు నిర్మించారు.
బి). వైకుంఠపురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు.
సి). వైకుంఠపురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం కొండమీద నిర్మిస్తున్నారు.
డి). వైకుంఠపురంలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తున్నారు.

5. "నేను ఎప్పుడు పుట్టానో నాకు తెలియదు." అని యువకుడు అన్నది.- దీనికి పరోక్ష కథనం గుర్తించండి. ( )
ఎ). నేను ఎప్పుడు పుట్టానో ఎవరికి తెలియదు, అని యువకుడు అన్నది.
బి). తాను ఎప్పుడు పుట్టాడో నాకు తెలియదని యువకుడు అన్నది.
సి). తాను ఎప్పుడు పుట్టానో తనకు తెలియదని యువకుడు అన్నది.
డి). నేను ఎప్పుడు పుట్టానో అందరికి తెలుసు అని యువకుడు అన్నది.

6. తానిప్పుడే దండకారణ్యానికి బయలుదేరుతున్నానని శ్రీరాముడు అన్నాడు.- దీనికి ప్రత్యక్ష కథనం గుర్తించండి. ( )
ఎ). "తండ్రి, శ్రీరాముడ్ని దండకారణ్యానికి బయలు దేరమన్నాడు."
బి). "నేనిప్పుడు దండకారణ్యానికి బయలుదేరను." అని శ్రీరాముడు అన్నాడు.
సి). "నన్ను ఇప్పుడే దండకారణ్యానికి బయలుదేరమన్నాడు శ్రీరాముడు."
డి). "నేనిప్పుడే దండకారణ్యానికి బయలుదేరుతున్నాను." అని శ్రీరాముడు అన్నాడు.

7. స్త్రీల సమూహం మాకు గొప్ప ప్రేరణను ఇచ్చింది- వ్యతిరేకార్థక వాక్యాన్ని గుర్తించండి. ( )
ఎ). స్త్రీల సమూహం మాకు గొప్ప ప్రేరణను ఇవ్వలేదు
బి). స్త్రీల సమూహం మాకు గొప్ప నిరుత్సాహాన్ని ఇచ్చింది.
సి). స్త్రీల సమూహం ఎవరికి గొప్ప ప్రేరణను ఇవ్వకూడదు.
డి). స్త్రీల సమూహం మాకు అల్ప ప్రేరణను ఇచ్చింది.

8. వాళ్ళు నవ్వుతూ ఆహ్వానించారు - ఇది ఏరకమైన సంశ్లిష్ట వాక్యమో గుర్తించండి. ( )
ఎ). అప్యర్థకం బి). చేదర్థకం
సి). క్త్వార్థకం డి). శత్రర్థకం

9. రాఘవేంద్ర చదరంగం, కంప్యూటర్ నేర్చుకొంటున్నాడు. - ఇది ఏరకమైన వాక్యమో గుర్తించండి. ( )
ఎ). సంశ్లిష్ట వాక్యం బి). సంయుక్త వాక్యం
సి). సామాన్యవాక్యం డి). సందేహార్థకం

10. చెప్పుడు మాటలు వినవద్దు - ఇది ఏరకమైన వాక్యమో గుర్తించండి. ( )
ఎ). సామర్థ్యార్థకం బి). సందేహార్థకం
సి). నిషేధార్థకం డి). అనుమత్యర్థకం

11. గాలి తీవ్రమై చెట్లు కూలిపోయాయి. - ఇది ఏరకమైన వాక్యమో గుర్తించండి. ( )
ఎ). విధ్యర్థకం బి). సందేహార్థకం
సి). ఆశ్చర్యార్థకం డి). హేత్వర్థకం

12. మీరు భోజనానికి రావచ్చు - ఇది ఏరకమైన వాక్యమో గుర్తించండి. ( )
ఎ). నిషేధార్థకం బి). అనుమత్యర్థకం
సి). ఆశీరర్థకం డి). ఆశ్చర్యార్థకం

13. ఏకాగ్రతతో వినండి. - ఇది ఏరకమైన వాక్యమో గుర్తించండి. ( )
ఎ). ఆశ్చర్యార్థకం బి). ప్రశ్నార్థకం
సి). నిషేధార్థకం డి). విధ్యర్థకం

14. అక్క ఏం చేస్తుంది? - ఇది ఏరకమైన వాక్యమో గుర్తించండి. ( )
ఎ). ప్రశ్నార్థకం బి). నిషేధార్థకం
సి). ప్రార్థనార్థకం డి). అనుమత్యర్థకం

ఈ క్రింది జాతీయాలను ఏ సందర్భంలో ఉపయోగిస్తారో రాయండి.
15. సుగ్రీవాజ్ఞ :
16. నీరుకారిపోవుట :
17. గుండెలు బరువెక్కడం :

ఈ క్రింది పదాలతో వాక్యప్రయోగం చేయండి.
18. సాన్నిధ్యం :
19. సమయసందర్భాలు :
20. పఠనీయగ్రంథం :

పార్టు-బి జవాబులు

1) ఎ	2) బి	3) సి	4) బి
5) సి	6) డి	7) ఎ	8) డి
9) బి	10) సి	11) డి	12) బి
13) డి	14) ఎ		

15) 'మీరరాని ఆజ్ఞ' అనే అర్థంలో ఈ జాతీయాన్ని వాడతారు.
16) 'ఉన్న ఉత్సాహం పోవడం' అనే అర్థంలో ఈ జాతీయాన్ని వాడతారు.
17) 'మిక్కిలి బాధతో ఉండడం' అనే అర్థంలో ఈ జాతీయాన్ని వాడతారు.
18) అర్థవంతంగా వాక్యంలో ప్రయోగించిన
19) అర్థవంతంగా వాక్యంలో ప్రయోగించిన
20) అర్థవంతంగా వాక్యంలో ప్రయోగించిన ★

ఉద్యోగాలు

యూపీఎస్సీ ఆరు పోస్టులకు నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆరు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: ట్రాన్స్‌లేటర్ (టిబెటన్)-1, అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ-5 (కెమికల్-1 + ఎలక్ట్రికల్-1 + మెకానికల్-3).
వేతనశ్రేణి: రూ.56,100-రూ.1,77,500.
అర్హతలు: ట్రాన్స్‌లేటర్‌కు బ్యాచిలర్ డిగ్రీ (టిబెటన్)/ డిప్లొమా (టిబెటన్), అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ పోస్టులకు ఇంజనీరింగ్ డిగ్రీ (కెమికల్/ ఎలక్ట్రికల్/ మెకానికల్)/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో అనుభవం.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
దరఖాస్తు ఫీజు: రూ.25, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: మార్చి 15, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: https://upsconline.nic.in

సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-కాకినాడ

కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేయాలంటూ కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలను శనివారం ప్రారంభించారు. రెండ్రోజుల పాటు నిర్వహించనున్న ఈ దీక్షలను ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, జెఎసి జిల్లా చైర్మన్ బూరిగ ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేసే వరకూ పోరాడతామన్నారు. ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు తూతిక విశ్వనాథ్ మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల రాష్ట్రంలో 1.84 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు.



రౌండ్‌టేబుల్ విజయవాడ సిఆర్ లైబ్రరీలో 'ప్రత్యేక హోదా - ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు' అనే అంశం పై శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

ఆంధ్ర రాష్ట్రంలో స్థాపించే ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ సిఆర్ లైబ్రరీలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ఫ్రాన్సిస్ ఆధ్యక్షతన శనివారం 'ప్రత్యేక హోదా - ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు' అనే అంశం పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి జన సభ రాష్ట్ర అధ్యక్షులు జి.గంగాధర్ మాట్లాడుతూ బిజెపి మద్దతు లేకపోతే రాష్ట్ర విభజన జరిగేది కాదన్నారు. ప్రభుత్వం నుండి పొందిన రాయితీలతో ఏర్పాటు చేసే ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. తుమ్మల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా వల్ల రైల్వే జోన్, అధిక సంఖ్యలో పరిశ్రమలు వస్తాయని తద్వారా యువకులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మించి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ యువకులను తప్పుదారి పట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. భీమ్‌భూమి ఎడిటర్ మాతంగి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సహజ వనరులపై అగ్ర కుల ఆధిపత్యం కొనసాగుతోందన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన సమితి జాతీయ అధ్యక్షులు లాం జయబాబు మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేనప్పుడు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు ప్రత్యేక హోదా వల్ల ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎవిడిఆర్‌ఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు వంగవీటి నరేంద్ర, కొప్పుల శేషగిరిరావు, దళిత నాయకులు కె.నాగబాబు, ఉడుముల బుజ్జి, దళిత ఐక్య వేదిక అధ్యక్షులు పినమాల నాగుకుమార్, వైసిపి మహిళా నాయకురాలు మట్టా ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

రజకులపై వివక్ష

- 72 గంటల దీక్షలు ప్రారంభం
- రజకుల రక్షణకు చట్టం తేవాలి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు
- మండలిలో చర్చిస్తాం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు



రజకుల దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు



విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద మాట్లాడుతున్న పి.మధు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రజకుల సామాజిక రక్షణ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం చట్టం తేవాలని ఏపి రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. తామెదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను శనివారం చేపట్టింది. ఈ దీక్షలనుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు మాట్లాడుతూ దళితుల తర్వాత సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్నది రజకులేనన్నారు. రజక కుటుంబాల్లో పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, వీరి సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని తాను ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని తెలిపారు. దీక్షలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రారంభిస్తూ రజకుల సామాజిక రక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా అత్యాచార నిరోధక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జిల్లాల్లో రజకులపై దాడులు, గ్రామ బహిష్కరణలు జరిగాయన్నారు. ఈ దారుణాలకు పాల్పడిన పెత్తందార్లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రజకులకు రూ 70 కోట్లు కేటాయించారని, అది వారి సంక్షేమానికి సరిపోదని తెలిపారు. గతేడాది కేటాయించిన రూ 52 కోట్లు వారి సంక్షేమానికి పూర్తిగా వెచ్చించలేదన్నారు. పంచాయతీలు ఆక్రమించుకున్న రజక చెరువులను తిరిగి వారికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, దోబీ ఘాట్‌లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. వారు చేసే శ్రమ ఆధారంగా యాభై ఏళ్లకు పైబడిన రజకులకు సామాజిక పెన్షన్లు ఇవ్వాలన్నారు. వారి ఆందోళనకు మద్దతు తెలుపుతూ, సమస్యలను మండలిలో ప్రస్తావిస్తామన్నారు. రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్. భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న యాభై శాతం సబ్సిడీ సరిపోదని, 90 శాతం సబ్సిడీ రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సామాజిక వర్గంలో దాదాపు ఐదు శాతం మంది నిరుద్యోగ యువత ఉన్నారని వారికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులపై జరిగిన దాడుల కు ప్రభుత్వం స్పందించాలన్నారు. రజకుల సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో వెచ్చించాలని డిమాండ్ చేశారు. రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి గురుశేఖర్ సహా మరో పది మంది సభ్యులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

13న ఎస్‌ఎస్‌ఎ కాంట్రాక్టు ఉద్యోగుల చలో విజయవాడ

సంఘం జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సర్వశిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఎ) కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆ సంఘం జెఎసి ఆధ్వర్యంలో 12 చేపట్టే మహాధర్నాలో భాగంగా 13న చలో విజయవాడ చేపడుతున్నట్లు ఎస్‌ఎస్‌ఎ కాంట్రాక్టు ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతారావు తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎస్‌ఎ కాంట్రాక్టు ఉద్యోగులకు ఇపిఎఫ్, ఇఎస్‌ఐ, ఆటోమేటిక్ రెన్యువల్ విధానం అమలు, అవుట్‌సోర్సింగ్ విధానం రద్దు తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి లెనిన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలన్నారు.



సర్వేను అడ్డుకున్న దళిత రైతులు

దళితుల భూములు లాక్కోడానికి అధికారుల యత్నం

చనుపల్లివారిగూడెం పేదల్లో అలజడి

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

కృష్ణాజిల్లా చనుపల్లివారిగూడెంలో దళితులు సాగు చేసుకుంటున్న భూములు బలవంతంగా లాక్కోడానికి ప్రభుత్వం కాలుదువ్వుతోంది. రెవెన్యూ అధికారులను శనివారం రంగంలోకి దింపింది. దళితులంటే వారికి చులకనగా ఉంది. భూముల్లోకి వెళ్లి గొలుసు తీశారు. ఇది గమనించిన రైతులు అడిగితే..ఇది మాభూమి..మీకెవ్వరికీ సమాధానం చెప్పాల్సిన పని లేదన్నారు. అంతే కాకుండా ఇది సూరంపల్లి పరిధిలోని భూములంటూ ఓవర్ యాక్షన్ చేశారు. దీంతో దళిత రైతులు ఆగ్రహించారు. వందలాది మంది భూముల్లోకి వచ్చి అధికారులను అడ్డుకున్నారు. భూములు లాక్కుంటే మేమేం కావాలని నిలదీశారు. సర్వే చేయడానికి వీల్లేదనీ, తక్షణమే భూముల్లోనుంచి వెళ్లి పోవాలనీ ఆందోళనకు దిగారు. తహశీల్దార్ పోలీసులను పంపడంతో అక్కడ ఆలజడి చోటుచేసుకుంది. కార్పొరేట్ సంస్థల కోసం తమ బతుకులు నాశనం చేయొద్దని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గజగంటి బాబూరావు, పులపాక వరాలు, బుద్దాల సుజానమ్మ, ఎంపిటిసి సభ్యులు బెజవాడ తాతబ్బాయి, సాగుదార్లు, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ రెప్స్ భవననిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

కర్నూలు ఇందిరాగాంధీ నగర్ సమీపంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటీవ్ యూనియన్ (ఎపిఎంఎస్‌ఆర్‌యు) కర్నూలు శాఖ భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఎపిఎంఎస్‌ఆర్‌యు యూనియన్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా కర్నూలు మెరిడియన్ ఫంక్షన్‌హాలులో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, ఎఫ్‌ఎంఆర్‌ఎఐ అధ్యక్షులు ఆర్.విశ్వనాథన్, విజయలక్ష్మి నర్సింగ్‌హోమ్ అధినేత (ఆదోని) డాక్టర్ యిస్కాల గంగాధర్‌రావులు స్వర్ణోత్సవ భవన నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్నారు. సిఐటియు నాయకులు ఎజె.రాజ్‌మోహన్, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌చ, ప్రసాద్‌శర్మ, వెంకట్, కర్నూలు శాఖ షేక్షావలి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పనివార్లకు గుర్తింపు ఇవ్వాల్సిందే : సిఐటియు

ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణా)

ఇళ్ళల్లో పని చేసేవారిని ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని, వారికి కనీస సౌకర్యాలను కల్పించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి డిమాండ్ చేశారు. శనివారం కృష్ణాజిల్లా గుడివాడలో స్నేహ పనివారల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని సెక్రటేరియట్‌లో పనిచేసే ఇంటి పనివార్లకు వారంలో రెండు రోజులు సెలవు ఇస్తున్నారన్నారు. ఇళ్ళలో పని చేసేవారు సంఘంగా ఏర్పడాలని, ఇళ్ళలో నమ్మకంగా పని చేసినప్పటికీ చేయని తప్పుకు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారన్నారు.

ప్రత్యేక హోదా కోరుతూ జీపుజాతాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎపికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ తదితర డిమాండ్ల సాధనకు రాయలసీమలోనూ, ప్రత్యేక హోదా, గిరిజన సమస్యల పరిష్కారం కోసం విజయనగరం జిల్లాలోనూ జీపుజాతాలు శనివారం నిర్వహించారు. పేద, మధ్యతరగతి, ఉద్యోగ కార్మిక వర్గాలు జాతాకు మద్దతుగా పాల్గొంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. కర్నూలు జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కర్నూలు జిల్లాలో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతా మూడోరోజు ఆదోని, ఆలూరు, చిప్పగిరి మండలాల్లో కొనసాగింది. జీపుజాతాలో సిపిఎం రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ ఓబులు పాల్గొని మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో చేపట్టిన సిపిఎం జీపు జాతా తొమ్మిది మండలాల్లో పర్యటించింది. జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య ఆధ్వర్యంలో సాగిన ఈ యాత్రకు విశేష స్పందన లభించింది. పుంగనూరులో ఉద్యోగులు, జెఎసి నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిపిఎం తిరుపతి జిల్లాలో జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య సారథ్యంలో జీపుజాతా రెండో రోజు పుత్తూరులో ప్రారంభమై నేంద్రగుంటలో రాత్రి 10 గంటలకు ముగిసింది. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందంటూ చిత్తూరు ఎంపి శివప్రసాద్ డప్పుకొడుతూ, కుంభబూర ఊదుతూ శనివారం చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు.

గిరిజన సమస్యల పరిష్కారం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల జెఎసి చేపట్టిన జీపు జాతా మూడోరోజు విజయనగరం జిల్లా సాలూరు, పాచిపెంట, గంట్యాడ మండలం బుడతనాపల్లి, ఎస్.కోట మండలాల్లో సాగింది. ఎపి గిరిజన సంఘాల జెఎసి జిల్లా చైర్మన్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, జిల్లాలో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటుకు వెంటనే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

విగ్రహాల కూల్చివేతపై పలు సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

అంబేద్కర్, లెనిన్ విగ్రహాల కూల్చివేతకు నిరసనగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో నాస్థిక సమాజం, అభ్యుదయ ప్రగతిశీల సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతుగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ యుపిలో అంబేద్కర్, తమిళనాడులో పెరియార్ రామస్వామి, త్రిపురలో లెనిన్ విగ్రహాలను కూల్చివేసి మత విద్వేషాలను రెచ్చగొట్టడం బిజెపికి తగదన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి దేశవ్యాప్తంగా దళిత, గిరిజనులపై దాడులకు తెగబడుతోందని తెలిపారు. ఈ సంఘటనల్లో పలువురు ప్రాణాలు సైతం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఓబులేశుమాట్లాడుతూ సంఘవిద్రోహ శక్తులను, ఆర్థిక దోపిడీ దారులను వదిలేసి అణగారిన వర్గాలకు చెందిన వారిపై పైశాచికం ఎందుకని ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ బృందాలను అదుపు చేయలేని ప్రభుత్వం ప్రజలకు ఏవిధంగా రక్షణ కల్పిస్తుందో చెప్పాలన్నారు.

జనం మనిషి కృష్ణకుమారి

- సంతాప సభలో వక్తలు
- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

సిపిఎం తొలి తరం నాయకురాలు, జిఎస్ బాలాజీదాస్ సతీమణి జి.కృష్ణకుమారి(84) జనం మనిషి అని, ఆమె నిజాయితీ, అంకితభావం అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంపి, తన అల్లుడు డాక్టర్ మిడియం బాబూరావు ఇంట్లో శుక్రవారం సాయంత్రం కృష్ణకుమారి తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం ఆమె భౌతికకాయాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గుడా చైర్మన్ గన్ని కృష్ణ, డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, సిసిసి ఎమ్‌డి పంతం కొండలరావు, మాజీ ఎంపి జివి హర్షకుమార్ తదితరులు సందర్శించి, నివాళు లర్పించారు. అనంతరం గూడ్స్‌గేటు వద్ద ఉన్న రోటరీ కైలాస భూమిలో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు అంత్య క్రియలు నిర్వహించారు. సంతాప సభకు సిపిఎం రాజ మహేంద్రవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టిఎస్.ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ జిఎస్ బాలాజీదాస్, కృష్ణకుమారితో ఉన్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ సిద్ధాంతాల విషయంలో రాజీ పడేవారు కాదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ కృష్ణకుమారి ఉద్యమ స్ఫూర్తిని అంతా అనుసరించాలని, నేటితరం మహిళా నాయకత్వం అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రజాశక్తి జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ గడ్డన్న మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జరిగిన ప్రజా ఉద్యమాలకు ఆమె దిక్సూచి అన్నారు. సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆనాటి రోజుల్లో ధైర్యంగా ఉద్యమాలను నడిపిన బాలాజీదాస్, ఆయన సతీమణి కృష్ణకుమారి స్ఫూర్తి నేటి తరానికి అవసరమన్నారు. సభాధ్యక్షుడు టిఎస్.ప్రకాష్ మాట్లాడుతూ పెళ్లయిన రోజునే తన భర్త బాలాజీదాస్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినప్పటికీ భర్త అడుగుజాడల్లో నడిచిన కృష్ణకుమారి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ కన్పిస్తే కాల్చివేత ఉన్న రోజుల్లో కృష్ణకుమారి ధైర్యంగా పోరాటాలు నడిపారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్‌ఎస్ మూర్తి, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు పుల్లయ్య, సిపిఎం చింతూరు నాయకులు తిలక్, రాజమహేంద్రవరం కార్యదర్శి పోలిన వెంకటేశ్వరరావు, సిపిఐ మహిళా నాయకురాలు యడ్ల లక్ష్మి, సిపిఐ (ఎంఎల్-న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రమణ, కృష్ణకుమారి కుటుంబ సభ్యుడు కొల్లారెడ్డి కుదీరామ్‌జోస్ ప్రసంగించారు. బేబిరాణి, ఎన్.భీమేశ్వర రావు, పార్టీ కార్యకర్తలు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



కృష్ణకుమారి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ బుచ్చియ్యచౌదరి, చిత్రంలో మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు తదితరులు




తుందుర్రులో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు, మహిళలు

ప్రజలపై పోలీసుల దౌర్జన్యం దారుణం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో నిర్మిస్తున్న ఆక్వాఫుడ్ పార్కుకు విద్యుత్ లైన్ పేరుతో ప్రజలకు చెందిన చెట్లను నరకడం, ఇదేమిటని అడిగిన వారిపై పోలీసులు దౌర్జన్యం చేయడం దారుణమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. పోలీసుల బెదిరింపులకు గురైన బాధిత ప్రజలను సిపిఎం బృందం శనివారం పరామర్శించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయాలని, ప్రజలపై దౌర్జన్యం చేసిన పోలీసులు, విద్యుత్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్వా ఫుడ్‌పార్క్‌కు కరెంట్ ఇవ్వడం కోసం ప్రజలను బెదిరించడం శోచనీయమన్నారు. చెట్లను తొలగించి పర్యావరణాన్ని నాశనం చేయొద్దని కోరిన మహిళలపై దౌర్జన్యం చేసిన పోలీసులు, విద్యుత్ అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



విశాఖలో చెవిలో పువ్వు పెట్టుకొని వినూత్న నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

జూనియర్ డాక్టర్ల వినూత్న నిరసన

ప్రజాశక్తి-తూర్పుగోదావరి/విశాఖసిటీ

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. కెజిహెచ్‌లోని భావనగర్ వార్డు, రాజేంద్రప్రసాద్, ఆర్థో, మెడాల్ వార్డుల మీదుగా గైనిక్ వార్డు వరకు మానవహారం నిర్వహించారు. శనివారం ఎఎంసి సందర్శనకు వచ్చిన డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ సుబ్బారావు జూడాల సమ్మె ప్రభావంపై ఆరా తీశారు. ఎఎంసి కాలేజీ ప్రిన్సిపల్ పివి సుధాకర్ సెలవులో ఉండటంతో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయరాజ్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, ధర్మారావు తదితరులతో చర్చలు జరిపారు. జూనియర్ డాక్టర్ల ప్రతినిధులను చర్చలకు రావాలని పిలిచారు. తాము అక్కడికి వచ్చేది లేదని డిఎంఇ నిరసన శిబిరం వద్దకు రావాలని పట్టుబట్టారు. తూర్పుగోదావరి జిల్లాలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె శనివారం నాటికి రెండోరోజుకు చేరింది.

ప్రజ్ఞ

జవాబులు

1. విప్లవ్ కుమార్ దేవ్, 2. సురేశ్ ప్రభు
3. విరాట్ కోహ్లీ, 4. పరాగ్ అగర్వాల్
5. అంజుమ్ మౌద్గిల్

సదస్సు

మీడియా నియంత్రణ కమిటీ వేయాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సదస్సులో మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-భీమవరం రూరల్(పశ్చిమగోదావరి)

మీడియా నియంత్రణ కోసం కమిటీ వేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలుత యుటిఎఫ్ కార్యాలయం నుంచి పిఎస్‌ఎం బాలికల ఉన్నత పాఠశాల వరకూ మహిళా టీచర్లు శనివారం ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని పొట్టిశ్రీరాములు స్మారక బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో 'మహిళా సాధికారత-ఉద్యమాల్లో మహిళల పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సులో రమాదేవి మాట్లాడారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని, ఎన్ని మహిళా దినోత్సవాలు జరుపుకున్నప్పటికీ మహిళా సాధికారతలో వెనుకబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళా సాధికారత సాధన కోసం మహిళలు ఉద్యమాల్లో పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజంలో సృష్టించబడుతున్న సంపదలో 60 శాతం మహిళలు సాధిస్తుంటే 18 శాతమే వేతనాలుగా పొందుతున్నారన్నారు. ఈ అసమానతలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలన్నారు. మహిళల పట్ల చూపుతున్న వివక్ష, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ మాట్లాడుతూ మహిళా టీచర్లు ఉద్యమాల్లో పెద్దసంఖ్యలో పాల్గొనకుండా ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని కాపాడుకోలేమన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి.కనకదుర్గ మాట్లాడారు. యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన మహిళా టీచర్ల చైతన్య సదస్సుకు బి.సూర్యావతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.జయప్రభ, జిల్లా అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి, జిల్లా సహాధ్యక్షురాలు కె.హరిప్రియ, జిల్లా కార్యదర్శి కె.శిరీష పాల్గొన్నారు.

సంక్షిప్తం

పార్లమెంటులో గిరిజన వర్సిటీ బిల్లు పెట్టాల్సిందే

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి డిమాండ్

ప్రజాశక్తి - శంగవరపుకోట (విజయనగరం)

జిల్లాలోని గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు వెంటనే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని ఎపి గిరిజన సంఘాల జెఎసి జిల్లా చైర్మన్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. గిరిజన సమస్యలు పరిష్కారం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల జెఎసి చేపట్టిన జీపుజాతా మూడోరోజైన శనివారం విజయనగరం జిల్లా సాలూరు, పాచిపెంట, గంట్యాడ మండలం బుడతనాపల్లి, ఎస్.కోట మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా కోలక మాట్లాడుతూ.. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసి వారి భాషలోనే విద్యాబోధన చేయడం ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చవద్దని డిమాండ్ చేశారు.

త్రిపురలో బిజెపి దాడులపై ఫోటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-బొబ్బిలి (విజయనగరం)

త్రిపుర రాష్ట్రంలో బిజెపి ఆకృత్యాలను ప్రజలకు వివరించేందుకు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన విజయనగరం జిల్లా బొబ్బిలిలోని తాండ్రాపాపారాయ కూడలి వద్ద శనివారం ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. రాజాకళాశాల అధ్యాపకులు కె.చిరంజీవి, రిటైర్డు తహశీల్దార్ విజయ్‌కుమార్ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. త్రిపురలో బిజెపి అధికారంలోకొచ్చిన తరువాత సిపిఎం కార్యాలయాలపైనా, కార్యకర్తలు, నాయకులపైనా చేసిన దాడుల చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డివేణు, సిపిఐ న్యూడెమోక్రసీ నాయకులు బి.శ్రీను తదితరులు మాట్లాడారు. దేశంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఈ చర్యలను ఖండించాలని కోరారు.

చారిలాం ఎన్నికకు సిపిఎం దూరం

అగర్తలా : త్రిపురలో అధికారం పార్టీ బిజెపి చేస్తున్న హింసాకాండ వల్ల చారిలాం నియోజకవర్గ ఎన్నిక నుండి ఉపసంహరించుకోవాలని సిపిఎం శనివారం నిర్ణయించుకొంది. ఫిబ్రవరి 11న ఎన్నికల ప్రచారం చేస్తుండగా గుండెపోటుతో సిపిఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దెబ్ బర్మన్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీనితో చారిలాం నియోజకవర్గానికి మార్చి 12కు ఎన్నిక వాయిదా వేశారు. సిపిఎం ప్రతినిధి గౌతం దాస్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హింసాకాండ జరుగుతున్న ప్రాంతాలను జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సందర్శించారు.



పరిశీలన।
త్రిపురలో బిజెపి గూండాలు జరిపిన దాడుల్లో ధ్వంసమైన పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

జెఎన్‌యు ప్రకటనకు ఖండన

మేం సంతకాలు పెట్టలేదు : శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ: అటెండెన్స్ తప్పనిసరిచేస్తూ జవహర్‌లాల్ యూనివర్సిటీ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై విద్యార్థులు చేస్తున్న ఆందోళనను తప్పుపడుతూ ఆ కళాశాల యాజమాన్యం విడుదల చేసిన ప్రకటనపై తాము సంతకాలు పెట్టినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఖండించారు. ఆ స్టేట్‌మెంట్‌పై తాము సంతకం పెట్టలేదని ముగ్గురు శాస్త్రవేత్తలు, ఒక విద్యావేత్త ప్రకటించారు. జేఎన్‌యూ విడుదల చేసిన ఆ ప్రకటనపై తాము సంతకాలు పెట్టలేదని గ్రీన్ రివల్యూషన్ మార్గదర్శిగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ జన్యుశాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, అణుశాస్త్రవేత్త అనిల్ కకోడ్కర్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ గోవర్ధన్ మెహత, ఢిల్లీ మెట్రో మేనేజింగ్ మాజీ డైరెక్టర్ ఇ శ్రీధరన్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ కె జి సురేష్‌లు స్పష్టం చేశారు. 'ఆ ప్రకటన గురించి నేను వినడం ఇదే మొదటిసారి. నన్ను ఎవరూ సంప్రదించలేదు. అది విపరీతమైనది' అని స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కాగా, దానిపై సంతకం పెట్టింది ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన విజ్ఞాన భారతి ఫ్రంట్ అని, దానికి తాను ప్యాట్రన్‌గా ఉన్నను తప్ప తాను సంతకం చేయలేదని ఇస్రో మాజీ చైర్‌పర్సన్ జి మాధవన్ నాయర్ తెలిపారు. అలాంటి ఏ ప్రకటనపై తాను సంతకం చేయలేదని కక్కోడ్కర్ కూడా స్పష్టం చేశారు. 'జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్ నుంచి తనకు ఒక ఈ-మెయిల్ వచ్చింది. అయితే నేను దానికి ఎలాంటి స్పందనా ఇవ్వలేదు' అని మెహతా తెలిపారు.

ఆ స్టేట్‌మెంట్‌లో ఏముంది?

'క్లాసులకు హాజరుకావాలన్న కనీస అర్హతకు వ్యతిరేకంగా కొందరు విద్యార్థులు చేస్తున్న ప్రచారాన్ని మేం ఖండిస్తున్నాం. ప్రస్తుత నాయకత్వంలో ప్రస్తుత విద్యా సంవత్సరం త్వరగా పునరుద్ధరణ జరుగుతుందని మేం ఆశిస్తున్నాం' అని ప్రముఖులతో పేర్లతో జేఎన్‌యూ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేసింది.

మళ్ళీ రజనీ హిమాలయాల 'బాట'



చెన్నై : రాజకీయ వేత్తగా మారిన సూపర్ స్టార్ రజనీకాంత్ శనివారం హిమాలయాల యాత్రకు వెళ్ళారు. దశాబ్దకాలంగా ప్రతి సంవత్సరం ఆయన హిమాలయాలకు వెళ్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని డునగిరి గుహలకుచేరకుని అక్కడ ధ్యానం చేసుకుంటూ సాధువులతో గడుపుతారు. రజనీకాంత్ అంతకుముందు జరిపిన హిమాలయాల యాత్రలన్నీ ఆయన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలతో ముడిపడి ఉన్నాయి. ఆయన ప్రస్తుతం రాజకీయ రంగంలోకి అడుగిడుతున్న తరుణంలో హిమాలయాలు సందర్శించడం విశేషం. అంతేకాకుండా కాలా, 2.0 అనే రెండు పెద్ద సినిమాలు విడుదల కాబోతున్నాయి. ఈ సందర్భంగా చెన్నై విమానాశ్రయం వద్ద రజనీకాంత్ మాట్లాడుతూ తన పర్యటన ఉద్దేశాలను అభిమానులకు వెల్లడించక పోయినప్ప టికీ రెండు వారాల పాటు హిమాలయాలలో గడపనున్నట్లు చెప్పారు.

ప్రాంతీయ పార్టీల్లో సమాజ్‌వాది 'వెరీ రిచ్'

న్యూఢిల్లీ : దేశంలో ఉన్న 22 ప్రాంతీయ పార్టీలో అత్యంత ఆస్తులున్న పార్టీగా సమాజ్‌వాది పార్టీ(ఎస్‌పి) నిలిచింది. ఢిల్లీ చెందిన ద అసోసియేషన్ డెమొక్రటిక్ రీఫాం (ఎడిఆర్) నివేదికల ప్రకారం అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్‌పి 2015-16లో అత్యంత సంపన్న పార్టీగా రూ.634. 96కోట్ల ఆస్తులతో, మొదటి స్థానంలో ఉంది. కాగా, 2011-12లో ఎస్‌పి రూ.212.86 కోట్లను ప్రకటించిన సంఖ్యతో పోల్చుకుంటే ఆస్తుల విలువ 198 శాతం పెరిగాయి. రెండో స్థానంలో తమిళనాడుకు చెందిన అన్నాడిఎంకె నిలువగా, తెలుగు రాష్ట్రాలకు చెందిన తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్) పార్టీలు తాము అప్పుల్లో వున్నామని ప్రకటించడం విశేషం.

2011-12లో రూ.88.21 కోట్లుగా ఉన్న అన్నాడిఎంకె ఆస్తుల విలువ 2015-16 నాటికి 155 శాతం పెరిగి రూ.224.87 కోట్లకు చేరుకుంది. ఈ నివేదిక 2011-12, 2015-16 సంవత్సరాల మధ్య ప్రాంతీయ పార్టీల ఆస్తులు, అప్పులను విశ్లేషించి, భారత ఎన్నికల కమీషన్‌కు, ఆదాయ పన్ను శాఖకు సమర్పించిన ఆడిట్ ఖాతాలపై ఆధారపడి ఉంటుంది. స్థిరాస్తులు, లోన్లు, అడ్వాన్స్, డిపాజిట్లు, టిడిఎస్(టాక్స్ డిడెక్టడ్ ఎట్ సోర్స్), పెట్టుబడులు, ఇతర ఆస్తులను పార్టీలు ప్రకటించిన ఆధారంగా నివేదిక రూపొందింది.

వాణిజ్య సంస్థల 'సీజ్'పై మోడీ, రాహుల్‌లకు కేజ్రీవాల్ లేఖ



న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాణిజ్య సంస్థలను 'సీజ్' చేయడంపై తలెత్తిన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నడుం కట్టారు. ఈ అంశంపై చర్చించేందుకు తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలకు శనివారం లేఖ రాశారు. ఈ నెలాఖరుకు ఈ సమస్యను పరిష్కరించక పోతే నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించిన ఒక రోజు అనంతరం కేజ్రీవాల్ ఈ లేఖలు వ్రాశారు. దీనికి సంబంధించి పార్లమెంట్‌లో బిల్లు తీసుకురావలసిన అవసరమున్నదని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన చట్టపరమైన అంశాల్లో వెసులుబాటు కల్పించాలని, దుకాణాల మూసివేత కారణంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుందని, ఇది శాంతి భద్రతలపై కూడా ప్రభావం చూపుతుందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన అవసరముందని, బిల్లు తీసుకు వచ్చేలా కేంద్రం పై ఒత్తిడి తీసుకు రావాలని రాహుల్‌కు రాసిన లేఖలో కోరారు.

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు : మమత



కోల్‌కతా : రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఈమేరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 23న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. సింఘ్వీ అభ్యంత్వాన్ని కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించలేదు. అయినా సోనియా గాంధీ రాజ్యసభ స్థానానికి సింఘ్వీని నామినేట్ చేస్తారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ చౌదరి తెలిపారు. కోల్‌కతాలో నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో మమతా బెనర్జీ ఈ విషయమై మాట్లాడుతూ ఒక మంచి కారణంతోనే తామీరోజు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పలు సందర్భాలలో సింఘ్వీ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించారని ఆమె చెప్పారు. ఇప్పుడు గూర్ఖా జనముక్తి మోర్చా అధ్యక్షుడు బిమల్ గురంగ్ బహిష్కరణకు గురైన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున సింఘ్వీ ప్రాతినిధ్యం వహిస్తారని మమత తెలిపారు. సింఘ్వీ, కపిల్ సిబల్‌లు సాధారణంగా రాష్ట్రం తరుపున పలు కేసులపై పోరాడుతుంటారని చెప్పారు. అందువల్లే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలన్నారు.

రాజ్యాంగపరమైన అంశాలకు న్యాయమూర్తులను దూరంగా ఉంచడం విచిత్రం

జస్టిస్ షా

న్యూఢిల్లీ : సుప్రీం కోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులను రాజ్యాంగపరమైన అన్ని అంశాలకు, కీలకమైన కేసుల విచారణకు దూరంగా ఉంచడం విచిత్రంగా ఉన్నదని ఢిల్లీ హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎపి షా అన్నారు. బి.జి .వర్గీస్ స్మారకోపన్యాసం చేస్తున్న సందర్భంలో న్యాయవ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. న్యాయమూర్తులకు కేసులు కేటాయించడంలో సీనియార్టీకి ప్రాధాన్యత ఉన్నదన్నారు. సుప్రీంకోర్టులో కేసుల కేటాయింపులను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా బహిర్గతం చేయడంపై షా మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో ఇలా జరగడం ఇదే తొలిసారి అన్నారు. జస్టిస్ మిశ్రా తరువాత సీనియర్లుగా ఉన్న నలుగురు న్యాయమూర్తులు ఆయనను బహిరంగంగా విమర్శించిన సందర్భంలో కేసుల కేటాయింపును బహిర్గతం చేశారు. న్యాయమూర్తులు జాస్తి చలమేశ్వర్, రంజన్ గొగొయ్, ఎంబి లోకూర్, కురియన్ జోసఫ్‌లు జనవరి 12న నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాధాన్యత గల కేసులను ప్రధాన న్యాయమూర్తి కేటాయించే తీరును విమర్శించారు. "కేసుల కేటాయింపును పరిశీలిస్తే అది అయోధ్య కేసు కావచ్చు, ఆధార్, భూ సేకరణ వివాదం తదితర ప్రాధాన్యత గల కేసుల విచారణ నుంచి నలుగురు న్యాయమూర్తులను దూరంగా ఉంచారని స్పష్టమౌతున్నది. సీనియార్టీనే అత్యంత ప్రాధాన్యత గల విషయమన్నది వాస్తవం కానప్పటికీ, సీనియార్టీకి కూడా ప్రాధాన్యత ఉంటుంది." అని జస్టిస్ షా అన్నారు. సుప్రీం కోర్టులోని తొలి ఐదు స్థానాల్లో ఉన్న సీనియర్ న్యాయమూర్తులను రాజ్యాంగపరమైన అంశాల విచారణ నుంచి దూరంగా ఉంచడం విచిత్రమైన విషయమని, ఇది ప్రశ్నించదగిన అంశమని జస్టిస్ షా తెలిపారు.

భారత్-ఫ్రాన్స్‌ల మధ్య

14 కీలక ఒప్పందాలు

- నాలుగు రోజుల పర్యటనకు విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్
- మోడీతో విస్తృత చర్చలు
- భద్రత, రక్షణ రంగాలలో ఇరు దేశాల మధ్య విస్తృత సహకారం



న్యూఢిల్లీ : వివిధ రంగాలకు సంబంధించిన దాదాపు 16 బిలియన్ డాలర్ల విలువైన 14 కీలక ఒప్పందాలపై భారత్, ఫ్రాన్స్‌లు శనివారం సంతకాలు చేశాయి. భద్రత, అణు ఇంధనం, రహస్య సమాచార రక్షణ తదితర వ్యూహాత్మక రంగాలలో రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. విద్య, పర్యావరణం, పట్టణాభివృద్ధి, రైల్వేలు తదితర రంగాలకు సంబంధించి ఒప్పందాలు కూడా ఇందులో ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఫ్రాన్సు అధ్యక్షుడు ఎమ్మాన్యుల్ మాక్రాన్‌ల మధ్య శనివారం న్యూఢిల్లీలో విస్తృత ద్వైపాక్షిక చర్చలు జరిగిన అనంతరం ఉమ్మడిగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మోడీ ప్రసంగిస్తూ, రక్షణ, భద్రత రంగాలలో రెండు దేశాలు పటిష్టమైన సహకారాన్ని కలిగి ఉన్నాయన్నారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం రెండేళ్ళుగా కొనసాగుతున్నదన్నారు. సాంస్కృతిక భాగస్వామ్యం దీనికన్నా ముందు నుంచి కొనసాగుతున్నదన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం తదితర విలువలు ఫ్రాన్సులోనే కాదు భారత రాజ్యాంగంలో కూడా పొందుపరచ బడ్డాయన్నారు.

మాక్రాన్ మాట్లాడుతూ ఉగ్రవాదం, తీవ్రవాదాల ముప్పు ఎదుర్కొనేందుకు కలిసి పనిచేయాలని భారత్, ఫ్రాన్స్ నిర్ణయం తీసుకున్నాయన్నారు. రెండు దేశాల మధ్య రక్షణ సహకారం ఇప్పుడు కొత్త ప్రాధాన్యతను సంతరించుకున్నదని ఆయన చెప్పారు. "ఇక్కడ భారత్ మా తొలి వ్యూహాత్మక భాగస్వామి కావాలనుకుంటున్నాం. యూరప్‌లోనే కాకుండా ప్రపంచంలోనే భారత్‌కు తొలి వ్యూహాత్మక భాగస్వామిగా మేము ఉండాలనుకుంటున్నాం" అని మాక్రాన్ అన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంత సహకారంపై కూడా ఇద్దరు నేతలు మాట్లాడారు.

ఫ్రాన్సు అధ్యక్షుడు ఎమ్మాన్యుల్ మాక్రాన్ శుక్రవారం సాయంత్రం భారత్ చేరుకున్నారు. ఆయన నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఢిల్లీ విమానాశ్రయం వద్ద మాక్రాన్‌కు ఘన స్వాగతం పలికారు. మాక్రాన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో అత్యధిక సమయం గడపనున్నారని ఫ్రాన్స్‌లోని అధ్యక్ష కార్యాలయ వర్గాలు తెలిపాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే విషయమై మోడీతో చర్చించారు. మాక్రాన్ వెంట ఆయన భార్య బ్రిగిట్టె మారీ క్లాడ్‌మా క్రాన్, వ్యాపార ప్రముఖులు, ఉన్నతాధికారులు భారత్ పర్యటనకు వచ్చారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక, రాజకీయ రంగాలలో సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో మాక్రాన్ భారత్ పర్యటన సాగనున్నదని విదేశాంగ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఒక ప్రకటన పేర్కొంది.ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఆయన భార్య బ్రిగిట్టే మారీకి శనివారం ఉదయం రాష్ట్రపతి భవన్ వద్ద హార్దిక స్వాగతం లభించింది. రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వాగతం పలికారు. తొలుత మాక్రాన్ ఆయన భార్యతో కలిసిరాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీ స్మారకంపై పుష్పగుచ్ఛానుంచి ఆయనకు నివాళులు అర్పించారు. ఆ తరువాత ఉదయం 10 గంటల సమయంలో విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ అలియన్స్ ఫ్రాంకైజ్ వద్ద మాక్రాన్‌ను కలుసుకున్నారు. హైదరాబాద్ భవన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఎమ్మాన్యుల్ మాక్రాన్‌లు భేటీ అయ్యారు మాక్రాన్ భారత్‌లో పర్యటించే నాలుగు రోజులు పలుకార్యక్రమాలలో నిర్విరామంగా పాల్గొననున్నారు.

ఆ న్యాయమూర్తులుంటే

నిష్పాక్షిక విచారణ కష్టమే

- లోయా కేసులో వారు తప్పుకోవాలని ప్రశాంత్ భూషణ్ సూచన

న్యూఢిల్లీ : లోయా మరణించినపుడు సాక్షులుగా వున్న ఇద్దరు న్యాయమూర్తులతో ప్రస్తుతం విచారణ జరుపుతున్న ధర్మాసనంలో వున్న సభ్యులకు సంబంధాలు వున్నందున ఈ కేసు విచారణ నిష్పక్షపాతంగా జరిగే అవకాశాలు అనుమానాస్పదమని పేర్కొంటూ వారు బెంచ్ నుండి తప్పుకునే విషయాన్ని పరిశీలించాలని సిపిఐఎల్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సూచించారు. అంత మాత్రాన బెంచ్‌లోని న్యాయమూర్తులను అవమానించాలని తాననుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సభ్యులుగా వున్నారు. వీరు బాంబే హైకోర్టులో పనిచేశారు. అయితే లోయాను నాగ్‌పూర్‌లోని మెడిట్రినా ఆస్పత్రికి తీసుకెళ్ళినపుడు జస్టిస్ భూషణ్ గవాయ్, జస్టిస్ సునీల్ సూక్రేలు అక్కడకు వెళ్ళారు. 2014 డిసెంబరు 1 తెల్లవారు జామున లోయా మరణించినట్లు వారు ప్రకటించారు. కాగా, భూషణ్ చేసిన సూచనకు జస్టిస్ ఖన్విల్కర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూషణ్ సూచనలను సమర్ధించినట్లైతే ఇక హైకోర్టు న్యాయమూర్తులెవరూ కూడా ఈ కేసును విచారించకూడదని వ్యాఖ్యానించారు. ముందుగా బాంబే లాయర్స్ అసోసియేషనే లోయా మృతిపై పిటిషన్ దాఖలు చేసిందని ఆయన గుర్తు చేశారు. భూషణ్ సూచనలను జస్టిస్ చంద్రచూడ్ కూడా సవాలు చేశారు. అభ్యంతరాలను నేరుగా ప్రస్తావించాలని, అప్పుడే బెంచ్ వాటికి సమాధానం చెప్పగలుగుతుందని అన్నారు. లోయా గుండెపోటుతో మరణించాడనే అభిప్రాయాన్ని నలుగురు న్యాయమూర్తులు ధృవీకరించడం లేదని, వారు కేవలం లోయా ఛాతీలో నొప్పితో బాధపడ్డారని మాత్రమే చెబుతున్నారని, అది కూడా ఆయనకు తీసిన ఇసిజి నివేదికను బట్టి తెలుస్తోందని భూషణ్ పేర్కొన్నారు. ఆయనపై విష ప్రయోగం జరిగి వుండవచ్చునని, దానివల్ల ఆయనకు ఛాతీలో నొప్పి వచ్చి వుండవచ్చునని భావిస్తున్నారు.



గుండెపోటుతో మరణించలేదు?

లోయా మృతిపై అత్యంత ఉన్నత స్థాయి బృందంతో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపించాలని డిమాండ్ చేస్తూ సిపిఐఎల్ (సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్) సుప్రీంకోర్టులో ఇంటర్వెన్షన్ అప్లికేషన్‌ను దాఖలు చేసింది. ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణుల్లో ఒకరైన డాక్టర్ ఆర్.కె.శర్మ అభిప్రాయాన్ని ప్రచురించిన కారవాన్ మేగజైన్ నివేదికను ప్రస్తావిస్తూ సిపిఐఎల్ కార్యదర్శి న్యాయవాది కామిని జైస్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. లోయా పోస్టుమార్టం నివేదికను, సంబంధిత హిస్టోపాథాలజీ నివేదికను డాక్టర్ శర్మ పరిశీలించారని, లోయా గుండెపోటుతో మరణించే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారని కారవాన్ మేగజైన్ ప్రచురించింది. బహుశా లోయాకు విష ప్రయోగం జరిగి వుండవచ్చునని, దానితో ఆయన మెదడు కూడా దెబ్బతిన్న సూచనలు కనిపిస్తున్నాయని శర్మ అభిప్రాయపడ్డారని పేర్కొంది. ఈ నేపథ్యంలో లోయా ఇసిజి రిపోర్ట్, హిస్టోపాథాలజీ నివేదిక కాపీలను ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉపేంద్ర కౌల్‌కు సిపిఐఎల్ పంపింది. ఇసిజి తీయడానికి ఒకటి రెండు గంటలు ముందు ఈ వ్యక్తి (లోయా) తీవ్రమైన గుండెపోటుకు గురయ్యారా? తీవ్రమైన కరోనరీ థ్రాంబసిస్‌తో ఆయన మరణించారనడానికి అనుగుణంగానే హిస్టోపాథాలజీ నివేదిక వుందా? అంటూ కొన్ని ప్రశ్నలను సమాధానాలు కావాలని కోరింది. వాటికి డాక్టర్ ఉపేంద్ర కౌల్ ఇచ్చిన సమాధానాలు, లోయా గుండెపోటుతో మరణించారన్న అధికార కథనానికి పూర్తి విరుద్ధంగా వున్నాయి.

కోస్ట్ గార్డ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

నలుగురు సిబ్బందికి గాయాలు

ముంబయి : మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలోని మురుద్ ప్రాంతం నందగాన్ బీచ్‌కు సమీపంలో శనివారం ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన సిజి 808 హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ అయ్యింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో జనసాంద్రత లేని సముద్ర తీరంలో ల్యాండింగ్ చేశారని పబ్లిక్ రిలేషన్ అధికారి డిప్యూటీ కమాండెంట్ అవినాథన్ మిత్రా తెలిపారు. హెలికాప్టర్ కూలిపోయినట్లు మీడియాలో వస్తున్న వార్తలను ఆయన ఖండించారు.

నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పులు

శ్రీనగర్ : జమ్ము కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడివున్న పూంచ్‌సెక్టార్‌లో శనివారం ఉదయం పాకిస్తాన్ దళాలు పెద్ద ఎత్తున కాల్పులకు పాల్పడ్డాయని అధికారులు తెలిపారు. రక్షణ శాఖ వర్గాల ప్రకారం చిన్న ఆయుధాలు, ఆటోమేటిక్, మోర్టార్లతో పాకిస్తాన్ దళాలు మన్‌కోట్ ప్రాంతంలోని పౌరులను, రక్షణా సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని కాల్పులకు పాల్పడ్డాయని తెలిపారు. భద్రతా సిబ్బంది సమర్ధవంతంగా తిప్పికొట్టారని పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో గాయపడిన వారి గురించి మరిన్ని వివరాలు తెలియాల్సివుందని అధికారులు పేర్కొన్నారు.

కాలిఫోర్నియాలో కాల్పులు

నలుగురి మృతి


యూంట్‌విల్లే: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న అతిపెద్ద వృద్ధుల, వికలాంగుల కౌన్సిలింగ్ సెంటర్‌లో సాయుధుడైన ఒక దుండగుడు ముగ్గురు మహిళలను కాల్చి చంపాడు. పోలీసుల కాల్పుల్లో దుండగుడు కూడా చనిపోయాడు. తొలుత దుండగుడు ముగ్గురు వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకున్నట్టు తెలిసింది. పోలీసులకు, దుండగుడికి మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి. తర్వాత హోంలో పరిశీలించి చూడగా దుండగుడు సహా నలుగురు మరణించి కనిపించారు. అయితే వెటరన్స్ హోంలో ఉన్న ఆ ముగ్గురు మహిళలనే దుండగుడు ఎందుకు చంపాడనే విషయం తెలియరాలేదు. వారితో దుండగుడికి ఏదైనా సంబంధం ఉందా అనే విషయం స్పష్టం కాలేదు. దుండగుడి వివరాలను గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. చనిపోయిన ముగ్గురు మహిళలు వెటరన్స్ హోంలోని పాత్‌వే హోం ఉద్యోగులని గుర్తించారు. పలు యుద్ధాల్లో పాల్గొని మానసిక ఒత్తిడితో బాధపడుతున్న సైనికులకు పాత్‌వే హోంలో కౌన్సిలింగ్ ఇస్తారు. అమెరికాలోనే అతి పెద్ద వెటరన్స్ హోం ఇది. దీన్ని 1984లో ప్రారంభించారు. ఇందులో వృద్ధులు, వికలాంగులు దాదాపు వెయ్యి మంది ఉంటారని అక్కడి వెటరన్స్ అఫైర్స్ విభాగం వెల్లడించింది. రెండో ప్రపంచ యుద్ధం, కొరియా యుద్ధం, వియత్నాం యుద్ధం, ఇరాకీ ఆపరేషన్స్ తదితర వాటిల్లో పాల్గొన్న వారు ఈ వెటరన్స్ హోంలో ఉంటున్నారు. ఇందులో 1200 సీట్లతో థియేటర్, గోల్ఫ్ కోర్స్, బేస్‌బాల్ స్టేడియం, బౌలింగ్ లేన్స్, స్విమ్మింగ్ పూల్ తదితర ఎన్నో సదుపాయాలు ఉంటాయి.

ప్రత్యేకం

టీ తోటల్లో మరణాలపై

మెజిస్టీరియల్ విచారణ

న్యూఢిల్లీ : ఆకస్మిక అనారోగ్యాల కారణంగా నెల రోజుల వ్యవధిలో అస్సాంలోని గోలాఘాట్ జిల్లాలో టీ తోటలో పనిచేస్తున్న కుటుంబాల్లో 21 మంది మరణించారు. వీరిలో 18 నెలల చిన్నారి కూడా ఉన్నారు. వీరందరూ జిల్లాలోని టీ తోటల్లో పనిచేస్తూ డోయాంగ్ టీ ఎస్టేట్ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. అధిక మొత్తంలో మద్యం సేవిచడం వల్ల చనిపోయారని టీ తోటల అధికారులు స్థానిక మీడియాతో తెలిపారు. ఈ మరణాలపై విచారణ చేయాలని మెజిస్టీరియల్‌కు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. స్థానిక మీడియా నివేదికల ప్రకారం, ఫిబ్రవరి 3 నుండి ప్రారంభమైన మరణాలు మార్చి 6కి 21 కు చేరుకున్నాయి. ఆకస్మిక వాంతులు, అధిక రక్తపోటు, జ్వరం వంటి లక్షణాలతో వారు మృతి చెందారు. ఈ మరణాలతో భయానికి గురైన కార్మికులు గార్డెన్ దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేయించుకుంటున్నారు. ఇక్కడ ఆసుపత్రిలో సరైన సదుపాయాలు లేవనీ ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇక్కడికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోలాఘాట్ సివిల్ హాస్పిటల్‌కు వెళ్ళాల్సి వస్తుందని కార్మికులు ఆరోపించారు. రోగులను తోటయజమానులు గోలాఘాట్ ఆసుపత్రికి తరలించటానికి ఎటువంటి సహాయం అందించలేదని, మెరుగైన చికిత్స కోసం సరైన ఏర్పాట్లు చేయనందుకే వారు మరణించారని ఆరోపించారు. కార్మికుల మరణాన్ని సహజ మరణంగా చూపిస్తూ జిల్లా ఆరోగ్య శాఖ నివేదికలో పేర్కొనడం నిజాలను దాస్తోందని, ఒక నెలలో 21 మంది చనిపోవడం ఎలా సహజం అవుతుందని స్థానిక కార్మిక హక్కుల సంస్థ జీపుల్ కృషక్ శ్రామిక్ సంగ్ (జెకెఎస్-ఎస్) చెందిన సోనేశ్వర్ నరాహ్ ప్రశ్నించారు. తక్షణమే పోస్ట్ మార్టం చేసి పాథాలాజికల్ రిపోర్టుల్లో నిజాలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఆల్ అస్సాం టీ ట్రైబ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎటిటిఎస్ఎ)కు చెందిన అరబింద సోనారా మాట్లాడుతూ తమకు సరైన ప్రాథమిక చికిత్స అందించకుండా ఆసుపత్రిని క్లబ్‌గా మార్చుకోవాలని చూస్తున్నారని అన్నారు. మరణాల వెనుక కారణాలు న్యాయవిచారణ చేయాలని కోరుతూ ఎటిటిఎస్ఎ, జెకెఎస్ఎస్ ప్రతినిధులు సంయుక్తంగా జిల్లా కలెక్టర్‌కు ఒక నివేదికను సమర్పించారు. జిల్లా కలెక్టర్ మెజిస్టీరియల్ విచారణ కోరింది.



సంక్షిప్తం

చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడితే మరణ శిక్ష బిల్లును ఆమోదించిన రాజస్థాన్ అసెంబ్లీ

జైపూర్ : చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలను నివారించడానికి రాజస్థాన్ అసెంబ్లీ కీలకమైన బిల్లును ఆమోదించింది. 12ఏళ్ల అంతకంటే తక్కువ వయస్సున్న చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు మరణ శిక్షను విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లు శుక్రవారం అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ ఇటువంటి చట్టం చేస్తున్న రెండో రాష్ట్రం గా రాజస్థాన్ నిలిచింది. గతంలో కూడా ఇటువంటి చట్టాన్నే మధ్యప్రదేశ్ ప్రభు త్వం తీసుకువచ్చింది.

అలాగే మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితునికి గరిష్ట జైలు శిక్షను ఏడు సంవత్సరాల నుండి 14 సంవత్సరాలకు పెంచింది. సామూహిక అత్యాచారం, ఆ ఘటనలో చిన్నారి మరణించినా ఆ నిందితులకు 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. మహిళలు, పిల్లలపై పెరుగుతున్న నేరాల దృష్ట్యా రాజస్థాన్ ప్రభుత్వం ఈ చర్యను చేపట్టింది.

అత్యాచారం కేసులో 20ఏళ్ళ కారాగార శిక్ష

భువనేశ్వర్ : మహిళపై అత్యాచార ఘటన కేసులో నిందితునికి 20 ఏళ్ళ కఠిన కారాగారశిక్షను విధిస్తూ స్థానిక కోర్టు తీర్పునిచ్చింది. భుని భోల్ అనే నిందితునికి ఈ శిక్షను ఖరారు చేస్తున్నట్లు అదనపు సెషన్స్ జడ్జి, స్పెషల్ కోర్ట్ జడ్జి ప్రగ్యాన్ పాణిగ్రహీ శుక్రవారం తీర్పును వెలువరించారు. ప్రాషిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం సాదర్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్యామ్ సుందర్‌పూర్ గ్రామంలో నివసిస్తున్న భోల్, ఏప్రిల్ 19, 2013 న ఒక సాంస్కృతిక కార్యక్రమం లో పాల్గొని ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.

12న మారిషస్ అధ్యక్షురాలి రాజీనామా

నైజీరియా : మారిషస్ తొలి మహిళా అధ్యక్షురాలు అమీన గురిబ్ ఫకిమ్ తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని ప్రవింద్ జుగ్నౌత్ ప్రకటించారు. ఈనెల 12న దేశం 50వ స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాల్ని నిర్వహిస్తోందని, అనంతరం ఆమె రాజీనామా చేస్తారని పేర్కొన్నారు. ఒక చారిటీ సంస్థ ఇచ్చిన క్రెడిట్ కార్డును దుర్వినియోగంచేసి, పెద్ద మొత్తంలో షాపింగ్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలకే తాము తొలి ప్రాధాన్యమిస్తామని ప్రధాని తెలిపారు. అయితే ఈ ఆరోపణలను ఆమె ఖండించారు.



పహారా

సిరియా, రష్యా సైనికులు తూర్పు గౌటా వద్ద పహారా కాస్తున్న దృశ్యం

అమెరికా చేతిలో కీలుబొమ్మ

ఐరాస మానవ హక్కుల చీఫ్‌పై మదురో ధ్వజం

కారకస్ : ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ అమెరికా చేతిలో కీలుబొమ్మ అని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో వ్యాఖ్యానించారు. మానవ హక్కుల వ్యవస్థలో ఆయనే పెద్ద అడ్డంకి, అవరోధంగా వున్నారని పేర్కొంటూ వెనిజులా సంక్షోభాన్ని తాము ఎదుర్కొంటున్న తీరుపై విమర్శించే హక్కు ఆయనకు లేదని అన్నారు తమ దేశం గురించి అభిప్రాయాలు వెలువరించే హక్కును, తన పట్ల విశ్వసనీయతను ఆయన కోల్పోయారని విమర్శించారు.

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ జేద్ రాద్ అల్ హుస్సేన్ రెండు రోజుల క్రితం మాట్లాడుతూ, వెనిజులాలో ప్రజాస్వామ్య సంస్థలు తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి ప్రభుత్వం ప్రజలపై నేరాలకు పాల్పడుతోందని వ్యాఖ్యానించారు. దీనిపై మదురో స్పందిస్తూ, తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని అన్నారు. ఫాసిస్ట్ వెనిజులా మితవాద పక్ష తీవ్రవాది ఈ హై కమిషనర్ అని వ్యాఖ్యానించారు.



కొత్త నేత ఎన్నికను వాయిదా వేసిన కెటలన్ పార్లమెంట్

మాడ్రిడ్ : కొత్త ప్రాంతీయ అధ్యక్షుడి ఎన్నికను కెటలోనియా పార్లమెంట్ వాయిదా వేసింది. సోమవారం నుండి జరగనున్న పార్లమెంటరీ సమావేశాలకు హాజరయ్యేందుకు అభ్యర్థి జోర్డి సాంచెజ్‌ను అనుమతించబోమని స్పెయిన్ సుప్రీం కోర్టు రూలింగ్ ఇవ్వడంతో ఎన్నిక వాయిదా వేశారు. గత అక్టోబరులో కెటలోనియాలో చట్టవిరుద్ధంగా రిఫరెండం నిర్వహించడం, ఏకపక్షంగా స్వాతంత్ర్యం ప్రకటించుకోవడానికి సంబంధించి తిరుగుబాటు, దేశద్రోహం వంటి అభియోగాలపై విచారణను సాంచెజ్ ఎదుర్కొంటున్నారు. కోర్టు రూలింగ్‌ను వేర్పాటువాద గ్రూపులు యురోపియన్ మానవ హక్కుల కోర్టులో సవాలు చేస్తున్నాయని పార్లమెంట్ స్పీకర్ రోజర్ టొరెంట్ చెప్పారు. డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో స్వాతంత్ర్య అనుకూల పార్టీలు అతి తక్కువ మెజారిటీతో గెలిచాయి. కానీ ప్రాంతీయ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు కోర్టు రూలింగ్స్ అడ్డుపడుతున్నాయి. దాంతో ఆ పార్టీలకు అసహనం పెరిగిపోతోంది. కాగా అభ్యర్థి ఎవరైనా జైల్లో వుండరాదని, దర్యాప్తును ఎదుర్కొనరాదని ఫ్రాన్స్ స్పష్టం చేస్తోంది.

ఉపాధి అవకాశాలకు గండి

ట్రంప్ చర్యల నేపథ్యంలో కార్మికుల ఆందోళన



ఫారెల్, పెన్సిల్వేనియా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కు, అల్యూమినియంలపై భారీగా సుంకాలను పెంచడంతో తమ ఉపాధి అవకాశాలకు గండి పడినట్లేనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 40ఏళ్ళుగా ఉక్కు రంగ కార్మికుడిగా పనిచేస్తున్న మిక్‌లాంగ్ తన జీవితంలో మార్పు వస్తుందనే ఆశతో గత ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటు వేశారు. ఏదో మంచి చేస్తారనే ఆశతో వున్నామని అంతేకానీ ఇలా జరుగుతుందని వూహించలేదని లాంగ్ (59) వ్యాఖ్యానించారు. మెర్సర్ కౌంటీలో లాంగ్ పనిచేస్తున్న ఉక్కు ఫ్యాక్టరీలోనే ఆయన కుమారుడు కూడా పనిచేస్తున్నాడు. కాగా ట్రంప్ చర్యలపై యుఎస్ స్టీల్ కార్పొరేషన్, ఎ.కె.స్టీల్ హోల్డింగ్ కార్పొరేషన్ వంటి కంపెనీలు హర్షం వ్యక్తం చేశాయి. టారిఫ్‌లు పెంచుతూ ట్రంప్ చర్యలు తీసుకున్న నేపథ్యంలో ఇల్లినాయిస్ స్టీల్ ప్లాంట్‌లోని ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను పున:ప్రారంభించనున్నట్లు యుఎస్ స్టీల్ ప్రకటించింది. దీనివల్ల 500 కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయి. సుంకాలు పెంచడం వల్ల 25శాతం ధరలు పెరుగుతాయని, వాటిని తమ వినియోగదారులు ఆమోదించకుండా తిరస్కరిస్తే, దాదాపు 1200 మంది కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోతారని ఎన్‌ఎల్‌ఎంకె అమెరికా యూనిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబ్ మిల్లర్ పేర్కొన్నారు. ఉక్కు ఉత్పత్తిదారులకు ఈ టారిఫ్‌లు మంచివని, కానీ ముడి సరుకులు దిగుమతి చేసుకునే తమ కంపెనీల వంటి వాటికి ఈ చర్యలు తీవ్ర పర్యవసానాలు కలిగిస్తాయని మిల్లర్ పేర్కొన్నారు. సుంకాలు పెరగడం వల్ల దేశీయంగా ఉక్కు తయారీదారులు తమ ధరలను పెంచుతారని, దీనివల్ల జనరల్ మోటార్స్, ఫోర్డ్ మోటార్ కంపెనీ వంటివి నష్టాలు చవిచూడాల్సి వస్తుందని భావిస్తున్నారు.

ప్రతీకార సుంకాలు

- జపాన్, ఇయు హెచ్చరిక
- మంత్రుల భేటీ



బ్రస్సెల్స్ : ఉక్కు, అల్యూమినియంలపై దిగుమతి సుంకాలు పెంచుతూ ట్రంప్ చర్యలు తీసుకున్న నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై తాము కూడా ప్రతీకార సుంకాలు విధిస్తామని జపాన్, యూరోపియన్ యూనియన్‌లు హెచ్చరించాయి. ట్రంప్ చర్యల నేపథ్యంలో యురోపియన్ యూనియన్ వాణిజ్య కమిషనర్ జపాన్ వాణిజ్య మంత్రితో సమావేశమయ్యారు. కెనడా, మెక్సికోలకు మినహాయింపు ఇచ్చిన మాదిరిగా ఈ సుంకాల పెంపు నుండి తమకు కూడా మినహాయింపు ఇవ్వాలని, అలా కాని పక్షంలో తాము అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు విధిస్తామని వారు పేర్కొన్నారు. ఒకవేళ మినహాయింపు లేని పక్షంలో అమెరికా ఉత్పత్తులపై తాము కూడా ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించింది. ట్రంప్ తీసుకున్న ఈ చర్య బూమ్‌రాంగ్‌లా తిరిగి అమెరికానే దెబ్బతీయవచ్చని, వాణిజ్య యుద్ధం తలెత్తే అవకాశాలు వున్నాయని అమెరికా వాణిజ్య భాగస్వాములు, మిత్రపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ట్రంప్ ప్రధాన లక్ష్యమైన చైనా కన్నా ఎక్కువగా మిత్రపక్షాలనే ఈ చర్యలు దెబ్బతీస్తున్నాయని పేర్కొంటున్నాయి.

బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు అమలుతో ప్రపంచీకరణకు కొత్త ఉత్తేజం

చైనా రాయబారి షి మింగ్డె వెల్లడి

బెర్లిన్ : బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు వల్ల అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు మధ్య సంబంధాలు విస్తృతంగా పెరుగుతాయని, ప్రపంచీకరణకు కొత్త ఊపు, ఉత్తేజం వస్తుందని చైనా దౌత్యవేత్త పేర్కొన్నారు. చైనా లక్షణాలతో కూడిన ప్రపంచీకరణ అనే కన్నా అంతర్జాతీయ సమాజానికి చైనా అందిస్తున్న కానుకగా ఈ ప్రాజెక్టును రాయబారి షి మింగ్డె అభివర్ణించారు. జర్మన్ వార్తాపత్రికలో ఈ ప్రాజెక్టును వివరిస్తూ ఆయన వ్యాసం రాశారు. ఇటీవల ఈ చొరవపై జర్మనీలో అనేక చర్చలు సాగాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును అభివృద్ధి పరిచేందుకు కొన్ని ఆచరణాత్మక ప్రతిపాదనలు కూడా వచ్చాయన్నారు. అదే సమయంలో మరికొన్ని ప్రశ్నలు, అపోహలు, హెచ్చరికలు కూడా వెలువడ్డాయన్నారు. చైనా ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు ఆర్థిక పాలనా వ్యవస్థకు అనుబంధమని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒక దేశం ఆధిపత్యపు పాలనను నెలకొల్పాలని తాము కోరుకోవడం లేదని చెప్పారు. ఉమ్మడి అభివృద్ధి, పరస్పర లబ్ధి, ప్రయోజనాలు కీలకాంశాలుగా ఆచరణాత్మక సహకారానికి ఇదొక వేదికను అందిస్తుందని చెప్పారు. ఈ చొరవ చేపట్టిన ఐదేళ్ళకు చైనా 20కిపైగా దేశాలతో సహకారాన్ని విజయవంతంగా సాగిస్తోందన్నారు. లక్షా 80వేల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, పన్నుల రూపంలో 110కోట్లు వచ్చిందన్నారు. చైనా, యూరప్, చైనా, జర్మనీల మధ్య ప్రణాళికాబద్ధమైన సహకారం వల్ల ఆర్థికంగా సమాన ఫలితాలు సాధించడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, యూరప్‌లోపల, వెలుపల భద్రతా వాతావరణం మెరుగుపడుతుందని, ఆర్థికాభివృద్ధి పెరుగుతుందని తెలిపారు. ఇప్పటికే చైనా, జర్మనీల మధ్య సహకారంతో గణనీయమైన ఫలితాలు సాధించామని గుర్తు చేశారు.

శ్రీలంక ఘర్షణలపై రిటైరైన న్యాయమూర్తులతో దర్యాప్తు

కొలంబో : సెంట్రల్ శ్రీలంకలో వ్యాపించిన ముస్లిం వ్యతిరేక ఘర్షణలపై ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ దర్యాప్తు జరుపుతుందని అధ్యక్షుడు మైత్రిపాలా సిరిసేన శనివారం ప్రకటించారు. దేశంలో శాంతి భద్రతల పరిస్థితులు దెబ్బతినడానికి దారి తీసిన పరిస్థితులపై ముగ్గురు రిటైరైన న్యాయమూర్తులు దర్యాప్తు జరుపుతారని అధ్యక్ష భవన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు ముగ్గురు మరణించగా 20మంది గాయపడ్డారు. 200కిపైగా ముస్లింలకు చెందిన వ్యాపార సంస్థలు, గృహాలు ధ్వంసమయ్యాయి. 11 మసీదులను కూడా ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. భారీగా భద్రతా బలగాలను మోహరించిన తర్వాత పరిస్థితులు కాస్త అదుపులోకి వచ్చాయని చెప్పారు. ఈ ఘర్షణలకు ప్రధాన కారకుడుగా అనుమానిస్తున్న వ్యక్తి అమిత్ వీరసింఘెను గురువారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

వేసవి ప్రణాళిక ఏదీ..?

సరిపోయిన విధంగా ట్యాంకర్లు లేవు. అలాగే రాయలసీమ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో గత ఏడాది మూడు, నాలుగు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ చర్యలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నీటి సరఫరాకు అనుగుణంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయడం లేదు. దాతలు వాహనాలతో నీటిని సరఫరా చేస్తూ కాలం వెళ్లదీస్తోంది. ముఖ్యంగా ఉపాధి హామీ విషయంలో ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. గత వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి సమయాల్లో పని కాలాన్ని తగ్గించడం, కూలీ పెంచడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది. పని ప్రాంతాల్లో తాత్కాలిక ఉపశమన చర్యల కింద షెడ్లు నిర్మించడం, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. గత మూడు సీజన్లలోనూ అటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మరణాల సంఖ్య కూడా పెరిగింది. ముఖ్యంగా వేసవిలో వడగాలులు వీస్తే దాన్ని ప్రకృతి విపత్తుగా పరిగణించడం ద్వారా మృతిచెందిన వారికి తగు విధంగా పరిహారం చెల్లించేందుకు చట్టపరంగా అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం చంద్రన్నబీమా, ప్రమాద ఇన్సూరెన్స్ ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. చట్టపరంగా ప్రకటిస్తే మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

'రాజ్యసభ ' కోసం భారీ నజరానా..!

పిలుపు రావడంతో జనవరి 26న మళ్లీ ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాజ్యసభ టికెట్ ఇస్తానన్న హామీతోనే ఆయన మళ్లీ పార్టీలోకి వచ్చినట్లు సమాచారం. ఆయన ఆశించినట్లుగానే జగన్ ఆయనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించారు. ఈనెల 7న ఆయన నామినేషన్ కూడా దాఖలు చేశారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభ స్థానం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈనెల 23న ఆ మూడు సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్‌కు ఈనెల 12వ తేదీ చివరి తేది. ప్రస్తుత బలబలాల ప్రకారం టిడిపికి రెండు స్థానాలు ఖాయమయ్యాయి, మూడో స్థానంలో కూడా అభ్యర్థిని నిలబెడతారనే ప్రచారం సాగుతోంది. వారు అభ్యర్థిని పెట్టకుంటే వేమిరెడ్డి ఎన్నిక లేకుండానే ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. దీంతో పెద్ద ఎత్తున పైరవీలు నడుపుతున్నట్లు సమాచారం. పైన తెలిపిన ఓ సంస్థకు ఇప్పటికే కోట్లాది రూపాయలు విరాళంగా అందించినట్లు సమాచారం. ఇది కాకుండా మూడో అభ్యర్థిని పోటీలో పెట్టకుండా చంద్రబాబు నాయుడిని ఒప్పిస్తే ఆ సంస్థకు మరికొంత డబ్బు ఇవ్వడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఢిల్లీ నుంచి మూడో అభ్యర్థిని నిలబెట్టే విషయంలో చంద్రబాబు నాయుడుపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందో నేడో, రేపో తేలనుంది. వైసిపిలోని ఓటర్లను కాపాడుకోవడానికి క్యాంపులు నిర్వహిస్తున్నారు. నేపాల్, మలేషియా, థాయిలాండ్‌తో పాటు పలుదేశాల్లో వైసిపి ఎంఎల్‌ఎలు క్యాంపుల్లో ఉన్నారు. ఆ పార్టీ ఎంఎల్‌ఎలకు రూ.ఒకటో, రెండు కోట్లు ఇవ్వడానికి సిద్ధపడినట్లు సమాచారం. ఒక వేళ ఎన్నికలు జరిగితే ఈ డబ్బు మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. తన చిరకాల స్వప్నమైన రాజ్యసభ కుర్చీకోసం ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో ఖర్చుచేసిన అభ్యర్థి ఎవ్వరూ లేరని ఆ పార్టీ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కోసం బహిరంగ కుమ్మలాట జరుగుతోంది. టిడిపి మూడో అభ్యర్థిని రంగంలోకి దించుతుందా ? లేదా అన్న విషయం నేడో, రేపో తేలనుంది.

టిడిపిలో పెద్దల పేచీ

వ్యక్తం చేశారు. అప్పట్లో సుజనాచౌదరిని ఎంపిక చేయడంతో యనమలకు టిక్కెట్ కేటాయించడం సాధ్యం కాలేదు. ప్రస్తుతం రాజ్యసభకు వెళితే వచ్చే టర్మ్ వరకూ కొనసాగేందుకు వీలుంటుంది. నేతల సీనియార్టీ సంగతి ఎలా ఉన్నప్పటికీ, ఆర్థికాంశాలు కూడా ప్రభావితం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. సాధారణ ఎన్నికలు కూడా సమీపిస్తుండటంతో ఈ అంశం కూడా కీలకంగా మారింది. బీదా మస్తానరావు తొలి నుండి పార్టీలో ఉండటంతోపాటు, ఆర్థికంగా కూడా వెసులుబాటు ఉంది. రెండు మూడు జిల్లాల బాధ్యతలు అప్పగించినా, నెగ్గుకురాగలరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది,. ఎస్‌సి నేతల పేర్లు కొన్ని పరిశీలించినా సీనియార్టీ మినహా ఇతర అంశాల్లో వారు వెనుకబడి ఉన్నట్లు సమాచారం. రానున్న ఎన్నికలు కీలకంగా మారనుండటంతో ఆర్థికపరమైన అంశాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదన్నది చంద్రబాబు నిర్ణయంగా చెబుతున్నారు.

ప్రజారోగ్యంతో పాలకుల చెలగాటం

(మొదటిపేజీ తరువాయి)

రోడ్లపైకి వచ్చి నిరసన చేస్తున్నారన్నారు. అలాగే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ఆచరణలో లక్షల మంది ఉద్యోగాలు ఊడే విధానాలు అవలంభిస్తున్నారని, ప్రజలకు మోసం చేయడంలో బాబు, మోడీ విధానాలు ఒక్కటేనని అన్నారు. కార్మికులు, యువతను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలు సంఘటితం కాకుండా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్న ప్రభుత్వాలపై ప్రజాప్రతిఘటన పెరుగుతోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, మతోన్మాద, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా మెడికల్ రెప్రజెంటేటివ్‌లు 50 ఏళ్ల ఉద్యమం అనుభవంతో పోరాటాలను రూపొందించాలని పిలుపునిచ్చారు.



బహిరంగసభలో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎకె.పద్మనాబన్, వేదికపై ఎంఎ.గఫూర్ తదితరులు.

వ్యాపారంగా ప్రజారోగ్య రంగం : ఎంఏ.గఫూర్

ఆరోగ్యం సమాజాభివృద్ధికి సంబంధించిన ప్రధానాంశమని, అలాంటి రంగం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుకుని వ్యాపారంగా మార్చారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ.గఫూర్ విమర్శించారు. డబ్బున్నోడికే వైద్యమన్న తీరు నడుస్తోందన్నారు. మోడీ తీసుకొస్తున్న ఆయుష్మాన్ భవ, రాష్ట్రంలో ఆరోగ్యశ్రీకి కేటాయించిన నిధులు ప్రభుత్వ రంగంలో ఖర్చు పెడితే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం అందించడం కీలకమన్నారు. పౌష్టికాహారం అందించే ఐసిడిఎస్‌కు కేంద్రం నిధులు తగ్గించిందని చెప్పారు. ప్రజారోగ్యంతో కార్పొరేట్ హాస్పిటళ్లు, మందుల కంపెనీలు చెలగాటమాడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలు వైద్యం కోసమే అప్పుల పాలవుతున్నారని అనేక సర్వేలు చెబుతున్నాయని అన్నారు. ప్రజారోగ్యం కోసం ధరల నియంత్రణ, మందులపై జిఎస్‌టిని తగ్గించాలనే ఉద్యమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సామాజిక ఉద్యమాలను నిర్మించేందుకు మెడికల్ రెప్స్ కృషి చేయాలని అన్నారు. హక్కులపైనే కాకుండా సామాజిక ఉద్యమాల పైనా ఉద్యమించాలని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎజి. రాజమోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో కనీసంగా 8 శాతం నిధులు కేటాయించాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికలు చెబుతున్నాయని అన్నారు. దేశ బడ్జెట్‌లో 1.2 శాతం నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం 1 శాతంలోపే కేటాయించిందని, ఈ నిధులతో వైద్యం ప్రజలకు ఎలా అందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం మంది ప్రజలు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలతో కలిసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎంఆర్ఎఐ అధ్యక్షులు ఆర్.విశ్వనాథన్, ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యువి.కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు, ఎవి.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.రాధాకృష్ణ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మహిళలకు తీవ్ర అన్యాయం

- వైసిపి ఎమ్మెల్యే రోజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేశారని వైసిపి ఎమ్మెల్యే ఆర్కే రోజా విమర్శించారు. బడ్జెట్‌లో మహిళాభున్నతి కోసం ఎలాంటి కేటాయింపులూ లేకపోవడం దారుణమన్నారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, డ్వాక్రా రుణమాఫీ, వడ్డీలేని రుణాలు, మహిళల భద్రతకు పెద్దపీట వేస్తానని చెప్పిన చంద్రబాబు మహిళలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా రుణాలు రూ.14,200 కోట్ల వరకు ఉంటే, నాలుగేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం కేటాయించింది కేవలం రూ.17 వందల కోట్లు మాత్రమేనన్నారు. కేటాయించిన నిధులు కూడా క్యాపిటల్ ఇన్‌ఫ్యూజన్ కింద ఇచ్చారని తెలిపారు. వడ్డీలేని రుణాలు రూ.24 వందల కోట్ల వరకు బకాయిలుంటే రూ.1460 కోట్లు కేటాయించారన్నారు. బెల్ట్‌షాపులను దశలవారీగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఆడపిల్లపుడితే రూ.30 వేలు బ్యాంకులో వేస్తామని గొప్పగా ప్రకటించుకున్న చంద్రబాబు మహాలక్ష్మి పథకం ద్వారా నాలుగేళ్లలో ఒక్క ఆడపిల్ల పుట్టినట్లయినా నమోదు చేశారా అని ప్రశ్నించారు. పండంటి పథకం కింద గర్భిణులకు రూ.10 వేలు ఇస్తామన్న ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఎంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు ప్రయత్నిస్తానని చెప్పిన చంద్రబాబు ఈ నాలుగేళ్ల కాలంలో ఒక్కసారైనా కేంద్రాన్ని అడిగారా అని ప్రశ్నించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధ దంపతులు మృతి

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

ప్రమాదవశాత్తు బావిలో పడిన భార్యను రక్షించబోయి భార్యాభర్తలిద్దరూ మృతి చెందారు. ఈ సంఘటన అనకాపల్లి మండలం మాకవరం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులో కొచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని రూరల్ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మాకవరం గ్రామానికి చెందిన ఎస్.కృష్ణస్వామినాయుడు(65), భార్య కాసులమ్మ (52) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పొలంపనుల్లో భాగంగా నేల బావిలోని నీరు తోడేందుకు వెళ్లి కాసులమ్మ ప్రమాదవశాత్తు బావిలో పడింది. ఆమెను రక్షించేం దుకు భర్త కృష్ణస్వామినాయుడు బావిలోకి దూకాడు. బయటకు వచ్చేందుకు వీలు లేకపోవడంతో ఇద్దరూ చనిపోయారు. శనివారం ఉదయం పొలం పనులకు వచ్చిన గ్రామస్తులు భావిలో కాసులమ్మ మృతదేహాన్ని చూసి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎన్‌టిఆర్ 100 పడకల ఆసుపత్రికి తరలించారు. మృతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

సముద్రతీరంలో ప్రేమజంటపై దాడి

ప్రజాశక్తి-కాట్రేనికోన (తూర్పుగోదావరి)

సముద్రతీర ప్రాంతంలో ఓ ప్రేమజంటపై ఐదుగురు దుండగులు శుక్రవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారు. యువతిపై అత్యాచారయత్నం చేస్తూ వీడియో చిత్రీకరించారు. అడ్డుకున్న స్థానికులపై దాడికి దిగారు. దీంతో ముగ్గురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలోని సముద్ర తీరప్రాంతమైన కాట్రేనికోన మండలం బ్రహ్మస మేధ్యం శివారు నీళ్లరేవు చొల్లంగి కాళ్లభైరవస్వామి ఆలయ సమీపంలోని సరుగుడు తోటలోకి గుర్తు తెలీని ప్రేమజంట శనివారం వచ్చింది. దోమ జనార్ధనరావు కుమారులు, అతడి తమ్ముడు రాజు, సంగాని నరసింహమూర్తి కుమారుడు, మరో వ్యక్తి కలిసి ప్రేమజంటను అటకాయించారు. జనార్ధనరావు కుమారుడు మణికంఠ యువతిపై అత్యాచారయత్నానికి ప్రయత్నించగా, మిగిలిన వారు ఆ దృశ్యాన్ని సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. అడ్డొచ్చిన ప్రియుడిపై దాడి చేశారు. అతడు తప్పించుకుని రక్షించండంటూ కేకలు వేసుకుంటూ చొల్లంగి గుడి వద్దకు వచ్చాడు. అటుగా వెళ్తున్న పల్లం గ్రామానికి చెందిన మల్లాడి చినకాసుబాబు, పెదకాసుబాబు, పాలెపు ధర్మారావు, బొమ్మిడి రాజు, కె.సతీష్, సంగాని వీరబాబు సంఘటనా స్థలానికి వెళ్లారు. అత్యాచార యత్నానికి పాల్పడుతున్న దుండగులను వారించారు. దీంతో దుండగులు వీరిపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో చినకాసుబాబుకు తలపైనా, చేతిపైనా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రేమజంట అక్కడినుంచి వెళ్లిపోయారు. బాధితుడు చినకాసుబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.దుర్గాశేఖర్‌రెడ్డి తెలిపారు.

50 కోట్ల పైబడి రుణాలకు పాస్‌పోర్టు తప్పనిసరి

న్యూఢిల్లీ: బ్యాంకులకు పెద్ద ఎత్తున రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్న ఘటనలు పెరుగుతుండటంతో ఆర్థిక నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కొత్త నిబంధన అమలులోకి రానున్నది. 50 కోట్లకు పైగా రుణాలు తీసుకునే వారు ఇకపై తమ పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని ప్రభుత్వం వెల్లడించింది. ఆర్థిక నేరాల్ని అరికట్టేందుకు ఈ చర్యలు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తున్నది. కొత్తగా రుణాలు తీసుకునే వారి పాస్‌పోర్టు వివరాలను బ్యాంకులు సేకరిస్తాయని, రుణ గ్రహీతలు 45 రోజుల్లోగా వారి పాస్‌పోర్టు వివరాలు సమర్పించాలని ప్రభుత్వం తెలిపింది. ఇటీవల బ్యాంకింగ్ వ్యవస్థను కుదిపేసిన పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టుగా ఆర్థిక శాఖ తెలిపింది. అయితే ఈ నిబంధన ఎప్పట నుంచి అమల్లోకి వస్తుందనే విషయంలో స్పష్టత రాలేదు.

అంతా నగదు రహితమే

(మొదటిపేజీ తరువాయి)

విశ్లేషిస్తున్నారు. గత చాలా కాలంగా ఆన్‌లైన్ నగదు చెల్లింపుల వైపు వెళ్లేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. కరెన్సీ ముద్రణకు అయ్యే భారీ వ్యయాన్ని కూడా దీనివల్ల తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందని కేంద్రం భావిస్తోంది. అయితే గ్రామాల్లో ప్రతి చిన్న అవసరానికీ ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయడం సాధ్యం కానిదిగా కనిపిస్తున్నప్పటికీ కేంద్రం మాత్రం నగదు రహిత విధానానికే మొగ్గు చూపిస్తోంది. ఇప్పటికే 2017-18 సంవత్సరానికి రూ.2500 కోట్ల మేరకు డిజిటల్ లావాదేవీలు అమలు చేయాలని నిర్దేశించిన కేంద్రం తాజాగా దీనిని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బిబిపిఎస్), రూపే కార్డులు, బిహెచ్‌ఐఎం వంటి డిజిటల్ విధానాలు అమలు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఐటి కార్యదర్శులకు లేఖలు రాసింది. వారు అమలు చేస్తున్న విధానాలను నేరుగా అధ్యయనం చేసేందుకు 15 అంశాలతో నమూనాలను రాష్ట్రాలకు పంపించింది. ప్రజల నుంచి ఆన్‌లైన్ ద్వారా, నగదు రూపంలోను జరుగుతున్న వసూళ్లను విడివిడిగా సమర్పించాలని ఈ నమూనాల్లో నిర్దేశించింది. విద్యుత్ ఛార్జీలు, నీటి పన్ను, రవాణా శాఖ వసూలు చేసే వివిధ రకాల ఛార్జీలు, ఆన్‌లైన్ ద్వారా ఆర్టీసీకి వసూలవుతున్న మొత్తం, చౌక ధరల దుకాణాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో రోగుల నుంచి వసూలు చేస్తున్న మొత్తం, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ద్వారా వివిధ సేవలకు చేస్తున్న వసూళ్లు, చివరికి పాల విక్రయాలపై కూడా ఈ వివరాలు సమర్పించాలని సూచించింది.

ఆన్‌లైన్ నగదు లావాదేవీలకు ఆయా రాష్ట్రాల్లో ఇస్తున్న ప్రోత్సాహకాలను కూడా వివరించాలని కోరింది. ఈ వివరాలతో నగదు రహిత లావాదేవీల విషయంలో రాష్ట్రాలకు మార్కులు వేయాలని కూడా కేంద్రం భావిస్తోంది.

నీరవ్‌మోడీతో గుంటూరు వ్యాపారికి సంబంధాలు

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో వీరి మధ్య ఉన్న సంబంధాలు, ఇతర అంశాలపై సిబిఐ అధికారులు విచారణ చేస్తున్నారు. జ్యూయలరీ పార్కును మోదీ కొనుగోలు చేసినా ఈ వ్యాపారి ఇందులో అంతర్గత భాగస్వామిగా ఉన్నారనే సమాచారంపైనా ఆరా తీస్తున్నారు. ఈ వ్యాపారి సోదరుడు గుంటూరులో ఆటోమొబైల్ డీలరుగా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరికీ నీరవ్‌మోడీతో గల సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. వీరికి రాష్ట్ర టిడిపి నాయకులతో మంచి సంబంధాలు ఉండటంతో మోదీ ఇంకా ఎవరెవరి వద్ద పెట్టుబడులు పెట్టారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్ నుంచి వచ్చిన సిబిఐ అధికారులు వివిధ కోణాల్లో గుంటూరు నగరంలో వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది.


మహేశ్ బాబు

25వ చిత్రం

మహేశ్ బాబు ఇప్పుడు 'భరత్ అనే నేను' చిత్రం పనుల్లో బిజీగా ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను ఇటీవలే విడుదల చేశారు. ఇందులో మహేశ్ భరత్ రామ్ అనే పాత్రలో ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. ఈ చిత్రం తర్వాత తన 25వ సినిమా త్వరలోనే పట్టాలెక్కబోతుంది. వంశీపైడి దర్శకత్వం వహించనున్నారు. పూజా హెగ్డే కథానాయికగా ఎంపిక చేసినట్టు తెలిసింది. బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ మోహనన్ పని చేయబోతున్నారు. దేవిశ్రీప్రసాద్ బాణీలు అందించనున్నారు. అంతా ఫైనల్ అయిపోయింది. మహేశ్ ఇవ్వనున్న షూటింగ్ డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. 'భరత్ అనే నేను' ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దాని తర్వాత మేలోగానీ, జూన్‌లో గానీ ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ఆస్ట్రేలియన్ టీవీ సరీస్ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కబోతున్నట్టు వార్తలు ప్రచారమైతే అవన్నీ అవాస్తవాలని శనివారం ట్విట్టర్ వేదికగా కొట్టి పారేశారు దర్శకుడు వంశీ. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్ బ్యానర్‌లో దిల్ రాజు, అశ్వనీదత్ నిర్మించబోతున్నారు.


కల్యాణ్ రామ్, కాజల్

ఈ అబ్బాయి మంచోడు

నందమూరి కల్యాణ్ రామ్, కాజల్ హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'ఎంఎల్‌ఏ'. మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి ఉపశీర్షిక. ఈ సినిమాను నవంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. కిరణ్ రెడ్డి, భరత్ కుమార్ చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో 'నేనే రాజు నేనే మంత్రి' తర్వాత రూపొందుతోన్న సినిమా. 'లక్ష్మీకల్యాణం' తర్వాత కాజల్, కల్యాణ్ రామ్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిది. ఈ చిత్రానికి సంబంధించిన కొత్త ఫొటోలను శనివారం చిత్రబృందం మీడియాకి విడుదల చేసింది.


నితిన్

యువ 'సమ్మోహనం'

అనూహ్యమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న కొత్త తరం ప్రేమ కథా చిత్రం 'సమ్మోహనం'. జూన్ 15న విడుదల కానుంది. సుధీర్‌బాబు హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. అదితీరావు హైదరీ నాయికగా నటిస్తున్నారు. శ్రీదేవి మూవీస్ ప్రొడక్షన్ నెంబర్ 10గా ఈ చిత్రం తెరకెక్కుతోంది.

నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 'ఆఖరి షెడ్యూల్‌ని ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3 వరకు హిమాచల్ ప్రదేశ్, ముంబైలో తెరకెక్కిస్తాం. దాంతో షూటింగ్ పూర్తవుతుంది. ఏప్రిల్, మేలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు చేస్తాం. జూన్ 15న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సంగీతానికి మంచి ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. అత్యుత్తమ సాంకేతిక విలువలు, నిర్మాణ విలువలు ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయ'ని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ... కొత్త ఎత్తుగడ, కొత్త పోకడ ఉన్న ఈ నవతరం కథలో రొమాన్స్, హాస్యం సమ్మిళితమై ఉంటుంది. పి.జి.విందా ఫొటోగ్రఫీ, వివేక్ సాగర్ సంగీతం, రవీందర్ కళా దర్శకత్వం ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణలు. చక్కటి కథ, కథనానికి చక్కటి నిర్మాణ విలువలు తోడయ్యాయి. టైటిల్‌కి తగ్గట్టుగానే సినిమా మొత్తం అందమైన ఫీల్ క్యారీ అయి సమ్మోహనంగా అనిపిస్తుంద'ని చెప్పారు.


అదితీరావు హైదరి, సుధీర్ బాబు

'దబాంగ్ 3'కి ప్రభుదేవా దర్శకత్వం

సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా 'దబాంగ్' ఫ్రాంచైజీలో మరో చిత్రం రాబోతున్న విషయం చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను అర్బాజ్ ఖాన్ మాత్రం దర్శకత్వం వహించబోరని సల్మాన్ ముందు నుంచీ చెబుతున్నారు. మరి ఎవరు దర్శకత్వం వహిస్తారన్న దానిపై ఇప్పటి వరకూ సస్పెన్స్ కొనసాగింది. ఇప్పుడు దీనిపై స్పష్టత వచ్చింది. 'దబాంగ్ 3'ని ప్రభుదేవా దర్శకత్వం వహించబోతున్నారని ప్రకటించారు. సల్మాన్ ఖాన్, ప్రభుదేవా కాంబినేషన్‌లో 2009లో 'వాంటెడ్' వచ్చింది. అది మంచి విజయం సాధించింది. ఆ తర్వాత వీరిద్దరూ కలసి 'రౌడీ రాథోడ్' అనే చిత్రాన్ని నిర్మించారు. ఇప్పుడు మళ్లీ ఈ సినిమా తెరకెక్కబోతుంది. 'ఈ సినిమాకు సంబంధించి అన్ని విషయాలు గత వారం ముంబాయిలో ఉన్నప్పుడు ఫైనలైజ్ చేశాం. ఈ చిత్రానికి నేనే దర్శకత్వం వహిస్తున్నా. దర్శకత్వం వహించమని అర్బాజ్ ఖాన్, సల్మాన్ ఇద్దరూ సంయుక్తంగా చెప్పారు' అని ప్రభుదేవా అన్నారు. ఇందులో దర్శకుడు తప్ప మిగిలిన నటులు, సాంకేతిక సిబ్బంది అందరూ పాతవారే అని చెప్పారు ప్రభుదేవా. సోనాక్షి సిన్హా, సల్మాన్, అర్బాజ్ ఖాన్ ముఖ్య తారాగణంగా నటిస్తున్నారు. సాజిత్ విజిత్ బాణీలు సమకూరుస్తున్నారు.



సల్మాన్, ప్రభుదేవా

గండి పేట మైసమ్మ...

"నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో గండి పేట గండి మైసమ్మ...అనగానే ప్రతీ తెలుగు అభిమాని పూనకం వచ్చినట్టు డాన్సులు వేస్తారు. ఎందుకంటే ఆ పాటలో ఉన్న ఎనర్జీ అటువంటిది. ఇప్పుడు ఈ పాటని నితిన్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం "ఛల్ మోహన్ రంగ"లో రీక్రియేట్ చేశారు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. నిఖితా రెడ్డి సమర్పణలో, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిని, పెద్దమ్మ తల్లి గొప్పతనాన్ని చాటుతూ బోనాల సంబరాలలో పాడుకునే పాట 'పెద్ద పులి'. ఆ పాటని అంతే గొప్పగా, దాని స్థాయి ఏ మాత్రం తగ్గకుండా సంగీత దర్శకులు థమన్, సాహిత్య రచయిత సాహితి చాలా జాగ్రత్తగా రీక్రియేట్ చేశారు. సాహితి అసలైన తెలంగాణ పదాలను వాడుతూ, పాటలో ప్రాస యాస ఏ మాత్రం తగ్గకుండా, వినడానికి పాడుకోవడానికి సులభంగా ఉండేలా రాశారు. ఈ మధ్యన ఫోక్ సాంగ్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారిన రాహుల్ సిపిలిగంజ్ ఈ పాటని పాడారు. ఈ గీతం గత రాత్రి వరంగల్ వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో యువత కేరింతలు, ఉత్సాహాల నడుమ విడుదల అయింది. ఈ చిత్రానికి ఎన్. నటరాజన్ సుబ్రహ్మణ్యన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. చిత్ర నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు ప్రకటించారు.

కాలేజీ 'ఆనందం'



కాలేజీ నేపథ్యంలో మలయాళంలో రూపొందిన చిత్రం 'ఆనందం'. సుఖీభవ మూవీస్ బ్యానర్‌లో ఎత్తరి గురురాజ్ నిర్మించారు. తెలుగులో కూడా ఇదే పేరుతో ఈనెల 23న విడుదల చేయబోతున్నారు. మలయాళ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ చిత్రానికి గణేశ్ రాజ్ దర్శకత్వం వహించారు. 'ప్రేమమ్' హీరో నివిన్ పాల్ ఇందులో అతిథి పాత్రలో మెప్పించారు. మిగిలిన నటీనటులందరూ దాదాపుగా కొత్తవారే. తెలుగులో అనువాదమవుతోన్న చిత్రానికి వీరా వెంకటేశ్వర రావు (పెదబాబు), రాజు ,రవి వర్మ చిలువూరి సహ నిర్మాతలు . సీనియర్ నిర్మాత ఆర్. సీతారామరాజు సమర్పిస్తున్నారు. చిత్ర నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ 'అనువాద పనులు దాదాపుగా పూర్తయ్యాయి. తుది మెరుగులు దిద్దుతున్నాం. ఈ నెల 17న పాటల విడుదల చేస్తాం' అని తెలిపారు.

మనోజ్ నందన్ 'మనసైనోడు'


మనోజ్ నందన్, ప్రియా సింగ్

మనోజ్ నందన్, ప్రియాసింగ్ హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'మనసైనోడు'. హెచ్.పిక్చర్స్ పతాకంపై హస్సేబుద్దిన్ నిర్మిస్తున్నారు. సత్యవరపు వెంకటేశ్వరరావుని దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యువతీ యువకులు స్నేహంలో ఉన్నప్పుడు, ప్రేమలో ఉన్నప్పుడు వాళ్ళ మధ్య జరిగే భావోద్వేగాలను కథలో జోడించి, మంచి సందేశంతోపాటు దేశభక్తిని యువకుల్లో కలిగే విధంగా రూపుదిద్దుకున్న చిత్రమిదని నిర్మాత తెలిపారు. పోసానికృష్ణమురళీ, రఘుబాబు, గిరిబాబు, కేదార్ శంకర్, గుర్రాజు, వేణుగోపాల్, అనంత్, చేతన్య, శశాంక, సంగీత, మధుమని, జ్యోతి, దివ్యశ్రీగౌడ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా : సురేంద్రరెడ్డి, ఎడిటింగ్ : మార్తాండ్ కె వెంకటేష్, మ్యూజిక్ : సుభాష్ ఆనంద్, పాటలు: డా.సి. నారాయణ రెడ్డి,భాస్కరబట్ల,గోసాల రాంబాబు, పూర్ణాచారి, నిర్మాత : హసీబుద్దిన్, కథ,మాటలు,స్క్రీన్ ప్లే,దర్శకత్వం : సత్యవరపు వెంకటేశ్వరరావు.

చేతులు చాచి...యుగములు వేచి...

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో రూపొందుతోన్న సినిమా 'తారామణి'. రామ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం తమిళ్‌లో విడుదలై ఘనవిజయం సాధించింది. తెలుగులో అదే పేరుతో జె.ఎస్.కె. ఫిలిం కార్పొరేషన్ సమర్పణలో డి.వి. సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ తెలుగులో అందిస్తున్నారు. 'చేతులు చాచి.. యుగములు వేచి, నీకై ఎదురుచూస్తుంటాలే.. నీ కనుమేరల దారులలోన.. నా ఎద లాంతర వెలుగయ్యాలే..' అంటూ సాగే మొదటి పాటను ప్రముఖ సంగీత దర్శకురాలు యం.యం.శ్రీలేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి నేను ముందే విన్నాను. తమిళ్‌లో సక్సెస్‌ఫుల్‌గా రన్ అయిన సినిమా. తెలుగులో ఈ సినిమాను తీసుకురావడం చాలా హ్యాపీగా ఉంది. ఇది నార్మల్ మూవీ కాదు. కరెంట్ ఎఫైర్స్‌తో ఉండే సినిమా ఇది. అన్ని ఎలిమెంట్స్ ఉంటూనే లేడీస్‌కి బాగా కనెక్ట్ అయ్యే సినిమా. ఎందుకంటే నేను కూడా ఈ సినిమా చూశాను. బాగా కనెక్ట్ అయ్యాను. మహిళలు ఎలా కష్టపడుతున్నారు, ఫ్యామిలీ ప్రాబ్లమ్స్‌ని ఎలా ఫేస్ చేస్తున్నారు, వాటిని ఎలా అధిగమిస్తున్నారు అనేది ఈ సినిమాలో చూపించారు' అని అన్నారు.



నాలో ప్రేమ నువ్వేనా

జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై వాసు దేవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'నాలో ప్రేమ నువ్వేనా'. చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. వాసు దేవ్ మాట్లాడుతూ 'ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ. ప్రేమ కథా చిత్రాల్లో ఇదొక వైవిధ్యమైన సినిమాగా నిలిచిపోతుంది. చోటా చిత్ర లోగోను ఆవిష్కరించారు. త్వరలోనే పాటలను విడుదల చేస్తాం. సినిమాను వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ'న్నారు.


రాధికా ఆప్టే

అదో చెత్త విషయం

రాధికా ఆప్టే అంటే ఏదైనా సూటిగా మాట్లాడేసే వ్యక్తి. అది తన వ్యక్తిగతమైనా, వృతిపరమైన విషయమైనా నేరుగా సమాధానం ఉంటుంది. ఇప్పుడు కూడా రాధిక నెటిజన్లు పెడుతున్న అభ్యంతరకర కామెంట్లపై అలాగే సమాధానం చెప్పారు. ఇటీవల గోవా బీచ్‌లో తన స్నేహితుడితో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు రాధిక. బీచ్‌లో బికినీ వేసుకుని ఉన్న ఫొటోలను చూసి నెటిజన్లు చేస్తున్న అభ్యంతరకర కామెంట్లపై మీడియా ప్రశ్నించడంతో ఘాటుగానే స్పందించారు. 'నాపై నెటిజన్లు కామెంట్లు చేస్తున్నట్లు ఎవరో చెబితే గానీ తెలియలేదు. ఇదో చెత్త విషయం. బీచ్‌లో చీర కట్టుకోమంటారా? అదేనా వారి(నాపై కామెంట్స్ చేసేవారు) ఉద్దేశం' అని ప్రశ్నించారు రాధిక. ఇంతకముందు ఇవే కామెంట్స్ తాప్సీ, ఇషా గుప్తా, అమేషా పటేల్‌కు ఎదురయ్యాయి. తాజాగా రాధికా ఆప్టే ఆ విషయంలో వార్తల్లో నిలిచింది. రాధిక నటించిన 'ప్యాడ్‌మ్యాన్' చిత్రంతో మంచి విజయం అందుకున్నారు. ప్రస్తుతం ఒక పక్క ఇంగ్లీష్ చిత్రాలు, మరో పక్క హిందీ చిత్రాల్లోనూ నటిస్తున్నారు.



కూల్ కూల్‌గా



యూత్‌ను క్రేజీగా అకర్షించేవీ అలంకరించేవి ట్రెండీ కళ్ళద్దాలే. ఎప్పటికప్పుడు సీజన్, ట్రెండ్, జెనరేషన్‌కీ తగ్గట్టు ఫ్రెష్‌లుక్స్‌తో యువహృదయాలను ఇవి దోచుకుంటూనే ఉన్నాయి. ప్రతి ఏటా ఈ కళ్ళద్దాల ట్రెండ్స్ మారుతూ వస్తున్నాయి. ఈ మధ్య సినిమా హీరోలూ మంచి డీసెంట్ గాగూల్స్‌తో తెర మీదా తెరవెనుకా దర్శనమిస్తున్నారు. వాళ్ళకు తగ్గట్లు ఫ్యాన్స్ కూడా అదే ట్రెండ్ ఫాలో అయిపోతున్నారు. "ఇప్పటివరకూ ఓ లెక్క- ఇప్పటి నుంచీ ఓ లెక్క" అంటూ ఈ ఏడాది ట్రెండ్ సెట్ చేయటానికి మరిన్ని కొత్త మోడల్స్ వచ్చేశాయి.

ప్రతి ఏటా ఎండలు పెరుగుతూనే ఉన్నాయి. మరి ఆ ఎండల నుంచి మన కళ్ళను రక్షించుకోవటం పెద్ద పనే. అలా అని ఆ పని పెద్ద కష్టమేమీ కాదు. చక్కని సన్‌గ్లాసెస్‌తో భానుడి కిరణాలకు, కళ్ళకు మధ్య ఓ చల్లని తెర కట్టేయొచ్చు. సన్‌గ్లాసెస్ అనగానే అందరికంటే ముందు యూతే గుర్తొస్తారు. తయారీ కంపెనీలూ యూత్‌నే ఎక్కువగా దృష్టిలో పెట్టుకుంటాయి. యూత్‌కి నచ్చిందంటే అది బాగా క్లిక్ అయిపోయినట్టేనని.. గుండెల మీద చేతులు వేసుకుని నిశ్చింతగా కూర్చునే కంపెనీలూ ఉంటాయి. అందుకే కొత్త కొత్త ట్రెండ్స్ తో స్టైలిష్ లుక్స్‌తో.. ఎప్పటికప్పుడు సన్‌గ్లాసెస్ అప్‌డేట్ అవుతూ యూత్‌ను ఆకర్షిస్తున్నాయి. ఈ వేసవిలో శక్తివంతమైన ఆల్ట్రా వైలెట్ కిరణాల నుంచి కూలింగ్ గ్లాసెస్‌తో కూల్‌గా తప్పించుకోండి. అలాంటి కళ్లద్దాల విశేషాలూ ఈ వారం 'జోష్'లో..!

లెన్స్

మామూలుగా సన్‌గ్లాసెస్... అల్ట్రావైలెట్ కిరణాలను ఫిల్టర్ చేసి కళ్ళు దెబ్బతినకుండా నివారిస్తాయి. అద్దాన్ని ఫిల్టర్ చేసి టెస్టులన్నీ పాస్ అయ్యాకే మార్కెట్‌లో విడుదల చేస్తారు. వీటిని తయారు చేయటానికి పాలీకార్బనేట్ కలర్ ప్లాస్టిక్ వాడుతుంటారు. కాస్త ధర ఎక్కువైనా ఫరవాలేదనుకుంటే మంచి క్వాలిటీ లెన్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. స్క్రాచ్ రెసిస్టెంట్ క్వాలిటీ కావాలనుకుంటే బోరోసిటికేట్ అనే అద్దం వాడిన లెన్స్‌ను వినియోగిస్తే బాగుంటుంది.

ఫ్రేమ్స్

ఫ్రేమ్స్‌లో మెటల్, ప్లాస్టిక్ రెండురకాల మెటీరియల్ వాడతారు. ఈ రంగంలో ఉండే భారీ పరిశ్రమలైతే నికిల్, సిల్వర్, స్టెయిన్‌లెస్ స్టీల్, గ్రాఫైట్, నైలాన్ వంటి పదార్థాలనూ వాడుతుంటారు. వీటి ధర కూడా కాస్త ఎక్కువే. ప్లాస్టిక్ ఫ్రేమ్స్ ఎక్కువగా మార్కెట్‌లో కనపడుతుంటాయి. యూత్, మధ్యతరగతి వారూ ఎక్కువగా వీటిని వాడటానికే ఇష్టం చూపుతున్నారు. ధరలు అందుబాటులో ఉంటూ, రకరకాల మోడల్స్ దొరకడం వీటిలో ఒక వెసులుబాటు. ఆ ఫ్రేమ్స్‌లో కొన్ని మోడల్స్ మీకోసం....

ఫ్లాట్ టాప్ విసర్స్



ఈ మోడల్ పాతదే. కానీ ఇందులోనే ఎప్పటికప్పుడు రకరకాల కొత్త ఫ్రేమ్స్‌తో ట్రెండ్ సెట్ చేస్తూ వస్తున్నాయి. వీటిని ఎక్కువగా హాలీవుడ్ స్టార్స్ వాడుతుంటారు.

సినిమాల్లోనూ విరివిగా ఈ ఫ్రేమ్స్ ఉపయోగిస్తుంటారు. ఫ్రేమ్ పైభాగమంతా సమానంగా ఉండి రెక్టాంగిల్ ఆకారంలో ఉంటుంది. ఈ ఫ్రేమ్‌ను ఫాస్ట్రాక్ లాంటి పెద్ద కంపెనీల్లో కూడా అందుబాటులో ఉంది కానీ ధర కాస్త ఎక్కువే.

రౌండెడ్ ఫ్రేమ్స్



గతేడాది ఈ మోడల్ టీనేజర్స్‌ను ఎక్కువగా ఆకర్షించింది. లాస్ట్ ఇయర్ బాగా ట్రెండ్ అయిన వస్తువుల సరసన ఇదీ చేరిపోయింది. సెలబ్రిటీలు సైతం ఈ రౌండెడ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు ధరించి, మరింత ట్రెండ్ చేసేశారు. ఎప్పుడు ఏది ట్రెండ్ అవుతుందో ఎవరు మాత్రం చెప్పగలరు? ట్రెండ్ అవ్వడానికి, కొత్త-పాత లెక్కలుండవు కదా! నిజానికి అసలీ మోడల్ ఈ కాలానిది కానేకాదు. మన గాంధీతాత రోజుల్లో మోడలిది. ఎంత ఓల్డ్ అయినా కానీ.. ఇప్పుడు కొంచెం స్టైల్‌ను పూసుకుని.. చాలా క్రేజీగా తయారై.. ఇప్పుడు యూత్‌ను ఆకర్షిస్తుంది. ఈ మోడల్‌లో సన్‌గ్లాసెస్‌తో పాటు సైట్ ఉన్నవారి కోసం కూడా ఫ్రేమ్స్ అందుబాటులో ఉన్నాయి.

మిర్రర్ షేడ్స్

ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్స్‌లో ఈ మోడల్ రెండూ లేదా మూడో స్థానంలో ఉందని చెప్పొచ్చు. ఎక్కువగా ఇప్పుడు యూత్ వీటినే ఇష్టపడుతున్నారు.

టింట్ గ్లాసెస్

ఈ ఫ్రేమ్స్ కూడా పార్టీస్, పబ్స్‌లో మనకి కనపడుతూనే ఉంటాయి. రంగురంగుల అద్దాలతో కాస్త డీసెంట్ లుక్కేస్తుంది. ఎదుటివారికి మన కళ్ళు కనపడుతూనే ఉంటాయి.. కానీ కలర్‌ఫుల్‌గా కనపడుతాయి. పార్టీ లుక్ రావడానికి ఎక్కువ వీటివైపు మొగ్గుచూపుతున్నారు.

సైఫై గ్లాసెస్



ఈ మోడల్ చాలా కొత్తగా ఉంటుంది. ఇవి ఎక్కువగా ఇంగ్లీష్ సైన్స్ ఫిక్షన్ సినిమాలల్లో కనపడుతుంటాయి. ఆ మధ్య వచ్చిన విఆర్ బాక్స్ మాదిరిగానే ఉంటుంది. కానీ వీటిలో సన్‌గ్లాసెస్‌తో పాటు సైట్ ఉన్నవారికీ ఫ్రేమ్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ ఎక్కువమంది రోడ్ల మీద ఈ గ్లాసెస్ పెట్టుకుని, తిరగటానికి ఇష్టపడటంలేదు. కానీ ఈ మోడల్ కూడా ఈ ఏడాది మంచి ట్రెండ్‌గా ఉండబోతోందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రెట్రో క్యాట్ ఐస్



ఈ ఫ్రేమ్స్ అచ్చం పిల్లి కళ్లను పోలి ఉంటాయి. సరిగ్గా మన కళ్ళ సైజులో చిన్న ఫ్రేమ్‌కి నల్లటి లెన్స్‌తో చూడటానికి అచ్చం పిల్లికళ్లలా ఉంటాయి. వీటిని ఎక్కువగా అమ్మాయిలూ, పిల్లలూ పెట్టుకోవడం చూస్తుంటాం. ఇవీ ఈ ఏడాది ట్రెండ్‌గా మారబోతున్నాయి. ఇప్పటికే ఎంతోమంది వీటితో ఫోటోలు దిగి, సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నారు.

స్కై గోగుల్స్



ఈ మోడల్‌ను ఎక్కువగా ట్రెక్కింగ్ చేసేవాళ్ళూ, మంచు ప్రాంతాల్లో ఉండేవాళ్ళు, బైక్ రేసర్లూ వాడుతుంటారు. రెండు కళ్ళనూ పూర్తిగా మూసేస్తూ.. నల్లటి లెన్స్ ఉంటాయి. వీటిలో కూడా చాలా డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. మామూలుగానూ ఈ మోడల్‌ను ధరించటానికి వీలుగా డిజైన్లు మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయి. ఎక్కువగా లాంగ్‌డ్రైవ్ చేసేవాళ్లు వీటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు.

ఎంబెల్లిష్డ్ ఫ్రేమ్స్

అందమైన అలంకరణతో చూడ్డానికి చాలా కూల్‌గా ఉంటుందీ ఫ్రేమ్. ఫ్రేమ్ నిండా ఏదోఒక డిజైన్‌తో క్రేజీగా ఉంటుంది. వీటిని ఎక్కువగా వీకెండ్ పార్టీస్‌లో, పబ్స్‌లో వాడుతుంటారు. చిన్న చిన్న మిర్రర్ స్టోన్స్, రంగు రాళ్ళూ వీటికి అమరుస్తారు. అందువల్ల దానికి మరింత కూల్ లుక్ వస్తుంది. ఈ మోడల్ అమ్మాయిలను ఎక్కువగా ఆకర్షిస్తోంది.

కాబట్టీ మీరూ ఈ సమ్మర్లో కొత్త ట్రెండీ గ్లాసెస్ వాడుతూ కూల్ కూల్‌గా ఈ సమ్మరంతా గడిపేయండి. సూర్యకిరణాలకూ, నయనాలకూ మధ్య చల్లని తెరకట్టేయండి!

- ఎస్‌వి బ్రౌన్





కాలేజీ జోరు- ట్యాగ్‌లైన్ల హోరు

కొన్ని ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఊర్లు, పేర్లు, మనుషులూ, సినిమాలూ అవి ఏవైనా కావొచ్చు... కొన్ని పేర్లు ట్యాగ్‌లైన్లతో సహా గుర్తుండిపోతాయి. కాలేజీ రోజుల్లో అయితే అదో గుర్తింపు, అదో సరదా, అదో ఆటవిడుపు. సినిమాలకైతే ట్యాగ్‌లైన్లు వాళ్లే నిర్ణయించేస్తారు కానీ, మనవాళ్ల పేర్లకు మనమే ట్యాగ్‌లైన్లిచ్చేస్తాం. కాలేజీ రోజుల్లో అయితే ఈ తంతును మరీ ఎక్కువగా చూస్తాం. ఒకే బృందంలో ఏ ఇద్దరో, ముగ్గురో అదే పేరుతో ఉంటే ఇంకేం చేస్తాం.. వారి పేరుకో ట్యాగ్‌లైన్ తగిలిస్తాం. అవే ఊరిపేర్లతో రెండో, మూడో ఉన్నా, అలానే ట్యాగ్‌లైన్ తగిలిస్తాం. ఏవి ఎలా ఉన్నా... కాలేజీ లైఫ్‌లో ఒకరికి మనమిచ్చిందో... మనకి ఒకరిచ్చిందో కచ్చితంగా ఒక ట్యాగ్‌లైన్ ఉండే ఉంటుంది. పదండి.. మరోసారి ఆ..జ్ఞాపకాలను నెమరేసుకుందాం.

బైక్ పేరే ట్యాగ్‌లైన్

కొందరికి వారి బైక్ పేరే ట్యాగ్‌లైన్‌గా మిగులుతుంది. కాలేజ్ డేస్ ముగిశాక కూడా.. అదేపేరుతోనే చలామణీ అవుతుంటారు. ఎక్కువగా ఒకే పేరుతో ఇద్దరుముగ్గురు ఉన్నప్పుడు, ఈ ట్యాగ్‌లైన్ అస్త్రాన్ని వాడేస్తారు. 'పల్సర్ శ్రీను, జడ్‌ఎంఆర్ అజయ్, ప్లాటినా వాసు...' ఇలా వారి బండిపేరే వారికి ట్యాగ్‌లైన్‌గా చేరుతుంది. ఎక్కువగా యూత్‌లైఫ్‌లోనే ఈ హడావుడి ఉంటుంది.



బ్రాంచ్ పేర్లూ, ఊరి పేర్లూ ట్యాగ్‌లైన్లే

కొన్నికొన్ని సార్లు... బ్రాంచ్‌పేర్లూ, ఊరిపేర్లూ ట్యాగ్‌లైన్ అవతారం ఎత్తేస్తాయి. సాతులూరు రమేష్, గుంటూరు వాసు, బరంపేట కిషోర్... ఇలా వాళ్ల ఊరిపేర్లు వచ్చి కొందరికి చేరిపోతాయి. ఇలా పిలవడంతో వాళ్లకు స్పెషల్ ఐడెంటిటీ కూడా పెరిగిపోతుంది. దీనిని అందరూ బాగా ఎంజాయ్ చేస్తారు కూడా. ఒకే కాలేజీలో వేరువేరు బ్రాంచ్‌లలో చదివే స్నేహితులకైతే... వారి బ్రాంచ్ పేర్లే ట్యాగ్‌లైన్లుగా వచ్చేస్తాయి. అలా మారుపేర్లతో ఎప్పటికీ గుర్తుండిపోతారు. సరదాగానూ, ఒక తీపిజ్ఞాపకంగానూ మిగిలిపోతుంది.

ఇలా ఎన్నెన్నో

ఒక్కోసారి ఎవరికి ఏ ట్యాగ్‌లైన్ ఎందుకొచ్చిపడుతుందో తెలియదు. అవన్నీ అప్పటికప్పుడు జరిగిపోతాయి. ఏదో గుర్తుండిపోయే సంఘటన జరిగితే చాలు... అప్పటి నుంచి అతన్ని తలుచుకున్నప్పుడల్లా, ఆ సంఘటననూ తలుచుకుంటారు. అలా.. అందరి నోళ్లల్లోనూ నాని, అదే ట్యాగ్‌లైన్‌గా మారిపోతుంది. అలాంటి పేర్లు మరీ గమ్మత్తుగా ఉంటాయి.

ఒకసారి మళ్లీ కాలేజ్ లైఫ్ వరకూ మీ జీవితాన్ని వెనక్కి తీసుకెళ్తే.. ఇలాంటివి బోలెడన్ని విషయాలు గుర్తొస్తాయి. మీకిచ్చిన ట్యాగ్‌లైన్, మీరిచ్చిన ట్యాగ్‌లైన్... మీరంతా కలిసి గమ్మత్తు గమ్మత్తుగా పెట్టేసిన పేర్లూ... అన్నింటినీ ఒకసారి నెమరేసుకోండి.

★



వ్యవస్థలో మార్పు రావాలి అనే ఆశయంతో యువత నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రజల వద్దకు చేర్చే ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. మీ వాయిస్ పంపవలసినది : జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా joshprajasakti@gmail.com **కు మెయిల్ పంపగలరు.**



చిన్నారి



పొడుపు కథ


ఆకాశంలో రక్షణ కవచం..
ఓత్రీ దీని సైన్స్ సంకేతం..
దీన్ని క్షీణింపజేస్తుంది కాలుష్యం..
మందం తగ్గితే ప్రమాదం.. ఎవరిని?

జవాబు : ఓజోన్ పొర

జోక్:

టీచర్ : బాలూ! అరటి పండు గురించి నీకు తెలిసింది చెప్పు?

బాలు : అరటిపండు..తింటే బలపడతాం.. తొక్కితే జారిపడతాం టీచర్!




దారి కనిపెట్టండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో సీసా దగ్గరకు వెళ్ళడానికి దారిని కనిపెట్టండి !

పెన్సిల్.. ఎలా తయారు?

పిల్లలూ.. మీరు రోజూ పుస్తకాల్లో రాసుకోవడానికి పెన్సిల్‌ను ఉపయోగిస్తారు కదా? మరి మీరెప్పుడైనా ఆ పెన్సిల్‌ను ఎవరు కనిపెట్టారో ఆలోచించారా?! అసలు పెన్సిల్ అనేమాటే భలే గమ్మత్తుగా ఉంది కదా! పెన్సిల్ అనే మాట లాటిన్‌లో పెన్సిలన్ అనే శబ్ధం నుంచి పుట్టింది. పెన్సిలన్ అంటే చిన్నతోక అని అర్థం. మొదట్లో పెన్సిల్ అనే పదాన్ని మొనతేలిన కుంచెకు వాడేవారు. ఇప్పుడు ఆ కుంచెకు పెన్సిల్‌కు ఏమీ సంబంధం లేదు. దాదాపు వందేళ్ళ క్రితం పెన్సిల్‌ను తయారుచేయడం మొదలుపెట్టారు. ఇంగ్లాండ్, కంబర్లాండ్ గనిలో గ్రాఫైట్‌ను సుమారు 500 ఏళ్ళకు ముందు కనుగొన్నారని చరిత్రకారుల అంచనా. జర్మనీలోని న్యూరెంబర్గ్‌కు చెందిన ఫేబరు కుటుంబంవారు 1760లో గ్రాఫైట్ పెన్సిళ్ళను విరివిగా చేయడం మొదలుపెట్టారు. వీరికి అంతగా ప్రయోజనం కలగలేదు. ఎన్ జె కోండే అనే అతను 1795లో రేగడి మట్టిని, గ్రాఫైట్‌ను కలిపి సన్నని పుల్లలుగా చేసి పొయ్యిలో వేసి కాల్చాడు. ఈ పుల్లలతో చేసిన పెన్సిళ్ళు బాగా వాడుకలోకి వచ్చాయి. ఇప్పటికీ అన్ని రకాల పెన్సిళ్ళను ఈ పద్ధతిలోనే తయారుచేస్తున్నారు.







పెన్సిళ్ళను లెడ్ పెన్సిళ్ళు అని అంటారు. లెడ్ అంటే సీసం. కానీ ఈ పెన్సిళ్ళలో ఉండేది సీసం కాదు గ్రాఫైట్. పెన్సిళ్ళను తయారు చేయడానికి గ్రాఫైట్ పొడిని ఎండబెట్టి, రేగడిమట్టి, నీటితో కలుపుతారు. సన్నని పుల్లలను యంత్రాల ద్వారా తయారుచేస్తారు. ఈ పుల్లలను ఎండబెట్టి, పొయ్యిలో పెట్టి కాలుస్తారు. అప్పుడవి గట్టిపడతాయి. పైన కర్రను రెండు బద్ధలుగా చేసి, ఎండిన పుల్లలను అందులో ఉంచి, రెండు బద్ధలనూ అతికిస్తారు. కావలసిన విధంగా మెరుగుపెట్టి, పెన్సిళ్లను తయారుచేస్తారు. ★



నేను గీసిన బొమ్మ





ఎస్‌కె. బషీరున్నీసా బేగం,
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూల్

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

SPORTS ఆటలు

బంగ్లా సంచలనం

శ్రీలంకపై 215 పరుగుల రికార్డ్ ఛేదన



రహీమ్ 72 పరుగులు నాటౌట్

కొలంబో : ముక్కోణపు టీ 20 సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో తలపడిన బంగ్లాదేశ్ జట్టు రికార్డ్ ఛేదన చేసింది. తొలుత టాస్ గెలిచిన బంగ్లా ఆతిథ్య శ్రీలంక జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. శ్రీలంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం 215 లక్ష్యాన్ని బంగ్లాదేశ్ జట్టు 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి రికార్డ్ ఛేదన చేసింది. బంగ్లాదేశ్ తరపున తమీమ్ ఇక్బాల్ 47, లిటన్ దాస్ 43 పరుగులు చేసి జట్టును ఆదుకోగా... చివర్లో వికెట్ కీపర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన ముస్తఫికర్ రహీమ్ కేవలం 35 బంతుల్లో 72 పరుగులు సాధించి బంగ్లా జట్టును గెలిపించాడు. తొలుత లంకకు చెందిన కుశాల్ పెరీరా 48 బంతుల్లో 2 సిక్సర్లు, 8 ఫోర్ల సాయంతో 74 పరుగులు చేశాడు. కుశాల్ మెండీస్ 57, ఉపుల్ తరంగ 32 పరుగులు సాధించి జట్టు భారీస్కోర్ సాధనకు తోడ్పడ్డారు. కుశాల్ ద్వయం రెండో వికెట్‌కు 85 పరుగులు జోడించింది. అయితే ఓ దశలో 8 పరుగుల వ్యవధిలో షనకా(0), చండిమాల్(2)లు పెవిలియన్ చేరడంతో శ్రీలంక తడబాటుకు గురైంది. అటు తర్వాత పెరీరాకు జత కలిసిన ఉపుల్ తరంగా సమయోచితంగా ఆడాడు. మరొకవైపు పెరీరా బౌండరీలతో ఎదురుదాడి చేస్తూ లంక బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ 55 పరుగులు జోడించిన తర్వాత పెరీరా ఐదో వికెట్‌గా అవుటయ్యాడు. దీంతో లంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది.

ధనాధన్ షెడ్యూల్...

ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు ఖరారు

ఏప్రిల్-7న ముంబయి × చెన్నై తొలి మ్యాచ్



న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-11 షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం అర్ధరాత్రి విడుదల చేసింది. ప్రారంభ మ్యాచ్ గత ఏడాది ఫైనల్లో ఆడిన ముంబయ్ ఇండియన్స్-చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ముంబయ్‌లోని వాంఖడే స్టేడియంలో జరగనుంది. ఏప్రిల్-7 నుండి మే 27 వరకు మొత్తం 51 రోజులపాటు ఈ టోర్నీ ప్రేక్షకులను కనువిందు చేయనుంది. చెన్నై-రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్‌లను ఇరుజట్లు చెన్నైలోని చిదంబరం స్టేడియం, రాజస్థాన్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరుగుతాయి. కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ 3 మ్యాచ్‌లు మొహాలీలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు ముంబయ్‌లోని వాంఖడే మైదానంలో జరగనున్నాయి. పూర్తి షెడ్యూల్ ఈ క్రింది విధంగా ఉంది.

తేది	జట్లు	వేదిక	సమయం
ఏప్రిల్-7	ముంబై × చెన్నై	ముంబై	రా॥8.00
ఏప్రిల్-8	ఢిల్లీ × పంజాబ్	ఢిల్లీ	సా॥4.00
	కోలకత్తా × బెంగళూరు	కలకత్తా	రా॥8.00
ఏప్రిల్-9	హైదరాబాద్ × రాజస్తాన్	హైద్రాబాద్	రా॥8.00
ఏప్రిల్-10	చెన్నై × కోల్‌కత్తా	చెన్నై	రా॥8.00
ఏప్రిల్-11	రాజస్తాన్ × ఢిల్లీ	జైపూర్	రా॥8.00
ఏప్రిల్-12	హైదరాబాద్ × ముంబై	హైద్రాబాద్	రా॥8.00
ఏప్రిల్-13	బెంగళూరు × రాజస్తాన్	బెంగళూరు	రా॥8.00
ఏప్రిల్-14	ముంబై × ఢిల్లీ	ముంబై	సా॥4.00
	కోల్‌కత్తా × హైదరాబాద్	కలకత్తా	రా॥8.00
ఏప్రిల్-15	బెంగళూరు × రాజస్తాన్	బెంగళూరు	సా॥4.00
	పంజాబ్ × చెన్నై	ఇండోర్	రా॥8.00
ఏప్రిల్-16	కోల్‌కత్తా × ఢిల్లీ	కలకత్తా	రా॥8.00
ఏప్రిల్-17	ముంబై × బెంగళూరు	ముంబై	రా॥8.00
ఏప్రిల్-18	రాజస్తాన్ × కోల్‌కత్తా	జైపూర్	రా॥8.00
ఏప్రిల్-19	పంజాబ్ × హైదరాబాద్	ఇండోర్	రా॥8.00
ఏప్రిల్-20	చెన్నై × రాజస్తాన్	చెన్నై	రా॥8.00
ఏప్రిల్-21	ఢిల్లీ × బెంగళూరు	ఢిల్లీ	రా॥8.00
ఏప్రిల్-22	రాజస్తాన్ × ముంబై	జైపూర్	రా॥8.00
ఏప్రిల్-23	పంజాబ్ × ఢిల్లీ	ఇండోర్	రా॥8.00
ఏప్రిల్-24	ముంబై × హైదరాబాద్	ముంబై	రా॥8.00
ఏప్రిల్-25	బెంగళూరు × చెన్నై	బెంగళూరు	రా॥8.00
ఏప్రిల్-26	హైదరాబాద్ × పంజాబ్	హైద్రాబాద్	రా॥8.00
ఏప్రిల్-27	ఢిల్లీ × కోల్‌కత్తా	ఢిల్లీ	రా॥8.00
ఏప్రిల్-28	చెన్నై × ముంబై	చెన్నై	రా॥8.00
ఏప్రిల్-29	రాజస్తాన్ × హైదరాబాద్	జైపూర్	సా॥4.00
	బెంగళూరు × కలకత్తా	బెంగళూరు	రా॥8.00
ఏప్రిల్-30	చెన్నై × ఢిల్లీ	చెన్నై	రా॥8.00
మే-1	బెంగళూరు × ముంబై	బెంగళూరు	రా॥8.00
మే-2	ఢిల్లీ × రాజస్తాన్	ఢిల్లీ	రా॥8.00
మే-3	కలకత్తా × చెన్నై	కలకత్తా	రా॥8.00
మే-4	కింగ్స్ × ముంబై	మొహాలీ	రా॥8.00
మే-5	చెన్నై × బెంగళూరు	చెన్నై	సా॥4.00
	హైదరాబాద్ × ఢిల్లీ	హైద్రాబాద్	రా॥8.00
మే-6	ముంబై × కలకత్తా	ముంబై	సా॥4.00
	పంజాబ్ × రాజస్తాన్	మొహాలీ	రా॥8.00
మే-7	హైదరాబాద్ × బెంగళూరు	హైద్రాబాద్	రా॥8.00
మే-8	రాజస్తాన్ × పంజాబ్	జైపూర్	రా॥8.00
మే-9	కోల్‌కత్తా × ముంబై	కలకత్తా	రా॥8.00
మే-10	ఢిల్లీ × హైదరాబాద్	ఢిల్లీ	రా॥8.00
మే-11	రాజస్తాన్ × చెన్నై	జైపూర్	రా॥8.00
మే-12	పంజాబ్ × కోల్‌కత్తా	మొహాలీ	సా॥4.00
	బెంగళూరు × ఢిల్లీ	బెంగళూరు	రా॥8.00
మే-13	చెన్నై × హైదరాబాద్	చెన్నై	సా॥4.00
	ముంబై × రాజస్తాన్	ముంబై	రా॥8.00
మే-14	పంజాబ్ × బెంగళూరు	మొహాలీ	రా॥8.00
మే-15	కోల్‌కత్తా × రాయల్స్	కలకత్తా	రా॥8.00
మే-16	ముంబై × పంజాబ్	ముంబై	రా॥8.00
మే-17	బెంగళూరు × హైదరాబాద్	బెంగళూరు	రా॥8.00
మే-18	ఢిల్లీ × చెన్నై	ఢిల్లీ	రా॥8.00
మే-19	రాజస్తాన్ × బెంగళూరు	జైపూర్	సా॥4.00
	హైదరాబాద్ × కలకత్తా	హైద్రాబాద్	రా॥8.00
మే-20	ఢిల్లీ × ముంబై	ఢిల్లీ	సా॥4.00
	చెన్నై × పంజాబ్	చెన్నై	రా॥8.00
మే-22	క్వాలిఫయర్-1 × క్వాలి.2	ముంబై	రా॥8.00
మే-23	ఎలిమినేటర్ × ఎలిమినేటర్		రా॥8.00
మే-25	క్వాలిఫయర్-2 × క్వాలి.2		రా॥8.00
మే-27	వివో-2018 గ్రాండ్ ఫైనల్	ముంబై	రా॥8.00


అజ్లాన్‌షా ట్రోఫీతో ఆస్ట్రేలియా జట్టు



ఐదుకే పరిమితం

అజ్లాన్‌షా హాకీ విజేత ఆసీస్

ఐర్లాండ్‌పై 4-1 భారత్ విజయం

ఇఫో (మలేసియా) : ప్రతిష్టాత్మక అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్లో భారత్ ఐదోస్థానంలో నిలిచింది. శనివారం టోర్నీ 5-6 స్థానాలకు జరిగిన మ్యాచ్‌లో భారత హాకీజట్టు ఐర్లాండ్‌తో తలపడి 4-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. దీంతో టీమిండియా శుక్రవారం ఏ జట్టు చేతిలో అయితే ఓడిపోయి పతక ఆశలను ఆవిరి చేసుకుందో శనివారం అదే జట్టుపై గెలిచి ప్రతీకారం తీర్చుకున్నట్లయ్యింది. మొదటి నుంచి దూకుడుగా ఆడిన భారత్ ఐదో నిమిషంలోనూ తొలి గోల్ నమోదు చేసింది. ఆట ముగిసే సమయానికి భారత్ ఖాతాలో 4 గోల్స్ వచ్చి చేరాయి. భారత్ తరపున వరణ్ కుమార్ (5, 31 ని.లలో), షీలానంద్ లక్రా (28 ని.), గుర్జీత్ సింగ్ (37 ని.)లలో గోల్స్ చేశారు. ఐర్లాండ్ తరపున దలే 48వ నిమిషంలో గోల్ చేశాడు.

ఆసీస్‌కే అజ్లాన్‌షా

శనివారం అజ్లాన్‌షా హాకీ మ్యాచ్ టైటిల్ పోరుకు ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్టు తలపడ్డాయి. హోరా హోరీగా జరిగిన ఈ ఫైనల్లో ఆసీస్ హాకీ జట్టు 2-1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఆసీస్ తరపున గోవర్స్ (38వ ని.), షార్ప్ (52వ ని.)లు గోల్స్ చేశారు. ఇంగ్లండ్ తరపున వార్డ్ (54వ ని.)లో గోల్స్ చేశాడు. దీంతో ఆసీస్‌కు బంగారు పతకంతోపాటు ట్రోఫీని గెలుచుకుంది. రన్నర్స్ ట్రోఫీతోపాటు రజిత పతకాన్ని ఇంగ్లండ్ సాధించింది. కాంస్య పతకం కోసం అర్జంటీనా-మలేషియా జట్ల మధ్య జరిగిన మరో పోరులో అర్జంటీనా జట్టు గెలుపొందింది. ఆ జట్టు 3-2 గోల్స్ తేడాతో ఆతిథ్య మలేషియా జట్టుపై గెలుపొంది కాంస్యపతకాన్ని సొంతం చేసుకుంది. అర్జంటీనా తరపున లోపెజ్, పియోలాట్, ఎల్బ్రరా గోల్స్ చేశారు.

లీగ్ దశ ముగిసిన అనంతరం పాయింట్ల పట్టిక

దేశం	ఆడినవి	గెలుపు	డ్రా	ఓటమి	చే.గోల్స్	ఇ.గోల్స్	అంతరం	పాయింట్లు
1. ఆస్ట్రేలియా	5	5	-	-	18	6	+12	15
2. ఇంగ్లండ్	5	2	2	1	14	9	+5	8
3. అర్జంటీనా	5	2	1	2	11	11	0	7
4. మలేషియా	5	2	0	3	10	17	-7	6
5. భారత్	5	1	1	3	12	12	0	4
6. ఐర్లాండ్	5	1	0	4	9	19	-10	3

2018 అజ్లాన్‌షా హాకీలో భారత జట్టు ప్రదర్శన....

మార్చి 3 : అర్జంటీనాపై 2-3తో పరాజయం
మార్చి 4 : ఇంగ్లండ్‌పై 1-1తో డ్రా
మార్చి 6 : ఆస్ట్రేలియాపై 2-4తో పరాజయం
మార్చి 7 : మలేషియాపై 5-1తో విజయం
మార్చి 9 : ఐర్లాండ్‌పై 2-3తో పరాజయం
మార్చి 10 : ఐర్లాండ్‌పై 4-1తో విజయం (5-6 స్థానాలకు)

తుది ఫలితాలు...

ట్రోఫీ + బంగారు పతకం : ఆస్ట్రేలియా
రజిత పతకం : ఇంగ్లండ్
కాంస్య పతకం : అర్జంటీనా
4వ స్థానం : మలేషియా
5వ స్థానం : భారత్
6వ స్థానం : ఐర్లాండ్

బీసీసీఐకు ఫిర్యాదు చేస్తా : హసీన్



కోల్‌కతా : టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమిపై అతని భార్య హసీన్ నాలుగు రోజులుగా మీడియాలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలిసిందే. శనివారం హసీన్ జహాన్ విలేకరులతో మాట్లాడుతూ 'త్వరలో బీసీసీఐ ప్రతినిధులను కలిసి.. షమిపై ఫిర్యాదు చేస్తా. తగిన చర్యలు తీసుకోమని కోరతా. ఈ రోజు నేను ఈ సమస్యను బీసీసీఐ దృష్టికి తీసుకువెళ్లకపోతే భవిష్యత్తు లో ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడే అవకాశం ఉంది. అందుకే బీసీసీఐని కలవాలని అనుకుంటున్నా' అని హసీన్ తెలిపింది. ఇప్పటికే షమీకి బీసీసీఐ కాంట్రాక్టు... ఐపీఎల్‌లో ఆడే దానిపై స్పష్టత లేదు.

అజ్ఞాతంలోకి...

షమీ భార్య హసీన్ ఫిర్యాదుతో కోల్‌కతా పోలీసులు పలు సెక్షన్ల క్రింద షమీతోపాటు అతని కుటుంబ సభ్యులపై ఇటీవల కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే కేసు నమోదు అనంతరం షమీ ఎవరికీ అందుబాటులో లేకుండా పోయాడు. షమీ తన మొబైల్ ఫోన్ సైతం స్విచ్ఛ్ ఆఫ్ చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. అతని మొబైల్ లోకేషన్ ప్రకారం చివరిసారిగా ఢిల్లీ ఎయిర్ పోర్ట్ నుంచి అతని సోదరుడితో ఘజియాబాద్ ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. అయితే తన కుటుంబ సభ్యుల్లో కొందరు కోల్‌కతాలోని తన భార్య కుటింబీకులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. షమీ మాత్రం మీడియాకు దూరంగా ఉండమని తన కుటుంబ సభ్యులకు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే షమీ, అతని సోదరుడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు.

నాపై బురదచల్లే ప్రయత్నం : షమి

గత మూడు రోజుల నుంచి వరుసగా హసీన్ చేస్తున్న వ్యాఖ్యల్లో నిజం లేదని అవన్నీ తనపై బురద చల్లే ప్రయత్నంలో భాగమని షమి అన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు షమితో పాటు మరో నలుగురిపై హత్యాయత్నం, గృహహింసతో పాటు పలు సెక్షన్ల కింద కలకత్తాలోని జాధవ్‌పూర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే.


విజేతలకు ట్రోఫీని అందిస్తున్న జెఎన్‌టియు విసి

ముగిసిన జెఎన్‌టియు సెంట్రల్ క్రీడలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

జెఎన్‌టియు కాకినాడ పరిధిలోని ఇంజినీరింగ్ కాలేజీలకు గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కంటెపూడి నలంద ఇంజినీరింగ్ కాలేజీలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ క్రీడలు శనివారం ముగిశాయి. ఖోఖో, కబడ్డీ, బాల్‌బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జట్లు తలపడ్డాయి. ఖోఖోలో జిఎంఆర్ ఐటి (రాజాం)పై చీరాల ఇంజినీరింగ్ కాలేజీ, కబడ్డీలో శ్రీ శివాని ఇంజినీరింగ్ కాలేజీ (శ్రీకాకుళం)పై సెయింట్ ఆన్స్ చీరాల విజయం సాధించాయి. టేబుల్ టెన్నిస్‌లో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ (గుడ్లవల్లేరు)పై గాయత్రి విద్యాపరిషత్ (విశాఖపట్నం), బాస్కెట్‌బాల్‌లో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజ్ (విజయవాడ)పై కోరంగి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాకినాడ), వాలీబాల్‌లో పేస్ ఇంజినీరింగ్ కాలేజ్ (ఒంగోలు)పై బివిసి ఇంజినీరింగ్ కాలేజ్ (రాజమండ్రి) విజయకేతనం ఎగుర వేశాయి. చెస్‌లో వివిఐటి కళాశాల (నంబూరు)పై జివిపి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విశాఖపట్నం), బాల్ బ్యాడ్మింటన్‌లో జిఎంఆర్ఐటి (శ్రీకాకుళం)పై న్యూటన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ (మాచర్ల), షటిల్ బ్యాడ్మింటన్‌లో ఐడియల్ ఇంజినీరింగ్ కాలేజ్ (కాకినాడ)పై ఎంజిఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ (విజయనగరం) విజేతలుగా నిలిచాయి. విజేతలకు జెఎన్‌టియు వైస్ చాన్సలర్ విఎస్ఎస్ కుమార్ ట్రోఫీలు అందించారు.

దక్షిణాఫ్రికా ఆధిక్యం



పోర్ట్‌ఎలిజబెత్ : దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 39 పరుగులతో శనివారం ఆటను కొనసాగించిన సఫారీ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ఇంకా మూడు వికెట్లు చేతిలో ఉండగా ఆస్ట్రేలియాపై 20 పరుగుల ఆధిక్యతను సంపాదించింది. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ ఎబి డివిలియర్స్ మరోమారు అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఆ జట్టులో ఓపెనర్ ఎల్గర్(57), హషీమ్ ఆమ్లా (56) పరుగులతో రాణించారు. రెండోరోజు ఆట నిలిచిపోయే సమయానికి డివిలియర్స్ 74, ఫిలాండర్ 14 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఆస్ట్రేలియా బౌలర్లు కమ్మిన్స్, మిచెల్ మార్స్‌కు రెండేసి వికెట్లు లభించాయి.

రబాడపై రెండు టెస్ట్ మ్యాచ్‌ల నిషేధం

రెండో టెస్టులో మైదానంలో దక్షిణాఫ్రికా ఆటగాడు రబాడ దురుసుగా ప్రవర్తించి రెండు మ్యాచ్‌ల నిషేధానికి గురయ్యాడు. రబాడ మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లపై ఇలా దురుసుగా ప్రవర్తించడం, నిషేధాన్ని ఎదుర్కోవడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ అతడిపై ఐసీసీ నిషేధం విధించింది. ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య శుక్రవారం రెండో టెస్ట్ తొలిరోజు ఆటలో 52వ ఓవర్లో రబాడ బౌలింగ్‌లో ఆసీస్ జట్టు సారథి స్టీవ్ స్మిత్ ఎల్బీడబ్ల్యూ రూపంలో ఔటయ్యాడు. వెంటనే రబాడ.. స్మిత్ వైపుకు దూసుకొచ్చి ఉద్దేశ్యపూర్వకంగా అతని భుజాన్ని తాకాడు. దీనిపై మైదానంలో ఉన్న అంపైర్లుకు స్మిత్ ఫిర్యాదు చేశారు. ఐసీసీ లెవల్-2 నిబంధనను అతిక్రమించినట్లు తేలడంతో రబాడ మ్యాచ్ ఫీజులో 100 శాతం కోతతో పాటు... రెండు 3 డీమెరిట్ పాయింట్లు జతచేశారు. ఈ మ్యాచ్ ప్రారంభం ముందే రబాడ ఖాతాలో 5 డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. ఈ రెండు పాయింట్లు కలిపితే అది 8కి చేరింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏ ఆటగాడి ఖాతాలోనైనా 8 డీమెరిట్ పాయింట్లు వస్తే రెండు టెస్టు మ్యాచ్‌ల నిషేధం విధించాలి. ఇప్పుడు రబాడ విషయంలో ఐసీసీ అదే చేసింది. దీంతో రబాడ కేప్‌టౌన్ (మార్చి 22 నుంచి), జోహానెస్‌బర్గ్(మార్చి 30 నుంచి)లో జరిగే టెస్టులకు దూరమైనట్లే.



ఇంగ్లండ్‌కే వన్డే సిరీస్

క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్-ఇంగ్లండ్‌ల మధ్య జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ గెలుచుకుంది. శనివారం జరిగిన నిర్ణయాత్మక ఐదో వన్డేలో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో కివీస్ జట్టుపై గెలుపొంది ఈ సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టు 49.5 ఓవర్లలో 223 పరుగులు మాత్రమే చేసింది. ఆ జట్టులో హెన్రీ నికోలస్, సాంట్‌నర్ అర్ధ సెంచరీలతో రాణించారు. వోక్స్, రషీద్‌కు మూడేసి వికెట్లు, టామ్ కరన్‌కు రెండు వికెట్లు లభించాయి. ఆ లక్ష్యాన్ని ఇంగ్లీషు జట్టు కేవలం 32.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ జట్టు ఓపెనర్ బారిస్ట్రో కేవలం 60 బంతుల్లో 6 సిక్సర్లు, 9 ఫోర్ల సాయంతో 104 పరుగులు చేశాడు. హేల్స్ 61 పరుగులు చేయగా... క్రిస్ వోక్స్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, జానీ బారిస్ట్రోకు మ్యాన్ ఆఫ్ మ్యాచ్ అవార్డు లభించాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68